అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

గురువారం 3-8-2017

సంపుటి : 3 సంచిక : 216 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

ఎన్ని కేసులేసినా..

భయపడం

కాంగ్రెస్‌కు ముఖ్యమంత్రి హెచ్చరిక

- ప్రజలపాలిట పిశాచిలా తయారైంది
- ఆ పార్టీ దుష్ట పన్నాగాలతో ప్రజలకు నష్టం: కేసీఆర్
- ప్రజాక్షేత్రంలో ఎదుర్కొంటామని వ్యాఖ్య



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ఉద్యమ సమయంలో కాంగ్రెస్ నేతలు తమకు ప్రజలు అధికారం అప్పగిస్తారని ఆశించి భంగపాటుకు గురయ్యారని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అన్నారు. ఉద్యమ సమయంలో వారు వ్యవహరించిన అనుచిత శైలి, నిబద్ధత లేమిని గుర్తించిన ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారన్నారు. బుధవారం ప్రగతి భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల్లో విశ్వాసం కోల్పోవడం వల్లే వారు ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని అడ్డుకొనే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చాక తెరాస చేపడుతోన్న పటిష్టమైన పథకాలు, ప్రోయాక్టివ్ రోల్ చూసి తమకు ఇక పుట్టగతులు ఉండవనే భయంతో.. కేసుల పురాణం మొదలు పెట్టి తెలంగాణ ప్రజల పట్ల పిశాచిలా తయారయ్యారని దుయ్యబట్టారు. ఎన్ని కేసులు పెట్టినా సమర్థంగా ఎదుర్కొంటామని స్పష్టంచేశారు. ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేయాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా తెలంగాణను అభ్యుదయ రాష్ట్రంగా మార్చే దష్టినుంచి తమను మరల్చలేరని.. ఉక్కు, వజ్ర సంకల్పంతో తమ ప్రభుత్వం ముందుకెళుతుందని స్పష్టంచేశారు.

సమాన పనికి సమాన వేతనమే మా విధానం

విద్యుత్ సంస్థల్లో ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఉత్తర్వులను హైకోర్టు సస్పెండ్ చేసిన అంశంపై సీఎం స్పందిస్తూ.. వారిని తాము క్రమబద్ధీకరించలేదన్నారు. ఎన్నో ఏండ్లుగా విద్యుత్ సంస్థల్లో రాత్రింబవళ్లు కష్టపడి కాంట్రాక్టర్ల దోపిడీ కింద నలిగిపోతున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను సంస్థలోకి తీసుకోవాలని మాత్రమే నిర్ణయించిన విషయాన్ని న్యాయస్థానం గుర్తించాలని సూచించారు. అయితే, దళారీ వ్యవస్థను తొలగిస్తూ న్యాయస్థానం మానవతా దక్పథంతో వ్యవహరించిందని అన్నారు. ఒప్పంద విద్యుత్ సిబ్బందికి రూ.21,784 ఇవ్వాలని బోర్డు ప్రతిపాదిస్తే.. హైకోర్టు రూ.22 వేలు ఇవ్వాలని సూచించిందన్నారు. కానీ తమ ప్రభుత్వం ఆ కార్మికులకు రూ.23వేలు ఇవ్వాలని నిర్ణయించినట్టు చెప్పారు. ఈ వేతనాల పెంపుతో విద్యుత్ సంస్థలపై రూ.25 కోట్ల అదనపు భారం పడుతుందన్నారు. ఒప్పంద కార్మికులకు సమాన వేతనం ఇచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. అన్ని శాఖల్లోనూ ఒప్పంద ఉద్యోగుల వివరాలను సేకరించనున్నట్టు తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనేదే తమ ప్రభుత్వ విధానమని స్పష్టంచేశారు.

చీవాట్లు పెడుతున్నా బుద్ధి రాదా?

కాంగ్రెస్ పార్టీ చేస్తోన్న దుష్ట రాజకీయాలతో ప్రజల ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టులు చీవాట్లు పెడుతున్నా కాంగ్రెస్ ...9లో

> రాష్ట్రంలో మొగ్గదశలోనే ఉన్న మాదకద్రవ్యాల వ్యవహారాన్ని తుంచేయాలని అధికారులను ఆదేశించాం. ఈ వ్యవహారంతో క్యాబినెట్ మంత్రికి సంబంధం ఉన్నా వదలొద్దు. ఎవరినీ ఖాతరు చేయొద్దు. ఈ వ్యవహారంతో ప్రభుత్వానికి సంబంధం ఉందని కాంగ్రెస్ నేత దిగ్విజయ్ సింగ్ ఆరోపించారు. మంచి చేసినా హర్షించే విజ్ఞతలేని పార్టీలు ఉండటం దురదష్టకరం.

వామపక్షాలు, నవతెలంగాణ పత్రికపై సీఎం గుస్సా 3




క్రమబద్ధీకరణపై స్టే

అప్పటివరకు సర్వీసుల కొనసాగింపు, వేతనాల చెల్లింపు: హైకోర్టు

- సర్కార్ ఉత్తర్వులు నాలుగు వారాల పాటు సస్పెన్షన్
- మధ్యంతర ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విద్యుత్ సంస్థల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న 21 వేల మంది సర్వీసుల క్రమబద్ధీకరణ ఉత్తర్వులను ఉమ్మడి హైకోర్టు సస్పెండ్ చేసింది. నాలుగు వారాలపాటు స్టే ఇచ్చింది. తదుపరి ఆదేశాలు వెలువడే వరకు క్రమబద్ధీకరణ ప్రక్రియను నిలుపుదల చేయాలని బుధవారం హైకోర్టు డివిజన్ బెంచ్ మధ్యంతర ఆదేశాలిచ్చింది. నాలుగు వారాల్లోగా ప్రతివాదులైన విద్యుత్ సంస్థలు, విద్యుత్ సం స్థల యాజమాన్యాలు తమ వాదనలు, అభిప్రాయాలతో కౌంటర్ పిటి షన్లు దాఖలు చేయాలని ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ జె.ఉమాదేవిలతోకూడిన డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. ట్రాన్స్‌కో, ...9లో




కర్నాటకలో సోదాలు...

పార్లమెంట్‌లో ప్రకంపనలు

కాంగ్రెస్ మంత్రి ఇంటిపై ఐటీ దాడులు

- ఉభయసభల్లో ప్రధాన ప్రతిపక్ష పార్టీ ఆందోళన
- రాజకీయ కక్ష సాధింపునకు పాల్పడుతున్నారని ఆగ్రహం
- గుజరాత్ రాజ్యసభ సీటు కోసమే: ఖర్గే
- బీజేపీ నేతలు ఒక్కో ఎమ్మెల్యేకు రూ.15 కోట్లు పంచుతున్నారు : ఆజాద్
- సోదాలకు ఎన్నికలతో సంబంధం లేదు: జైట్లీ



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

కర్నాటక మంత్రి డికె శివకుమార్ ఇంటిపై ఆదాయపుశాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సోదాలు చేపట్టడం పార్లమెంట్ ఉభయసభల్లో ప్రకంపనలు సృష్టించింది. గుజరాత్‌కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఓ రిసార్టులో సంరక్షిస్తున్నాడన్న ఏకైక కారణంతో రాజకీయ కక్షతో మంత్రి ఇంటిపైకి కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పిందని ఆ పార్టీ ఆరోపించింది. గుజరాత్ రాజ్యసభ మూడో సీటునూ వశపరుచుకోవాలన్న దురుద్దేశంతో...9లో



భన్వర్‌లాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న వామపక్షాల నాయకులు

ఇంత జరుగుతున్నా..

మౌనమేల.?

హిమాన్షు వ్యవహారంపై సీఎంకు వామపక్షాల ప్రశ్న

- కేటీఆర్‌పై చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలి: ఎన్నికల కమిషనర్‌కు వినతిపత్రం

వివరాలు 9లో

మహిళపై ఎస్సై కర్కశత్వం

- కొడుకు దొంగతనం చేశాడని తల్లిపై దాడి
- బంగారం, డబ్బు గుంజుకుపోయిన వైనం

నవతెలంగాణ-కామారెడ్డి

కొడుకు దొంగతనం చేశాడని అతడి తల్లిపై ఓ పోలీసు తన కర్కశత్వం ప్రదర్శించాడు. మహిళ అని కూడా చూడకుండా విచక్షణా రహితంగా కొట్టాడు. దీంతో బాధితురాలు లేవలేని స్థితికి చేరుకుని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈఘటన కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలో బుధవారం ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... నిజాంసాగర్ మండలం కోమలంచ గ్రామానికి చెందిన కుర్మ బాలమణి కొడుకు రాజు తునికిపల్లి తండాల్లో సెల్‌ఫోన్ దొంగతనం చేసినట్టు ఆరోపణ వచ్చింది. ఈ నేపథ్యంలో నిజాంసాగర్ ఎస్సై అంతిరెడ్డి అతన్ని అదుపులోకి తీసుకొని విచారించారు. పోలీసుల దెబ్బలు తట్టుకోలేక తన తల్లికి ఇచ్చినట్టు చెప్పాడు. దీంతో ఎస్సై తన సిబ్బందితో కలిసి సోమవారం అర్ధరాత్రి రాజు ఇంటికి వెళ్లారు. తల్లిదండ్రులైన బాలమణి, మల్లయ్యను అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడిచేశారు. బీరువాను తెరిచి వస్తువులను చిందరవందరగా పడేశారు.



ఆస్పత్రిలో బాధితురాలిని పరామర్శిస్తున్న నాయకులు

అనంతరం రాజు తల్లిని ఇష్టానుసారంగా కొట్టారు. వారివద్ద నుండి రూ.50 వేలు, బంగారు గొలుసు లాక్కెళ్లారు. తీవ్ర గాయాలైన ఆమె కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈఘటన బుధవారం వెలుగుచూడటంతో సీపీఐ(ఎం), సీఐటీయూ, వ్యకాస, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. బాధితురాలిని పరామర్శించిన అనంతరం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సిద్దిరాములు మాట్లాడుతూ ...9లో

ఫ్లాప్ షో

- కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం,నిర్మాత విక్రమ్ గౌడే..
- ప్రజల సానుభూతి, ఫైనాన్స్ సెటిల్‌మెంట్ల కోసం కాల్పులు
- రూ.50 లక్షలకు బేరం..ఎనిమిది మందితో ప్లాన్
- ఐదుగురు నిందితుల అరెస్టు

వివరాలు 9లో

పట్టాదారు ఒకరు...రుణదాత మరొకరు



- బోగస్ పాసుబుక్కులపై రూ.6 కోట్ల స్వాహా
- తహసీల్దార్, బ్యాంకు, ఏసీబీ అధికారులకు రైతుల ఫిర్యాదు..స్పందన కరువు
- హైకోర్టును ఆశ్రయించిన బాధితులు
- విచారణకు ఆదేశించిన కోర్టు

9లో


గ్యాస్ రాయితీ

ఎత్తివేత వెనుక..



శశిరూయియా(ఎస్సార్ గ్రూపు అధినేత) ముఖేశ్‌అంబానీ(రిలయన్స్ అధినేత)మధ్యలోమోడీ (ఫైల్)

వంటగ్యాస్ సబ్సిడీని పూర్తిగా ఎత్తి వేయాలన్న మోడీ ప్రభుత్వ నిర్ణయం వెనుక రిలయన్స్, ఎస్సార్ ఆయిల్‌వంటి బడా కంపెనీల ప్రయోజనాలు దాగి ఉన్నాయా..? ఏటా వేలకోట్లమేర లాభాలు సమకూర్చాలన్న ప్రణాళిక ఉన్నదా..? ఘటనల వరుసక్రమం చూస్తే అవుననే అనిపిస్తున్నది. అదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం వంటగ్యాస్ (ఎల్‌పీజీ) సిలిండర్ ధరను నెలకు రూ.4 చొప్పున పెంచుకుంటూ పోవాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. వంటగ్యాస్‌పై ఇప్పుడు పేదలకు ఇస్తున్న రాయితీని పూర్తిగా తొలగించే వరకూ(జీరో అయ్యే వరకూ) ప్రతి నెలా పెంచుకుంటూ పోనున్నట్టు చమురుశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ లోక్‌సభలో లిఖితపూర్వకంగా స్పష్టం చేశారు. అయితే, వంటగ్యాస్ సిలిండర్ ధరను గతేడాది జులై నుంచే ప్రతినెలా రూ.2 చొప్పున పెంచుతూ వచ్చారన్నది గమనార్హం. 9లో



పాయింట్లు సరే... వీటి సంగతేంటి?

సర్కారుకు సామాన్యుల ప్రశ్నావళి

- ఆదాయ వనరుగానే ట్రాఫిక్ ఉల్లంఘనలు
- వ్యవస్థల్ని సరిదిద్దకుండా ఇవేం పనులు?
- రోడ్లు అధ్వాన్నం
- ఇష్టారాజ్యంగా జంక్షన్ల మూసివేత
- పార్కింగ్ ప్రాంతాల కుదింపు
- బ్రోకర్ల అడ్డాగా రవాణాశాఖ కార్యాలయాలు

ఎస్.ఎస్.ఆర్ శాస్త్రి



సర్కారు 'దేవతావస్త్రాలు' కట్టుకుంది. అవును... ఎక్కడో విదేశాల్లో ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాయింట్ల విధానం అమల్లో ఉందని, దాన్ని తెచ్చి గ్రేటర్ హైదరాబాద్ వాహనదారులపై రుద్దే ప్రయత్నాన్ని ప్రారంభించింది. మరి ఆయా దేశాల్లో రోడ్ల పరిస్థితి ఏంటి? తెలంగాణలో పరిస్థితి ఏంటి? హైదరాబాద్‌లో లాగే విదేశాల్లో కూడా రోడ్ల మధ్యలో మెట్రోరైల్ వంటి ప్రాజెక్టుల్ని ఏండ్ల తరబడి నిర్మిస్తున్నారా? మన రోడ్లు లాగానే విదేశీ రోడ్లు ఉన్నాయా? అక్కడి జనాభా ఎంత...ఇక్కడి జనాభా ఎంత? అక్కడి అక్షరాస్యత ఎంత...తెలంగాణలో అక్షరాస్యత ఎంత? విదేశీయుల కంప్యూటర్ పరిజ్ఞానం ఏపాటిది...తెలంగాణ ప్రజల్లో ఈ పరిజ్ఞానం ఏ మేరకు ఉంది. మన రవాణాశాఖలో ఉన్నట్టే విదేశాల్లోనూ అవినీతి ఉందా? బ్రోకర్‌ను ఆశ్రయించకుండా ఎంతమంది డ్రైవింగ్ లైసెన్సులు తెచ్చుకుంటున్నారు? లెర్నింగ్ లైసెన్స్ కావాలంటే కంప్యూటర్ పరీక్ష పాస్ కావాలి...ఆ పరిజ్ఞానం మన గ్రామీణుల్లో ఉందా? జంక్షన్‌కు ఇవతలివైపు నుంచి చూస్తే ఆఫీస్ బిల్డింగ్ కనిపిస్తుంది. పట్టుమని పది అడుగులు కూడా ...9లో

మన ఈవీఎంలకు హ్యాక్ ముప్పు

• అమెరికన్ శాస్త్రవేత్తల ప్రకటన



వాషింగ్టన్ : అమెరికాలోని కొంత మంది శాస్త్రవేత్తలు తయారుచేసిన పరికరాలు అతి సులువుగా మన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (ఈవీఎం) ప్రభావితం చేయగలవట. మిచిగాన్ వర్సిటీ తయారుచేసిన గృహోపకరణం సాయంతో మొబైల్ ఫోన్ మన చేతిలో ఉంటే చాలట. ఎన్నికల ఫలితాలను తారుమారు చేయడానికి వీలుగా మన ఈవీఎంల పని తీరును మార్చివేయచ్చునంటున్నారు ఆ శాస్త్రవేత్తలు. అయితే ఇది సాధ్యంకాదని భారత ఎన్నికల కమిషన్ అధికారులు అంటున్నారు. అంతేకాదు, అలా ఈవీఎం పనితీరును మార్చివేయడానికి ఒక ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాన్ని సంపాదించడం కూడా సాధ్యం కాదని వారు అంటున్నారు. మన దేశంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు దాదాపు 14 లక్షల ఈవీఎంలను ఉపయోగిస్తారు. తాజాగా మిచిగాన్ వర్సిటీ అధికారులు ఇంటర్నెట్‌లో ఉంచిన వీడియోలో ఇండ్లలోనే తయారుచేసే పరికరాన్ని, మన దేశంలోని ఉపయోగంలో ఉన్న ఎలక్ట్రానిక్ యంత్రానికి జతచేసిన తరువాత అది పని చేసే తీరును ప్రొఫెసర్ అలెక్స్ హాల్డర్‌మన్ వివరించారు. మొబైల్ ఫోన్ సాయంతో అందులోని భద్రతా వ్యవస్థలను దెబ్బతీయవచ్చునని ఆయన అంటున్నారు. వాటి సాయంతో పోలింగ్ సరళి ముగిసిన తర్వాత మొత్తం ఓట్ల లెక్కింపు సమయంలో ఇది పనిచేసి తప్పుడు అంకెలు వచ్చేలా చేయగలదు. అంతేకాక, దానికి అమర్చిన మైక్రో ప్రాసెసర్ సాయంతో లెక్కింపు కేంద్రానికి చేర్చేలోపునే అందులోని ఓట్ల వివరాలను తుడిచిపెట్టేయవచ్చునంటున్నారు ఆయన.

మాఫియా-పోలీస్ దోస్తీ

భింద్ (మధ్యప్రదేశ్) : మధ్యప్రదేశ్ రాష్ట్రంలో మాఫియా ముఠాలకూ, పోలీసులకూ మధ్య అనైతిక సంబంధాలు ఉన్నాయనే విషయాన్ని నిరూపించే సీసీటీవీ ఫుటేజ్ వెలుగులోకి వచ్చింది. ఇసుక మాఫియా ఆగడాలు రాష్ట్రంలో విచ్చలవిడిగా సాగుతున్నాయి. మార్చి నెల 19వ తేదీన చంబల్ నదీ తీరంలో విస్తృతంగా సాగుతున్న ఇసుక మాఫియా కార్యకలాపాలను డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ సుఖదేవ్ అరోరా మరికొందరు అధికారులతో కలిసి అడ్డుకునే ప్రయత్నం చేశాడు. ఆ క్రమంలో ఆయనపై దాడి జరిగింది. అటేరా పోలీసు స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు వెళ్లింది. ఎనిమిది మంది పేర్లు నమోదు చేసారు. వారంతా పరారీలో ఉన్నారని పోలీసులు ప్రకటిస్తూ వచ్చారు. అంతవరకూ అంతా బాగానే ఉంది. అయితే జులై 15 నాటి సీసీటీవీ ఫుటేజ్‌లో దృశ్యాలు గమనిస్తే ఆ నిందితులంతా స్థానిక పోలీస్ స్టేషన్‌లో దర్జాగా కూర్చుని పోలీస్ స్టేషన్ అధికారితోను, ఇతర అధికారులతోను ధీమాగా కబుర్లు చెబుతుండడం స్పష్టంగా కనిపిస్తోంది. సీసీటీవీలోని వారిలో ఒకరి పేరు రమణ్ సింగ్ భదోరియా. పోలీసుల దగ్గర ఉన్న రికార్డులలో ఈ రమణ్ సింగ్ భదోరియాకు ఇసుక మాఫియాలో భాగస్వామ్యం ఉన్నట్టు స్పష్టంగా ఉంది. అయినా తమ ఎదురుగా స్వేచ్ఛగా తిరుగుతున్న మాఫియా దోషులు పరారీలోనే ఉన్నారని ఆ పోలీసు స్టేషన్ అధికారులు చెప్పడం పోలీసులకూ, మాఫియాకు మధ్య ఉన్న సాన్నిహిత్యం దాచినా దాగని సత్యం అన్న విషయం మనకు స్పష్టమవుతుంది. ఇలాంటి ఘటన ఇదే మొదటిదికాదు. గతంలో మాఫియాను అడ్డుకున్న ఐపీఎస్ అధికారి నరేంద్ర కుమార్‌పై ట్రాక్టర్ ట్రాలీని ఎక్కించి మరీ చంపివేశారు. ఆ ఘటనపై ఇప్పటివరకూ జరిగిన దర్యాప్తులో ఎలాంటి పురోగతీ లేదు.

అవినీతి కేసుల్లో ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్

న్యూఢిల్లీ: దేశంలో 48 మంది ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్‌లు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారని కేంద్రం వెల్లడించింది. 23 మంది ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్(ఐఏఎస్), ముగ్గురు ఇండియన్ పోలీస్ సర్వీస్(ఐపీఎస్), 22 మంది ఇండియన్ రెవెన్యూ సర్వీస్(ఐఆర్ఎస్) అధికారులపై దర్యాప్తు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్ లోక్‌సభలో బుధవారం తెలిపారు.

కాశ్మీర్ మరింత కల్లోలం

ఈ యేడాదిలో 184 'ఉగ్ర' ఘటనలు

పదేండ్లలో ఇదే అత్యధికం



న్యూఢిల్లీ: పదేండ్లలో ఎన్నడూ లేనంతగా ఈ యేడాది కాశ్మీర్‌లో హింసాత్మక ఘటనలు జరిగాయి. గడిచిన ఏడు నెలల్లో 184 ఉగ్రవాద సంబంధిత ఘటనలు చోటు చేసుకున్నట్టు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారామ్ వెల్లడించారు. కాశ్మీర్‌లో కల్లోల పరిస్థితులపై ఎంపీ నరేశ్ అగర్వాల్ అడిగిన ప్రశ్నకు రాజ్యసభలో బుధవారం ఆయన రాతపూర్వక వివరణ ఇచ్చారు. గతేడాది జులైలో హిజ్‌బుల్ కమాండర్ బుర్హాన్ వానీ మృతి అనంతరం కాశ్మీర్ అట్టుడికిన సంగతి తెలిసిందే. అయితే.. ఈ ఏడాదిలోనే అత్యధిక ఉగ్రదాడి ఘటనలు జరిగినట్టు కేంద్రం వెల్లడించింది. గతేడాదిలో జనవరి నుంచి జులై వరకు 154 ఘటనలు చోటు చేసుకున్నాయని గంగారామ్ తెలిపారు. ఏడాది మొత్తంగా చూస్తే 2014లో 222, 2015లో 208, 2016లో 322 హింసాత్మక ఘటనలు జరిగినట్టు ఆయన వివరించారు. 2016లో 150 మంది(జనవరి నుంచి జులై వరకు 109 మంది) ఉగ్రవాదులు ఎన్‌కౌంటర్లలో హతమైతే ఈ యేడాది ఇప్పటివరకు 117 మందిని భద్రతాదళాలు మట్టుబెట్టాయని చెప్పారు.

అంతేకాక.. 2016లో పోలీసుల కాల్పుల్లో 15 మంది కాశ్మీరీలు చనిపోతే... ఈ ఏడు నెలల్లో 19 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. టాప్ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులంటూ 12 మందితో కూడిన జాబితాను యేడాది ప్రారంభంలో ఆర్మీ వెల్లడించిన సంగతి తెలిసిందే. కాగా.. వీరిలో ఇప్పటికే ఆరుగురిని(అబూ దుజానా, సబ్జార్ అహ్మద్ భట్, జునైద్ మత్తూ, బషీర్ వానీ, సద్దాం పడ్డార్, యాసిన్ ఇట్టూ, అల్తాఫ్ దార్) భద్రతాదళం మట్టుబెట్టింది.

సోషల్



టాయిలెట్లో సర్కారీ స్కూలు

మధ్యప్రదేశ్‌లో విద్యాబోధన తీరిది..



భోపాల్ : 'భారత్ చదివితేనే.. అభివృద్ధిలో ముందడుగు వేస్తుంది', 'బేటీ బచావో..బేటీ పడావో..' అనేవి బీజేపీ నినాదాలు. కానీ మధ్యప్రదేశ్‌లో ప్రాథమిక విద్యాబోధన జరుగుతున్న తీరు చూస్తే... బీజేపీ పాలనలో చదువులు ముందుకు సాగుతాయా.. అన్న చర్చ షురూ అయ్యింది. మధ్యప్రదేశ్‌లోని నీమచ్ జిల్లాలోని ఓ గ్రామంలో టాయిలెట్లో చదువు చెబుతున్న చిత్రాలు ఇప్పుడు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ పాఠశాలకు సరైన వసతుల్లేవు. టాయిలెట్లనే పాఠశాలగా మార్చేశారు. ఈ చిత్రాలు బయటకు రావటంతో.. బీజేపీ పాలిత రాష్ట్రంలో విద్యావ్యవస్థ చెంపపెట్టుగా మారిందన్న విమర్శలు వస్తున్నాయి. నీమచ్ జిల్లాలోని మానస్ తహశీల్ పరిధిలోని మోక్లాపుర గ్రామంలో ప్రైమరీ స్కూలు స్థాపన 2012లో జరిగినట్టు సర్కారు కాగితాల్లో ఉన్నది. వాస్తవానికి ఐదేండ్ల తర్వాత కూడా ఒక్క గదీ నిర్మించలేదు. ఈ పాఠశాలలో మొదటి తరగతి నుంచి నాలుగో తరగతివరకు చదువుకునేందుకు... 17 మంది విద్యార్థులు వస్తుంటారు. ఇక్కడ కైలాశ్ చంద్ర రాథోడ్ ఒక్కరే టీచర్. అన్ని తరగతులకూ ఆయన చదువు చెబుతుంటారు. ప్రస్తుతం ఉన్నది చాలా పురాతన భవనం కావడంతో... అది పాములు, తేళ్లకు స్థావరంగా మారింది. ఏడాదంతా పిల్లలకు చెట్టునీడన విద్యాబోధన చేస్తున్నారు. కానీ వర్షాకాలంలో మాత్రం అలా సాధ్యంకావటంలేదు. దాంతో తల్లిదండ్రులు కూడా పిల్లలను పాఠశాలకు పంపేవారు కాదు. కానీ అక్కడి టీచర్ రాథోడ్ మాత్రం పట్టువదలని విక్రమార్కుడిలా.. పేద బిడ్డలను విద్యావంతుల్ని చేయాలని సంకల్పించారు. ఆయన తీసుకున్న చొరవ కారణంగా.. స్థానికులు తమ బిడ్డల్ని చదువుకు పంపుతున్నారు. అయితే చదువు ఆపకుండా సాగించటం ఎలా అని రాథోడ్ తెగ ఆలోచించేవారట. ఇంతలో ఆ గ్రామంలో ప్రభుత్వ భవనం పేరిట టాయిలెట్ నిర్మాణం జరిగింది. దాన్ని ఏ ఉద్దేశంతో కట్టారో కానీ.. ఆ పని అసంపూర్తిగానే మిగిలిపోయింది. ఈ టాయిలెట్‌నే పాఠశాలగా మార్చారు. కాగా, ఈ 'టాయిలెట్ పాఠశాల' అంశం సామాజిక మాధ్యమంలో హల్‌చల్ చేయడంతో చిన్నారుల చదువుపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తే.. అక్కడ 20 మంది లోపు విద్యార్థులు ఉన్నారు. కాబట్టి వారిని మరో స్కూలుకు షిఫ్ట్ చేస్తామని అన్నారు. మోక్లాపుర గ్రామ విద్యార్థుల చదువును శివరాజ్ సింగ్ చౌహాన్ సర్కారు లైట్ తీసుకుంటున్న తీరు స్థానికుల ఆగ్రహానికి కారణమవుతున్నది.

విద్యార్థులకు 'కాషాయ' పరీక్ష

యూపీలో రంగం సిద్ధం చేసిన బీజేపీ

లక్నో : యూపీలో తొమ్మిదివేల పాఠశాలల్లోని విద్యార్థులకు నిర్వహించతలపెట్టిన జనరల్ నాలెడ్జి పరీక్షకు సంబంధించిన సిలబస్ ప్రకారం భారతదేశం హిందూ మత రాష్ట్రం. వివేకానంద 'హిందూత్వ' ప్రతినిధిగా చికాగోలో మాట్లాడారు. ఉత్తరప్రదేశ్ వ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించతలపెట్టిన ఆబ్జెక్టివ్ టైప్ కాంపిటీటివ్ పరీక్షకు విద్యార్థులు ప్రిపేరయ్యేందుకు 'సామాన్య జ్ఞాన ప్రతియోగిత' పేరుతో బీజేపీ ఒక బుక్‌లెట్‌ను విడుదల చేసింది. పార్టీ సిద్ధాంతకర్త దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 26న ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు. ఈ బుక్‌లెట్‌ను ఆ పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా చేతుల మీదుగా లక్నోలో ఇటీవలే విడుదల చేశారు. బాలబాలికల్లో హిందూత్వ బీజాలను నాటేందుకే విద్యార్థులకు బీజేపీ ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్టు విమర్శలొస్తున్నాయి. 'జనరల్ నాలెడ్జి' పేరుతో నిర్వహిస్తున్న ఈ పరీక్షల్లో మోడల్ ప్రశ్నలను కొన్నిటిని ఆ బుక్‌లెట్‌లో పేర్కొన్నారు. అందులో 1. భారత్ హిందూ దేశమని ఎవరు చెప్పారు? జవాబు. డా. కేశవ్ డాక్టర్ కేశవ్ బలిరాం హెడ్గేవార్. 2. చికాగోలో జరిగిన 'ధర్మ సభలో' స్వామి వివేకానంద ఏ మతానికి నేతృత్వం వహించారు? జ: హిందూత్వ. 3. మహారాజ్ సుహేల్దిని ముక్కలుగా చేసిన ముస్లిం ఆక్రమణదారుడు ఎవరు? జ. సయ్యద్ సలార్ మసూద్ ఘజి. 4. రామ్ జన్మభూమి ఎక్కడ ఉంది? జ. అయోధ్య. 5. హరిజనుల గురించి గాంధీ మరియు కాంగ్రెస్‌ల వాదనలను సవాలు చేస్తూ అంబేద్కర్ రాసిన పుస్తకం? జ. అంటరాని వారికి కాంగ్రెస్, గాంధీ చేసిందేమిటి? 'సమాన్య జ్ఞాన ప్రతియోగిత 2017లో భాగంగా విద్యార్థులకు పంపిణీ చేస్తున్న 70 పేజీల బుక్‌లెట్‌లో ఇలాంటి ప్రశ్నలున్నాయి. వివేకానంద చికాగోలో చేసిన తన ప్రసంగంలో హిందూ మతం గురించి మాట్లాడారు. కానీ, బీజేపీ రాజకీయ మ్యాని ఫెస్టో 'హిందూత్వ' గురించి కాదన్నది వాస్తవం. దీన్ని బట్టి ఈ పుస్తకం యొక్క ఉద్దేశం స్పష్టమవుతోంది. ఈ బుక్‌లెట్‌లో బీజేపీ రామజన్మభూమి ఎజెండాకు సంబం ధించిన ప్రశ్నలతోపాటు, పెద్ద నోట్ల రద్దు సహా ప్రధాని మోడీ విధానాలు, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు సంబంధించిన కొన్ని ప్రశ్నలు కూడా ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది లక్షలమంది ఈ పరీక్షను రాస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సుభాష్ యదువన్ష్ అన్నారు. 'రాబోయే కొత్త తరం చరిత్రలోని గొప్ప వ్యక్తుల గురించి చరిత్ర కారుల గురించి తెలుసుకోవాలి. ఆర్ఎస్ఎస్ ఒక అతి పెద్ద సామాజిక సంస్థ అన్నది వాస్తవం. ఈ బుక్‌లెట్‌లో ఉన్నవన్నీ వాస్తవాలే. ఇందులోంచే మేము నిర్వహించే పరీక్షలో ప్రశ్నలు అడుగుతాం. హిందూత్వ గురించి ప్రజలు తెలుసుకోవాలి, ఎందుకంటే అది ఒక మంచి జీవనశైలి" అని సుభాష్ యదువన్ష్ చెప్పడం గమనార్హం.

అంతర్జాతీయం

రష్యాపై అమెరికా ఆంక్షలు

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా రష్యాపై ఆంక్షలు మోపారు. ఈమేరకు బుధవారం ఓ బిల్లుపై సంతకం చేశారు. గతనెల 27న ఈ బిల్లుకు అనుకూలంగా యూఎస్ సెనెట్, ప్రతినిధుల సభలోని మెజారిటీ సభ్యులు ఓటు వేసిన సంగతి తెలిసిందే. రెండు సభల్లో రెండింట మూడు వంతుల కంటే ఎక్కువ మెజారిటీ దక్కడంతో ఈ బిల్లును వీటో చేసే అధికారం దేశాధ్యక్షుడి కూడా ఉండదు. కాగా, గతేడాది అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరుపున పోటీ చేసిన ట్రంప్ ప్రచార కార్యక్రమాలకు పుతిన్ సహకరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా పుతిన్‌పై ప్రశంసలు కొనసాగిస్తున్నారు. ఉగ్రవాద నిర్మూలనలో రష్యాతో కలిసి ఉమ్మడిపోరుకు సిద్ధంగా ఉన్నామని పలు సందర్భాల్లో ప్రకటించారు. ఈ నేపథ్యంలో రష్యాతో ద్వైపాక్షిక సంబంధాలను తగ్గించుకోవాలని గతకొంతకాలంగా యూఎస్ కాంగ్రెస్ నుంచి ఒత్తిళ్లు పెరిగాయి. రష్యాను దూరంగా ఉంచాలని మెజారిటీ యూఎస్ సెనెటర్లు కోరుతున్నారు. అంతేగాకుండా, సిరియాలో చెలరేగిన అంతర్యుద్ధాన్ని తెరదించేందుకు పుతిన్ సర్కార్ ఆరేండ్ల నుంచి ప్రయత్నిస్తోంది. ఒక పక్క సిరియా అధ్యక్షుడు అస్సద్‌ను గద్దె దించాలని అమెరికా ప్రయత్నిస్తుండగా..మరో పక్క సిరియాకు బాసటగా రష్యా నిలిచింది. ఈ పరిణామాలను యూఎస్ కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతున్నది.

విమానం ఆగగానే..

అత్యవసర ద్వారం తెరిచి దూకేశాడు


వాషింగ్టన్ : విమానం ఆగిపోగానే అత్యవసర ద్వారాన్ని తెరిచి ఓ 17 ఏండ్ల యువకుడు కిందకి దూకేశాడు. తోటి ప్రయాణికులు అతడిని ఆపేలోపే ఇదంతా జరగడంతో అందరూ ఆశ్చర్యపోయారు. అమెరికాలోని పనామా సిటీ నుంచి శాన్‌ఫ్రాన్సిస్కో వచ్చిన విమానంలో ఈ ఘటన జరిగింది. 17ఏండ్ల యువకుడు శాన్‌ఫ్రాన్సిస్కోలో విమానాశ్రయంలో విమానం ఆగిన నిమిషంలోనే వెంటనే అత్యవసర ద్వారాన్ని తెరచి కిందకి దూకేశాడు. రన్‌వేపై ఉన్న సిబ్బంది గుర్తించి వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ప్రమాదంలో అతడికి ఎటువంటి గాయాలు కాలేదని విమానాశ్రయ ప్రతినిధి యాకెల్ తెలిపారు. ఆ యువకుడు ఎంతో ఆత్రుతగా.. గబగబా వెళ్లిపోయి డోర్ ఓపెన్ చేసేశాడు.. కనీసం అతడిని ఆపేందుకు అవకాశం కూడా ఇవ్వనంత వేగంగా వెళ్లిపోయానడని తోటి ప్రయాణికులు చెబుతున్నారు. అసలు అతడు ఎందుకు అలా ప్రవర్తించాడనే విషయం మాత్రం తెలియరాలేదు. పోలీసులు యువకుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ఇమ్రాన్ ఖాన్‌పై మహిళ ఆరోపణలు

ఇస్లామాబాద్: పాకిస్థాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్(పీటీఐ) అధినేత , మాజీ క్రికెటర్ ఇమ్రాన్ ఖాన్ తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని అదే పార్టీకి చెందిన ఓ మహిళా నేత ఆరోపించింది. అయేషా గులాలాయ్ అనే మహిళా నేత ఇస్లామాబాద్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇమ్రాన్ తనకు అసభ్యకర సందేశాలు పంపేవారని అతని వల్ల తాను చాలా ఒత్తిడికి గురవుతున్నానని పేర్కొంది. అంతేకాకుండా తాను పార్టీ నుంచి తప్పుకోనున్నట్టు వెల్లడించింది. పనామాగేట్ కుంభకోణంలో నిందితుడిగా పేర్కొంటూ పాక్ మాజీ ప్రధా ని నవాజ్ షరీఫ్‌ను సుప్రీం కోర్టు గద్దెదించిన సంగతి తెలిసిందే. దాంతో, ప్రధాని పదవి చేపట్టాలని ఇమ్రాన్ ఖాన్ దేశవ్యాప్తంగా భారీ ర్యాలీ నిర్వహించనున్న నేపథ్యంలో అతనిపై ఇలాంటి ఆరోపణలు రావడం గమనార్హం.

ఉత్తరకొరియాతో శత్రుత్వం లేదు..!

చర్చలతోనే సమస్యలన్నింటికీ పరిష్కారం : అమెరికా విదేశాంగ మంత్రి టిల్లర్సన్



వాషింగ్టన్ : ఉత్తరకొరియాతో తమకు ఎలాంటి శత్రుత్వం లేదని అమెరికా విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్సన్ తెలిపారు. ఆదేశ పద్దతులను మార్చుకోవాలని తామెన్నడూ ఒత్తిడి తీసుకురాలేదన్నారు. ఉ.కొరియా దుందుడుగు చర్యలను తిప్పిగొట్టేందుకే తాము ప్రయత్నిస్తున్నామని అన్నారు. కొరియా ద్వీపకల్పంలో నెలకొన్న పరిస్థితులను అదుపులోకి తీసుకొచ్చేందుకు ఆ దేశంతో చర్చలు జరిపేందుకైనా తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఉ.కొరియా సరిహద్దులో తమ బలగాలను మోహరించలేదని బుకాయించేందుకు ప్రయత్నించారు. ఉ.కొరియా అణ్వస్త్ర పరీక్షలు నిర్వహించడంతోనే ఇరుదేశాల మధ్య ఉద్రిక్తత నెలకొందన్నారు. ఉ.కొరియా తమకు శత్రుదేశమే కాదన్నారు. కొరియా ద్వీపకల్పంలో శాంతి స్థాపన, భద్రత కోసం ఆ దేశంతో చర్చలు జరిపేందుకైనా తాము సిద్ధమేనని అన్నారు. ఉ.కొరియా దుందుడుగు చర్యలను నియంత్రించే సామర్థ్యం చైనాలో మాత్రమే ఉందన్నారు. అయితే, ఆదేశాధ్యక్షుడు జిన్‌పింగ్ ఆ దిశగా ప్రయత్నించడం లేదని విమర్శించారు. కాగా, ఉ.కొరియా శత్రుదేశమైనా దక్షిణ కొరియాకు అమెరికా సహకరిస్తున్నది. ద.కొరియా అంతర్గత వ్యవహారాల్లో తలదూర్చేందుకు ప్రయత్నిస్తోంది. ఆ దేశానికి క్షిపణుల దాడులను తిప్పిగొట్టే సామర్థ్యమున్న థాడ్ (టెర్మినల్ హై ఆల్టిట్యూడ్ ఏరియా డిఫెన్స్) పరిజ్ఞానాన్ని అందించింది.

అయితే, ఈ పరిజ్ఞానం తమకు అందజేయాలని ద.కొరియా అమెరికాను ఏనాడూ కోరలేదు. ఉ.కొరియా, ద.కొరియా దేశాల మధ్య దూరం పెంచేందుకే అమెరికా కుట్ర పన్నింది. ద.కొరియాకు మద్దతిస్తున్నట్టు కపటనాటకాలేస్తూ ఉ.కొరియాను నియంత్రించేందుకు ప్రయత్నిస్తోంది. అయితే, తాజాగా, ఉ.కొరియా ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులు విజయవంతం కావడంతో అమెరికాలో గుబులు మొదలైంది. ఆదేశంతో చర్చలు జరిపేందుకు ఓ మెట్టు దిగివచ్చింది.

సిరియాలో శాంతిస్థాపన కోసం కృషి :

సిరియాలో శాంతి స్థాపన కోసం కృషి చేస్తున్నట్టు అమెరికా విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్సన్ తెలిపారు. సిరియాలో పెట్రేగిపోయిన ఉగ్రసంస్థల కార్యకలాపాలను అంతమొందించేందుకు రష్యా బలగాలతో కలిసి పనిచేస్తున్నామని అన్నారు. అయితే, ఇటీవలి కాలంలో ఇరుదేశాల మధ్య పలు అంశాలపై అభిప్రాయబేధాలు తలెత్తాయన్నారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు సన్నగిల్లాయని అన్నారు.


అమెరికా-రష్యా మధ్య సంబంధాలు బలోపేతం కావాలన్నదే అమెరికన్ల ఆకాంక్ష అన్నారు. 2016లో 35మంది రష్యా దౌత్యవేత్తలను అమెరికా బహిష్కరించింది. ఇద్దరు రష్యన్ల ఆస్తులను స్వాధీనం చేసుకున్నది. ఒబామా హయాంలో దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నామని టిల్లర్సన్ అన్నారు. రష్యాపై మోపిన ఆంక్షలను కూడా త్వరలో ఎత్తివేయనున్నట్టు తెలిపారు. మనీలాలో జరిగిన సదస్సులో రష్యా విదేశాంగ మంత్రి సెర్గే లావ్‌రోవ్‌తో సమావేశమై ఉగ్రవాద నిర్మూలనపై చర్చించానని అన్నారు. ఐఎస్, అల్‌ఖైదా ఉగ్రసంస్థల కార్యకలాపాలను కట్టడి చేసేందుకు ఉగ్రవ్యతిరేక ఉమ్మడి ఆపరేషన్ నిర్వహిస్తామన్నారు.

ఉత్తర కొరియాపై మాకు నియంత్రణ లేదు : చైనా స్టేట్ మీడియా

ఉత్తర కొరియాపై తమకు నియంత్రణ లేదని చైనా స్టేట్ మీడియా పేర్కొన్నది. ' ఉత్తర కొరియాను చైనా మాత్రమే ఒంటి చేతితో నియంత్రించగలదని గతనెల30న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ట్వీట్ చేశారు. ఆయన అభిప్రాయం సరైంది కాదు.

కొరియా ద్వీపకల్పంలో చోటు చేసుకుంటున్న ఉద్రిక్తతను నియంత్రించే ప్రయత్నాలు జరపలేదన్న విషయాన్ని మేం ఏమాత్రం అంగీకరించం. ఉ.కొరియా, అమెరికా మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను నియంత్రించేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నాం. అయితే, అణ్వస్త్ర పరీక్షలు నిలిపివేయకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ట్రంప్ సర్కార్ ఉ.కొరియాను బహిరంగంగా హెచ్చరిస్తున్నది. అగ్రరాజ్యం హెచ్చరికలను ఉ.కొరియా బేఖాతరు చేస్తున్నది' అని ప్రకటించింది.

ఖండాంతర క్షిపణి ప్రయోగించిన అమెరికా



అమెరికా వాయుసైన్యం మినట్‌మన్-3 అనే ఖండాం తర క్షిపణిని ప్రయోగించింది. ఉత్తర కొరియా ఐసీబీఎం (ఇంటర్ కాంటినెంటల్ బాలిస్టిక్ మిసైల్)ను ప్రయోగించిన నేపథ్యంలో తామీ ప్రయోగం జరిపినట్టు పేర్కొన్నది. ఓ వైపు ఉత్తరకొరియాతో యుద్ధం కోరుకోవడం లేదంటూనే అమెరికా వాయుసే ఖండాంతర క్షిపణుల ప్రయోగాన్ని ప్రారంభించింది. ఓ వైపు శాంతి కోరుకుంటున్నా మంటూనే.. మరోవైపు కయ్యానికి కాలుదువ్వుతున్నది. యూఎస్ వాయుసేన తెలిపిన వివరాల ప్రకారం...లాస్ ఏంజిల్స్ నుంచి 210 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉత్తర వాండెన్‌బర్గ్ వైమానిక స్థావరం నుంచి బుధవారం ఖండాంతర క్షిపణిని ప్రయోగించినట్టు తెలిపింది. ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని దెబ్బతీయాలన్న ఉద్దేశం తమకేమీ లేదని ఎయిర్‌ఫోర్స్ గ్లోబల్ స్ట్రయిక్ 30వ వింగ్ కమాండర్ కల్నల్ మైకెల్ హఫ్ తెలిపారు. ఇదిలా ఉండగా, ఉత్తర అమెరికా భూభాగానికి చేరుకోగల సామర్థ్యమున్న హ్వాసాంగ్-14 అనే ఖండాంతర క్షిపణిని గతనెల4న ఉత్తరకొరియా ప్రయోగించిన సంగతి తెలిసిందే. 2,802 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న లక్ష్యాలను కేవలం 39 నిమిషాలలో ఢీకొనగలదని తెలిపింది.

జర్మనీలో 1.86 కోట్ల మంది శరణార్థులు

ఫెడరల్ స్టాటిస్టిక్స్ కార్యాలయం

బెర్లిన్ : జర్మనీ జనాభాలో కోటీ 86లక్షల మంది శరణార్థులు ఉన్నట్టు తాజా సర్వేలో వెల్లడయింది. ఫెడరల్ స్టాటిస్టిక్స్ కార్యాలయం (ఎఫ్ఎస్ఓ) తెలిపిన వివరాల ప్రకారం...శరణార్థులకు ఆశ్రయం కల్పించడంలో జర్మనీ అగ్రస్థానంలో ఉన్నది. జర్మనీ ఛాన్స్‌లర్ ఏంజెలా మెర్కెల్ శరణార్థులకు ఆశ్రయం కల్పించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఓపెన్ డోర్ పాలసీ సత్ఫలితాలను ఇచ్చింది. జర్మనీ ప్రస్తుత జనాభా 8కోట్ల 24లక్షలు. జనాభాలో 1.86కోట్ల మంది శరణార్థులను గుర్తించినట్టు ఎఫ్ఎస్ఓ తెలిపింది. 2015లో జర్మనీకి శరణార్థుల తాకిడి పెరగడంతోనే ఈ సంఖ్య నమోదైందని పేర్కొన్నది. 2014-16 మధ్య కాలంలో ఐరోపాలో ఆశ్రయం కోసం 16లక్షల మంది దరఖాస్తు చేసుకున్నట్టు ఎఫ్ఎస్ఓ తెలిపింది.



వామపక్షాలది గతించిన గతం


మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

సీఎం గరం..గరం

"లెఫ్ట్‌పార్టీలు ఉన్నాయా రాష్ట్రంలో... అవి కాలం చెల్లిన పార్టీలు. వరంగల్‌లో 300 ప్రజాసంఘాల వామపక్ష కూటమి పోటీచేస్తే 350 ఓట్లు కూడా రాలేదు. కనీసం డిపాజిట్ కూడా రాలేదు. వాళ్లు చెప్పిందానిపై మేం మాట్లాడాలా..? అయినా అదంతా భన్వర్‌లాల్ చూసుకుంటడు.. మగటీం ఉనోళు ..ఆధారాలతో రావాలి. భన్వర్‌లాల్ ఎందుకయ్యా.. నువ్వే (వామపక్షాలనుద్దేశించి) పెట్టు.. వామపక్షాలు చేసిన ఆరోపణలన్నీ బేస్‌లెస్. ఫాల్స్ అలిగేషన్స్. మేం ఏ దందాలు చేయడం లేదు. వాళ్లకు సంవత్సరానికి ఆరు సమ్మెలు కావాలి. ఇప్పుడు చేసే వాడు లేడు. జీహెచ్ఎంసీ కార్మికులకు నేనే పెంచినా..వాళ్లు డిమాండ్ చేసిర్రా.! అంగన్‌వాడీ, ఆశ వర్కర్లకు కూడా పిలిచి వేతనాలు పెంచిన, ఎవడన్నా అడిగిండా..? ఇవన్నీ చేసేటప్పటికీ యూనియన్లకు దిక్కుతోచడం లేదు. లెఫ్ట్ పార్టీలకు ఏం బాధ్యత ఉంది.. ఎందుకు రోజురోజుకు కృంగి కృశించి పోతున్నాయి. ఓ నిర్మాణం ఉందా.. కథుందా..? రివ్యూ చేసుకోరా.. తిట్టడం, నిందించడం అర్థం పర్థం లేని ఆరోపణలు చేయడమేనా.? సురవరం సుధాకర్‌రెడ్డి ఇక్కడికి వచ్చి కూడా పిచ్చి స్టేట్‌మెంట్ ఇచ్చిండు. జాతీయ కార్యదర్శికి ఈ సిల్లీ పాయింట్లు అవసరమా..? రాష్ట్రంలో కమ్యూనిస్టులది గడిచిపోయిన గతం. మున్ముందు కూడా ప్రొగ్రెస్ ఉండదు. కాంగ్రెస్ వాళ్లు, ప్రెస్టేషన్‌లో ఉన్నారు. వారి భవిష్యత్ శూన్యం. మల్లన్న సాగర్‌కు 16వందలు భూమి అవసరం, దీనిలో 1490 ఇచ్చారు. మిగిలిన వేములఘాట్ గ్రామాన్ని కమ్యూనిస్టు భూతాలు పట్టుకున్నాయి..."

మూర్ఖులకు అపాయింట్‌మెంట్ ఇవ్వం..!

మూర్ఖులకు ఇవ్వం.. ఎట్లిస్తరయ్యా మూర్ఖులకు.. అపాయింట్‌మెంట్ ఇవ్వం, ధర్నాలు చేసి, హరాకిరి చేసి ఇంకా కలుసుడేంది. అడ్డం పొడువు,, ఎవ్వడు వడితే వాడు, ఎక్కడ వడితే అక్కడ ఏది వడితే అది మాట్లాడుతరు..? ఏదన్న మాట్లాడాలంటే ఓపెన్ మైండ్‌తో రావాలి. బయటంతా ఇష్టానుసారంగా మాట్లాడి..అపాయింట్‌మెంట్ అడిగితే ఎలా..? వాళ్లను మీరైనా సంస్కరించాలి. ఇ ప్పటికీ వందసార్లు చెప్పాను. గజ్వేల్ నా నియోజకవర్గం, ఎర్రవల్లి నా వ్యవసాయ క్షేత్రం. ఫామ్ హౌజ్‌కు జల్సాలకు పోతుండంటడు ఓ మూర్ఖుడు. దాన్ని మీరు రాస్తారా..? 15 ఏండ్లు కష్టపడి, కేంద్రమంత్రి పదవిని చెప్పుకాళ్లతో పక్కకేసి తెలంగాణ తెచ్చిన. ఈ కూతలు కూసే నా కొడుకులు ఎక్కడున్నరు వీళ్లు..? జోకర్, బ్రోకర్ కొడుకులు. మొన్నో పిచ్చోడు..వచ్చి విషం తాడిండు. ఇలాంటోళ్లకు అపాయింట్‌మెంట్ ఇస్తామా..?

గుర్ఖాలాండ్ ఉద్యమంపై ఇప్పుడే చెప్పలేం..

పశ్చిమబెంగాల్ నుంచి విడదీసి ప్రత్యేక గుర్ఖాలాండ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని చేస్తున్న ఉద్యమానికి ఇప్పుడే ఏం చెప్పలేమని సీఎం కేసీఆర్ తెలిపారు. ప్రస్తుతానికి ప్రత్యేక గుర్ఖాలాండ్ ఉద్యమంపై విధానపరమైన నిర్ణయమేదీ తీసుకోలేదని, అలా తీసుకోలేక పోవడానికి అనేక కారణాలున్నాయని అన్నారు. గుర్ఖాలాండ్ అంతర్జాతీయ సరిహద్దులో ఉందనీ, ఉన్నట్టుండి ఇప్పుడే ఉద్యమం ఉధృతం కావడంపై చైనా హస్తముండొచ్చనే వార్తలు వస్తున్నాయని చెప్పారు. గుర్ఖాలాండ్ ఏర్పడితే ఈశాన్య రాష్ట్రాల్లో కల్లోలం చెలరేగే అవకాశం ఉందని కేంద్రం భావిస్తుందని అన్నారు. ఒక వేళ మా స్టాండ్ చెప్పాల్సి వస్తే పార్టీలో చర్చించి చెబుతామని చెప్పారు.

గుండాగురి చేస్తే ఊరుకుంటరా..?

సిరిసిల్లా జిల్లాలోని నేరెళ్లలో 9 లారీలను అంటుపెడితే, ఇష్టమొచ్చినట్టు గుండాగిరి చేస్తే పోలీసులు ఊరుకుంటరా.? వారికి దళితులనే బోర్డు ఉందా..? అని సీఎం కేసీఆర్ ప్రశ్నించారు. దళితులపై దాడి చేయమని టీఆర్ఎస్ ప్రభుత్వం చెబుతుందా..? ఆ అవసరం ముందా..? అని అన్నారు. అనుకోకుండా జరిగింది. పదిమందిలో ముగ్గురో, నలుగురో దళితులున్నారు.. కానీ మొత్తం దళితులపై దాడి చేస్తున్నారని ప్రచారం చేస్తున్నరు.. ఓ దళితవాడపై జరిగితే దాన్ని అనొచ్చు. మీరాకుమార్‌కు ఇక్కడ బొగ్గు తెలంగాణ కనిపిస్తున్నది. ఆమెకు ఓట్లెస్తే బంగారు తెలంగాణ అవుతుంది..!

మేం చేయగలిగింది గిందే..!

ఎన్నిసార్లు చెప్పాలి..హైకోర్టు ఇవ్వకుంటే నువ్విస్తావా..? మేం చేయగలిగింది గిందే...! సమాన వేతనమిచ్చి గౌరవిస్తాం..ఉద్యోగ భద్రత కల్పిస్తాం.! మేం చేస్తున్నాం..కోర్టులు కొట్టేస్తున్నయి.అదే రాయ్.. ఉద్యోగభద్రతపై విలేకరుల ప్రశ్నకు సీఎం కేసీఆర్ సమాధానమిది. పాజిటివ్ గవర్నమెంట్‌లో నెగెటివ్ వార్తలు దొరకవ్.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారమే రెగ్యులరైజేషన్ చేస్తున్నాం. కాంట్రాక్టు ఉద్యోగుల కడుపు నింపే బాధ్యత చూస్తున్నాం.

సమస్య ప్రతిపాదికన వెంకయ్యకు మద్దతు!

రాష్ట్రపతి ఎన్నికల సమయంలో ప్రధానితో మాట్లాడాను. దళిత, గిరిజనులకు అవకాశమివ్వాలని కోరాం. దళితుడిని నియమించినట్టు ఆయన చెప్పాడు. మద్దతిచ్చాం. తెలుగువాడు కావడంతోనే వెంకయ్యానాయడకు మద్దతిచ్చాం. కేంద్ర రాష్ట్రంతో సత్సంధాల కోసం ప్రయత్నం చేస్తున్నాం. దేశం బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది. నేను లౌకికవాదిని. దేశంలో అన్ని మతాలు, కులాలు జీవించేందుకు అవకాశమున్నది. మన దేశంలో అన్ని పండుగలు జరుపుకుంటాం.

వారి మెళ్లో దళితులని బోర్డు ఉందా..? : కేసీఆర్

'దళితులను కొట్టాలని ఏ ప్రభుత్వమైనా.. పోలీసులకు చెబుతుందా.. ? అయినా.. వారి మెళ్లో దళితులనే బోర్డులున్నాయా..? అని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రశ్నించారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశం సందర్భంగా.. సిరిసిల్ల జిల్లా నేరెళ్ల ఘటనపై విలేకరులు ప్రశ్నించగా ఆయన ఈ విధంగా స్పందించారు. 'అక్కడ ఇసుక లారీలను తగులబెట్టారు.. ఈ కేసులో ఉన్న వారిలో ముగ్గురు, నలుగురే దళితులున్నారు. దాన్ని దళితుల సమస్యగా కాంగ్రెస్ చిత్రీకరిస్తున్నది...' అని మండిపడ్డారు. లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ కూడా ఈ అంశంపై స్పందించారు కదా...? అని అడగ్గా.. మీరా కుమారా..? బోరా కుమారా..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులకు వాహనాల కొనుగోలుకు సంబంధించి హర్షా టయోటా, హిమాన్షు మోటార్స్‌పై జైరామ్ రమేశ్ సిల్లీ ఆరోపణలు చేశారని అన్నారు. వాటిని నిరూపించకుంటే... అబిడ్స్‌లో ముక్కు నేలకు రాస్తారా.? అని సవాల్ విసిరారు. ఆ పిచ్చోడు చేసిన కామెంట్‌పై నన్ను అడుగుతారా.? అని మీడియా ప్రతినిధులను ఎదురు ప్రశ్నించారు. సర్పంచ్‌గా గెలవలేని జైరామ్ రమేశ్ 'రాజ్యసభ బగ్' అని ఎద్దేవా చేశారు. తాను వంద శాతం లౌకికవాదినని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అంశాల వారీగా తాము ఎన్డీయేకు మద్దతిస్తున్నామని చెప్పారు. సీట్లు పెంచినా, పెంచకున్నా తమకు ఒకటే అని ఆయన స్పష్టం చేశారు. జైరామ్ రమేశ్ రాసిన డ్రాఫ్ట్ కారణంగానే నియోజకవర్గాల పెంపు జరగడం లేదన్నారు. సీట్లు పెరగకపోయినప్పటికీ తమకు ఎలాంటి ఇబ్బందులూ లేవని అన్నారు. రాజకీయంగా స్థిరంగా కొనసాగుతున్నామని వ్యాఖ్యానించారు. ముస్లిం రిజర్వేషన్లపై కేంద్రం సానుకూలంగా వ్యవహరించకుంటే.. అప్పుడు కేంద్రంతో తేల్చుకుంటామన్నారు. ఎస్సీలకు మాత్రం జీవో ద్వారా రిజర్వేషన్లు అమలు చేస్తామని అన్నారు. గుర్ఖాలాండ్ రాష్ట్ర ఏర్పాటుపై పార్టీలో చర్చించిన తరువాత వైఖరి వెల్లడిస్తామని చెప్పారు.

హామీ అమలైంది...

'ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తున్నాం. అయితే కోర్టు కొట్టివేస్తోంది. కాబట్టి ఏం చేయలేం. రెగ్యులర్ ఉద్యోగులకు ఇచ్చినట్టుగా వేతనాలు ఇచ్చి వారి కడుపు నింపుతాం.' అని సీఎం తెలిపారు. క్రమబద్ధీకరణ చెల్లదని కోర్టు చెబుతున్న క్రమంలో ఏం చేయలేం.. ఇక హోంగార్డులను కూడా క్రమబద్ధీకరించలేం, వారికి కూడా కాంట్రాక్ట్ లెక్చరర్ల మాదిరిగా వేతనాలు పెంచుతామని ప్రకటించారు. ఇందుకోసం అన్ని విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించి, తర్వాత కేబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

'హిమాన్షు'పై సీఎం దాటవేత ధోరణి...

హిమాన్షు మోటార్స్ వ్యవహారంపై సీఎం కేసీఆర్ అసలు విషయాలు చెప్పకుండా దాటవేశారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఈ అంశంపై విలేకరులు పదేపదే అడిగిన ప్రశ్నలకు ఆయన ఎలాంటి సమాధానం ఇవ్వకుండా దాటవేశారు. మంత్రి కేటీఆర్‌పై విలేకరులు ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు కదా...? అని అడగ్గా.. ఫిర్యాదు గురించిగాని, అఫిడవిట్‌లో కేటీఆర్ పేర్కొన్న అంశాల గురించిగానీ ముఖ్యమంత్రి ఎలాంటి వివరణా ఇవ్వలేదు. వామపక్షాలను, కాంగ్రెస్‌నూ ఉద్దేశించి... 'గట్స్ ఉంటే ఆధారాలతో సహా నిరూపించాలి...అంతే తప్ప బేస్‌లెస్‌గా మాట్లాడొద్దు..' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో అన్ని ఆధారాలు, ప్రూఫ్స్‌తో సహా ఈసీకి వినతిపత్రం సమర్పించిన వామపక్షాల ప్రశ్నలకు ఆయన సూటిగా, సహేతుకమైన సమాధానాలేవీ ఇవ్వకపోవటం గమనార్హం.

ఆ పత్రిక అవసరమా..? నవతెలంగాణపై సీఎం అక్కసు

" ఏం రాస్తరండీ.. అదేదో పేపర్ నవతెలంగాణ.. బహుషా ఆ పేపర్ విలేకరనుకుంటా..? మల్లన్న సాగర్ స్థలాన్ని ఇంజనీర్ల సెలక్షన్.. నాది కాదు. ఫామ్‌హౌజ్‌స్ దగ్గరుంటుంది మేములఘాట్ ఊరు. అక్కడికి వాళ్లను పిలిపించిన, అక్కడికి పోవద్దని సోకాల్డ్ కమ్యూనిస్టులు, కాంగ్రెస్సెల్లు వందల ఫోన్లు చేశారు. సీఎం పిలిస్తే కూడా పోవద్దని చెప్తుతారా వీళ్లు. అక్కడి వచ్చినోళ్లకు గంటల కొద్ది మీటింగ్ ఉంటది. అందుకే వాళ్లకు అక్కడే భోజనాలు ఏర్పాటు చేశాం. ఒకరిద్దరు ఇంటికాడ్నే తినొచ్చినం అన్నరు. మిగిలిన వాళ్లంతా తిన్నరు. కానీ ఈ పత్రిక అన్నం తినిపోలేదని రాస్తది. ఏం సమాధానం చెబుతారు.. పోదామా వేములఘాట్‌కు, 'వెనక్కితగ్గం' అనేది వీళ్ల బ్యానర్, అన్నరా..తగ్గమని, ప్రూఫ్ చేస్తరా..? ఈ రాతలు రాసే వాళ్లు ఈ రాష్ట్రానికి అవసరమా.? కనీస అవగాహన లేకుండా, మూర్ఖంగా..అదేదో వేములఘాటంటే ప్రపంచ యుద్ధమస్తదన్నట్టు ఆగుతదా..! ప్రగతి నిరోధంగా ఇవి. పేపర్లు మేం చూడాలా..? చూస్తలేమా..? ప్రాజెక్టును ఒక విలేజ్ ఆపుతుందా..? తుదిదశకు వచ్చిన తర్వాత లక్షల ఎకరాల భూములకు నీరందించే ప్రాజెక్టును ఒక పత్రిక ఆపొచ్చా..? అది విజ్ఞత పత్రికేనా..?

ఫ్లాప్ షో


వివరాలు వెల్లడిస్తున్న సీపీ మహేందర్‌రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లో కలకలం సృష్టించిన మాజీ మంత్రి ముఖేశ్‌గౌడ్ తనయుడు విక్రమ్‌గౌడ్‌పై కాల్పుల ఘటన డ్రామాకు పోలీసులు బుధవారం తెరదించారు. సినిమాను తలపించిన కాల్పుల కథలో మొత్తం ఎనిమిది మందిపై కేసులు నమోదు చేశారు. ఏ-వన్‌గా విక్రమ్‌గౌడ్‌ను చేర్చారు. నందకుమార్, షేక్ అహ్మద్, రయీస్‌ఖాన్, బాబూజాన్, గోవిందరెడ్డిలను అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.5.3 లక్షల నగదు, తుపాకీ, కారు, ఎనిమిది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వెంకటరమణ, గౌస్ పరారీలో ఉన్నారు. థ్రిల్లర్ సినిమాను తలపించే ఈ హైడ్రామాకు సంబంధించిన వివరాలను వెస్ట్‌జోన్ డీసీపీ వెంకటేశ్వర్‌రావు, టాస్క్‌ఫోర్సు డీసీపీ లింబారెడ్డితో కలిసి నగర పోలీస్ కమిషనర్ మహేందర్‌రెడ్డి మీడియాకు వివరించారు. ఈ వ్యవహారంలో తొలి నుంచీ విక్రమ్‌గౌడ్‌ను నిందితుడిగా పేర్కొంటున్న పోలీసులు.. ఆఖరుకు ఈ మొత్తం వ్యవహారం ఆయన దర్శకత్వంలోనే జరిగినట్టు నిర్ధారించారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి కాగానే అరెస్టు చేయనున్నట్టు సీపీ వెల్లడించారు.

నాలుగు నెలల కిందే ప్లాన్

సానుభూతి పొందేందుకు విక్రమ్ ఏప్రిల్‌లోనే ఈ ప్రణాళిక రూపొందించాడు. విషయాన్ని తన సంస్థ 'క్లాప్‌షార్ట్'లో పనిచేస్తున్న ప్రసాద్ అనే వ్యక్తికి చెప్పాడు. తనపై కాల్పులు జరిగితే ప్రజల్లో సానుభూతితోపాటు, ఫైనాన్సర్లతో సెటిల్‌మెంట్ చేసుకోవచ్చని వివరించాడు. తనపై కాల్పులు జరిపితే రూ.50లక్షలు సుపారీ ఇద్దామని చెప్పాడు. సరేనన్న ప్రసాద్, పులివెందులకు చెందిన గోవింద్‌రెడ్డిని సంప్రదించాడు. కాల్పులు జరిపితే డబ్బులతోపాటు సినిమాల్లో అవకాశమిస్తామని చెప్పిన విక్రమ్ అడ్వాన్స్‌గా రూ.5లక్షలు ఇచ్చాడు. అయితే కాల్పులకు సరేనన్న గోవింద్ రెడ్డి ఆ తర్వాత భయపడ్డాడు. అనంతపురానికి చెందిన డ్రైవర్ ఎస్.నందకుమార్‌తో విషయాన్ని చెప్పాడు. అతను పనిచేసిపెడ్తానని చెప్పడంతో అతనికి రూ.3.5లక్షలను అడ్వాన్స్‌గా గోవింద్‌రెడ్డి ఇచ్చాడు. సుపారీ తీసుకున్న నందకుమార్ కదిరికి చెందిన షేక్ అహ్మద్, బాబూజాన్‌కు పథకం చెప్పడంతో వారు మధ్యప్రదేశ్‌కు చెందిన రయీస్‌ఖాన్‌తో జతకట్టారు. మొత్తం ఎనిమిది మంది ముఠాగా ఏర్పడ్డారు.

విక్రమ్‌గౌడ్ నివాసంలోనే తుపాకీ

తుపాకీ కొనటం కోసం నందకుమార్‌కు గోవింద్ మూడున్నర లక్షల రూపాయలు ఇచ్చాడు. షేక్ అహ్మద్, బాబూజాన్, నందకుమార్ ముగ్గురు కలిసి జులై ఆరోతేదీన విమానంలో మధ్యప్రదేశ్‌కు వెళ్లి రియీస్‌ఖాన్ సూచనలతో రూ.30వేలు చెల్లించి అక్కడ పిస్తోల్‌ను కొని తీసుకొచ్చారు. దాన్ని నందకుమార్‌కు ఇవ్వగా ఆ ఆయుధాన్ని జులై 8న విక్రమ్ గౌడ్‌కు అతను అప్పగించాడు. అనంతపురం నుంచి ద్విచక్ర వాహనాన్ని కొనుక్కుని వచ్చారు. చాంద్రాయణగుట్టలో నెంబర్‌ప్లేట్, చెసీనెంబర్, బాడీ నెంబర్ మార్చేశారు. జులై 21న నిందితులు విక్రమ్ నివాసంలో సమావేశమై నేరానికి ప్రణాళిక రచించారు. ఎవరు ఎప్పుడు ఏ పనిచేయాలో అన్ని వివరాలు విక్రమ్ ముఠా సభ్యులతో పంచుకున్నారు.

డ్రాయింగ్ రూంలో పథకం

ప్రాణహానీ లేకుండా ఫైర్ చేయాలని ముఠా సభ్యులకు విక్రమ్ ఆదేశాలిచ్చాడు. తుపాకీలో ఐదు రౌండ్లున్నాయి, రెండు భుజాలకు రెండు రౌండ్లు, పక్కలో మరో రౌండ్, శబ్దంవిని ఎవరైనా అడ్డు వస్తే గాలిలో మరో రౌడ్ కాల్చాలని చెప్పాడు. పథకంలో భాగంగా కొందరిని అపోలో ఆస్పత్రి సమీపంలోని తేజనివాస్‌తోపాటు, సికింద్రాబాద్‌లోని రాయల్ లాడ్జీ గెస్ట్‌హౌజ్‌లో ఉంచాడు. ప్రతిరోజు వారితో మాట్లాడేవాడు. రెండుమూడు సార్లు పథకం అమలు చేయాలని ప్రయత్నించి..భయంతో గ్యాంగ్‌లోని సభ్యులు వెనుకడుగు వేశారు. తాము ఈ పనిచేయలేమని చెప్పినా విక్రమ్ వారిని వదలలేదు. ఈ విషయాన్ని భార్యకు కూడా చెప్పలేదు. దర్గాకు వెళ్దామని మూడు రోజులుగా భార్యకు చెప్పుకుంటూ వచ్చాడు. 26న ఉదయం మూడు గంటలకు కాల్పులకు అంతా రెడీ అయ్యారు. కానీ ద్విచక్రవాహనం తీసుకొని రావడంలో ఆలస్యం కావడంతో కాల్పులను వాయిదా వేసుకున్నారు. అక్కడి నుంచి అందరిని తనకారులో విక్రమ్ 'క్లాప్‌షార్ట్'కు తీసుకెళ్లాడు. తిరిగి ప్రణాళిక సిద్ధం చేశారు. ఆ తర్వాత కాల్పుల కేసు తమపైకి ఎక్కడ వస్తుందోనని అందరు జారుకున్నారు. ఆ తర్వాత వారికి ధైర్యం చెప్పినా వారు సాహసించలేదు. చివరకు నందకుమార్, షేక్ అహ్మద్, రయీస్‌ఖాన్‌ను ఒప్పించాడు. ఆతర్వాత వారితో 28వ తేదీ రాత్రి వరకు ఉన్నవిక్రం వారిని ఇంటి సమీపంలో వదిలేశాడు. 2:30గంలకు ఇంటికి వచ్చిన విక్రమం గేటుతెరిచే ఉంచాలని వాచ్‌మెన్‌కు చెప్పాడు. వాచ్‌మెన్ రూంలోకి వెళ్లగానే వారిని ఇంట్లోకి రావాలని చెప్పడంతో రయీస్‌ఖాన్ హాల్లోకి వెళ్లగా, ద్విచక్రవాహనంపై షేక్ అహ్మద్ రెడీగా ఉండగా. కొంత దూరంలో నందకుమార్ నిల్చోని ఉన్నాడు. ఈ క్రమంలో పైకివెళ్లిన విక్రమ్ దర్గాకు వెళ్దాం రెడీకావాలంటూ భార్యకు చెప్పాడు. పథకంలో భాగంగా హాల్లోకి వచ్చాడు. అప్పటికే హాల్లోవున్న విక్రమ్ భుజంపై రయీస్ కాల్చాడు. రెండో రౌండ్ మరో భుజంపై కాల్చిన రయీస్ భయపడి అక్కడి నుంచి పారిపోయాడు. అప్పటికే రెడీగా ఉన్న అహ్మద్‌తో కలిసి పారిపోగా, నందకుమార్ సమీపంలోని కారులో పారిపోయాడు. తుపాకిని హకీంపేట్‌లోని చెరువులో విసిరేశారు. అక్కడి నుంచి ఎవరిదారిలో వారు వెళ్లిపోయారు. నాలుగురోజుల వరకు ఫోన్లు స్విచ్చాఫ్ చేశారు.

ఐదుగురు నిందితుల అరెస్టు

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన కేసును పోలీసులు అన్నికోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఐదు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఘటన అనంతరం నిందితుల కోసం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తృత గాలింపులు చేపట్టినట్టు సీపీ మహేందర్ రెడ్డి తెలిపారు. విక్రమ్‌తో కలిపి ఐదుగురు నేరస్తులు తమ కస్టడీలో ఉన్నట్టు చెప్పారు. గాయపరుచుకుంటే తన నియోజకవర్గంలో సానుభూతి వస్తుందని విక్రమ్‌గౌడ్ భావించారనీ, తనతో ఆర్థిక లావాదేవీలు ఉన్న వ్యక్తులపై ఒత్తిడి వస్తుందనుకున్నాడనీ చెప్పారు. ఈ ప్రణాళిక అమలులో భాగంగా గోవిందరెడ్డికి రూ.5లక్షలు చెల్లించినట్టు చెప్పారు. పని పూర్తయ్యాక మరో రూ.50లక్షలు ఇస్తానని విక్రమ్ ఒప్పందం కుదుర్చుకున్నాడని సీపీ తెలిపారు. భార్యకు ఎలాంటి విషయం తెలియదన్నారు. చూసిన ఘటన ప్రకారం పోలీసులకు ఫిర్యాదు చేసిందని తెలిపారు. తన భర్త గత మూడు నెలలుగా టెన్షన్‌లో ఉన్నాడని భార్య షిఫాలి చెప్పినట్టు సీపీ తెలిపారు.

'ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి'

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలంగాణ డాక్టర్స్ ఫోరం చైర్మెన్ డాక్టర్ ఏ.గోపాల కిషన్ అన్నారు. ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఉస్మానియా ఆస్పత్రిలో జరిగిన ఘటన దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. డాక్టర్లకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసి ఆస్పత్రిలో వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మహిళ అని చూడకుండా ఓ పీజీ డాక్టర్‌పై దాడి చేయడం శోచనీయమన్నారు. హెల్త్‌కేర్ డాక్టర్స్ రీఫార్మ్స్ రాష్ట్ర అధ్యక్షులు గుండగాని శ్రీనివాస్, ఉస్మానియా యూనిట్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ విజయేందర్‌గౌడ్ గౌడ్ ప్రసంగించారు.

పేదలకు సరైన తిండితిప్పలు సమకూర్చినప్పుడే
నిజమైన నాగరికత ఉన్నట్టు లెక్క. -శామ్యూల్ జాన్సన్

సంపాదకీయం

సత్యాన్ని వెలిగించినవాడు

పి.ఎం. భార్గవ కన్నుమూసారు... ఈ భూమి మీద సత్యాన్ని వెలిగించడం కోసం తమ జీవితాలనే ధారపోసిన మహనీయులెందరో ఉన్నారు. సత్యం అంటే సైన్సు - సైన్సు అంటే సత్యం. అందుకే ఈ సత్యం కోసం వారెన్నో త్యాగాలు చేయవలసివచ్చింది. రాజ్యాన్ని ఎదిరించవలసి వచ్చింది. నిర్భయంగా నిజాన్ని ప్రకటించినందుకే నిండు ప్రాణాలను బలిపెట్టవలసి వచ్చింది. భూమి గుండ్రంగా ఉందన్నందుకు బ్రూనోను మంటల్లో కాల్చి చంపారు. సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని ప్రతిపాదించినందుకు కోపర్నికస్‌ను చెరసాలలో నిర్బంధించారు. గెలీలియోను చిత్రహింసలు పెట్టారు. ఇలా ఎందరో శాస్త్రవేత్తలు సైన్సు కోసం సమిధలైనారు... అయితేనేం సత్యాన్ని వెలిగించారు. శాస్త్రీయత పండించారు. శాస్త్రీయ దృక్పథం వ్యవస్థలోని విలువల అసలు స్వరూపాన్నీ, నిజాలనూ దర్శింపజేస్తుంది. "వర్గపోరాటంలో నిజాలను నిర్భయంగా ప్రకటించడమూ పోరాటమే" అంటాడు లీషావ్‌చీ. అట్లా సత్యం కోసం పోరాడిన త్యాగధనుల వారసుడే పి.ఎం. భార్గవ. ఒక సైన్సు ఎగ్జిబిషన్‌లో కారల్ మార్క్స్ చిత్తరువును ప్రదర్శించినందుకు నాటి మతోన్మాద ప్రభుత్వం దాడిచేసినా వెరవని ధీశాలి ఆయన. దాడి చేసింది ప్రభుత్వమైనా, దాని పరివారమైనా ఎదుర్కొని నిలిచి గెలిచిన వ్యక్తి. అంతే కాదు, కారల్‌మార్క్స్ ఎట్లా సైంటిస్టో, ఆయన ప్రతిపాదనలు ఏవిధంగా శాస్త్రీయమైనవో జీవితకాలం నిరూపిస్తూనే బతికాడు. ఆయన మరణం దేశానికి తీరని లోటు.

ప్రజా సైన్సు ఉద్యమాలకు ఆలంబనగా నిలిచినవాడు... మార్క్సిస్టు భావజాలపు విస్తృతినీ, సృజనాత్మక అన్వయత్వాన్నీ సంపూర్ణంగా అర్థం చేసుకుని తన జీవితానికి అన్వయించుకుని ఆచరించినవాడు. ప్రజల కొరకు ప్రజలతరపున సాగిన తొంభయ్యేండ్ల శాస్త్రీయ ప్రయాణమతడు. అందుకే ఆయన ధన్యజీవి... చిరంజీవి...



భారతదేశం ఆర్థిక స్వావలంబన సాధించాలనీ, శాస్త్ర సాంకేతిక రంగాలలో అగ్రరాజ్యాల సరసన చేరాలనీ కలలు కనడమే కాదు, వాటి సాకారానికి కడవరకూ అలుపెరగక శ్రమించాడాయన. మూఢనమ్మకాల నిర్మూలనకూ, శాస్త్రీయ భావాల వ్యాప్తికీ విశేషంగా కృషి చేశాడు. హైదరాబాద్‌లో "సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) వ్యవస్థాపకులుగా ఆయన శాస్త్ర ప్రపంచానికి సుపరిచితులు. రాజస్థాన్‌లోని ఆజ్మీర్‌లో పుట్టి, వారణాసీ, అలహాబాద్, లక్నోల్లో చదివీ, మన హైదరాబాద్‌లో స్థిరపడి పరిశోధకుడిగా, ప్రగతిశీలుడిగా, గణతికెక్కిన ప్రజ్ఞాశాలి ఆయన. శాస్త్రీయ రంగంలో భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన స్రష్ఠ. అమెరికాలో "యూనివర్సిటీ ఆఫ్ విన్ కానిసన్, మెడిసన్"లో ప్రముఖ శాస్త్రవేత్త హెడల్ బర్గర్‌తో కలిసి విస్తృతమైన పరిశోధనలు చేశాడు. లండన్‌లోని "నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మెడికల్ రీసెర్చ్"లో అద్భుత ప్రయోగాలు చేసి అంతర్జాతీయ ప్రసిద్ధినొందాడు. కణజీవి శాస్త్రవేత్తగా ఆయన పరిశోధనలు అజరామరం. అందుకే ఆయనను 1986లో పద్మభూషణ్ వరించింది.

సుదీర్ఘమైన సృజనాత్మక జీవితంలో వెలుగు నీడలూ, వైవిధ్యాలూ, వైరుధ్యాలు అత్యంత సహజం. ఇందుకు పి.ఎం. భార్గవ జీవితం భిన్నమేమీకాదు. "నేషనల్ నాలెడ్జ్ కమిషన్" వైస్ ఛైర్మన్‌గా, "నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ బోర్డు" సభ్యునిగా, సుప్రీంకోర్టు "జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రైజల్ కమిటీ" నామినీగా ప్రభుత్వంతో కలసి పనిచేసినా, ప్రజా ప్రయోజనాలకు భంగం కలిగినప్పుడు నిర్భయంగా నిలదీశాడు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో జ్ఞానాన్ని వృద్ధి చేయడానికే కాదు, కాపాడడానికీ ఆయన తపించారు. అందుకోసం పెట్టుబడిదారుల కోసం ప్రభుత్వాలు పెంచి పోషించే జ్ఞానాన్నీ, గుత్త పెట్టుబడిదారుల కోశాగారాలను నింపేందుకూ, అగ్రరాజ్యాల గుత్తాధిపత్యానికీ దోహదం చేసే జ్ఞానాన్నీ నిరసించాడు. వ్యవస్థ చలన సూత్రాలను తెలిపే జ్ఞానాన్ని వ్యాప్తి చేసేందుకు చివరి వరకు పరితపించాడు. శాస్త్రవేత్తగా, పరిశోధకుడిగా ఆయనెప్పుడూ ప్రజాపక్షమే. శాస్త్ర సాంకేతిక రంగాల్లో రూపొందించిన పలు విధానాల్లో తనదైన ముద్ర వేసిన ఆయనే నేడు దేశంలో పెల్లుబుకుతున్న అసహనానికి నిరసనగా తన పద్మభూషణ్ తిరిగిచ్చేశారు. ఇది ప్రజల పట్ల ఆయన నిబద్ధతకు నిదర్శనం. అందుకే ఆయనను ప్రభుత్వాలు విస్మరించినా ప్రజలు గుండెల్లో నిలుపుకున్నారు.

పి.ఎం. భార్గవగా పిలువబడే ఆయన పూర్తిపేరు పుష్పమిత్ర భార్గవ. విస్తృత అధ్యయనం, సునిశితమైన శాస్త్రీయ దృక్పథం, బలమైన వాదనాపటిమ ఆయనను విశిష్ట వ్యక్తిగా, ప్రజల మనిషిగా తీర్చిదిద్దాయి. నిష్కళంకమైన, నిరాడంబరమైన జీవితం ఆయనకు ఆభరణంగా నిలిచింది. తనను తాను అతిసామాన్యుడిగా చెప్పుకునే అసామాన్యుడతను. అందుకే ఆయనను పద్మభూషణ్ వరించినప్పుడు అది ఎంత అత్యంత సహజమైన విషయంగా అనిపించిందో, ఆ పద్మభూషణ్ తిరిగిచ్చినప్పుడు కూడా అంతే సహజ విషయంగా అనిపించింది. అది భార్గవ నిరాడంబర జీవనశైలి ప్రభావం. అది ఆయన శాస్త్ర జగత్తుపై వేసిన సమ్మోహన ముద్ర. తాను కోట్లాదిమంది ప్రజలలో ఒకడినే తప్ప, తానో ప్రఖ్యాత వ్యక్తిని కాదని నమ్ముతారు. శిఖర సమానమైన వ్యక్తిత్వానికి ప్రతీక ఆయన. పరిశోధనా రంగంలో ప్రజల కోసం నిలబడినవాడు... ప్రజా సైన్సు ఉద్యమాలకు ఆలంబనగా నిలిచినవాడు... మార్క్సిస్టు భావజాలపు విస్తృతినీ, సృజనాత్మక అన్వయత్వాన్నీ సంపూర్ణంగా అర్థం చేసుకుని తన జీవితానికి అన్వయించుకుని ఆచరించినవాడు. ప్రజల కొరకు ప్రజలతరపున సాగిన తొంభయ్యేండ్ల శాస్త్రీయ ప్రయాణమతడు. అందుకే ఆయన ధన్యజీవి... చిరంజీవి...

ప్రజావాణి

ఆంగ్లో ఇండియన్లకు ఓ ప్రత్యేక రోజు!

బ్రిటిష్‌వారి పాలనలో యూరోపియన్లు ఎంతో మంది భారతదేశానికి ఉద్యోగరీత్యా వచ్చారు. వారిలో కొందరికి స్థానికులతోపరిచయాలు ఏర్పడి వైవాహిక బంధానికి దారితీసాయి. వీరిని మొదట్లో యూరోపియన్లుగా పిలిచేవారు. 1935లో అప్పటి బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం ఆంగ్లో ఇండియన్లుగా కొత్తి స్టేటస్ ఇచ్చింది. వీరికి ఉద్యోగాలలో రిజర్వేషన్లు కూడా ఉండేవి. 1962లో ఈ రిజర్వేషన్లు రద్దుచేయబడినాయి. ఆంగ్లో ఇండియన్లుగా మైనారిటీ హోదాను అనుభవిస్తున్న వీరి మాతృభాష ఇంగ్లీషు. మతం క్రైస్తవం. ఆహారపు అలవాట్లు వేషధారణ యూరోపియన్ పద్ధతిలో ఉంటాయి. భారతదేశం వెలుపల (వివిధ దేశాలలో) సుమారు పది లక్షల మంది వరకు వీరు ఉన్నారట. మన దేశంలో సుమారు ఎనిమిది లక్షల మంది ఉన్నారు. హైదరాబాద్‌లో మొదటిసారిగా 2.8.2005న ఈ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుండి, వివిధ దేశాల నుండి అధిక సంఖ్యలో ఆంగ్లో ఇండియన్లు వచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలలోను, ఇతర రంగాలలోను తమకు ప్రాధాన్యమివ్వాలని కోరుతున్నారు. స్థానిక సంస్థలు, మైనారిటీ కార్పొరేషన్లు, బోర్డులలోను తమకు కూడా స్థానం కల్పించాలని అడుగుతున్నారు. వీరు 'ఆండ్లోస్ ఇన్ ద విండ్' అనే పక్షపత్రిక వెలువరిస్తున్నారు. ఆంగ్లో - ఇండియన్ అనే పదాన్ని నిర్వహించే చట్టం చేయబడిన రోజు 2.8.1935. కాబట్టి ప్రతి ఏడాది ఈ దినోత్సవాన్ని జరపాలని నిర్ణయించారు. వివిధ దేశాలలోని ఆంగ్లో-ఇండియన్ అసోసియేషన్లు అన్నీ కలిపి ది ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఆంగ్లో-ఇండియన్ అసోసియేషన్స్‌గా ఏర్పడ్డాయి. ఆర్టికల్ 330, 331ల ద్వారా లోక్‌సభకు ఇద్దరు ఆంగ్లో-ఇండియన్‌లను రాష్ట్రాల్లోని వివిధ మండలిక ఒక ఆంగ్లో ఇండయన్‌ను సభ్యులుగా నియమించే సౌకర్యం కల్పించబడింది. మనం కూడా వారిని గౌరవిద్దాం. అన్ని దేశాల ప్రజలను అక్కున చేర్చుకునే గుణం మన దేశానికి ఉంది. ప్రతీ ఏటా ఈ దినోత్సవం రోజున వారు పండగ వాతావరణంలో దినోత్సవాన్ని నిర్వహించుకుంటారు. భారతీయులంటే వారికి అమితమైన ప్రేమా, అభిమానం.

- కె.ఎస్.ఆర్. జయశంకర్‌భూపాలపల్లి జిల్లా.

దెబ్బతిన్న రోడ్లు

రాష్ట్రంలో అల్పపీడన ప్రభావంతో విస్తారంగా వానలు కురిసాయి. అనేక చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. గతంలో దెబ్బతిన్న రోడ్లు మరింత అధ్వాన్నంగా తయారైనాయి. ఈ రహదారులపై ప్రయాణం ఘోరంగా ఉంది. కాబట్టి దెబ్బతిన్న రోడ్లను తగిన నాణ్యతా ప్రమాణాలతో తక్షణమే మరమ్మత్తులు చేసి, పటిష్ఠమైన రోడ్లను నిర్మిస్తే బాగుంటుంది. రోడ్లపై రద్దీ దృష్ట్యా రహదారులను వెడల్పు చేయాలి.

- ఎస్.ఎస్.ఆర్. హైదరాబాద్.

గోరక్షక దళాలను వెంటనే నిషేధించండి!



సీతారాం ఏచూరి

నేను సిగ్గుతో నిలబడి తలదించుకుంటున్నాను. మన గణతంత్ర రాజ్యం ఎక్కడి దాకా వచ్చింది? 70 ఏండ్లకు పూర్వం ప్రపంచంలో ఏ పాశ్చాత్య ప్రజాస్వామ్య దేశానికి చెప్పే ధైర్యం లేనపుడు, మనం మన దేశంలో ప్రతి ఒక్కరికి ఓటుహక్కు కల్పిస్తామని గర్వంతో చెప్పాం. కులం, మతం, లింగ భేదంతో సంబంధం లేకుండా అందరికీ ఓటు హక్కు కల్పించాం. ఆప్పుడు యిది ఒక విప్లవాత్మకమైన ముందడుగు. సమానత్వాన్ని గుర్తించడమే దీనికి పునాది. ఈ సమానత్వమే నేడు ప్రశ్నించబడుతున్నది. చట్టవ్యతిరేకంగా జరిగే హత్యల ద్వారా తీవ్రంగా అణగద్రొక్కబడుతున్నది.

> **సంస్కరణలు, ఆర్థిక విధానాలపై ప్రధానమంత్రి కేంద్రీకరిస్తున్నారు, కానీ హిందూత్వ ఎజెండాపై కేంద్రీకరించడంలేదు. కాబట్టి దేశం హిందూత్వవైపు వెళ్ళడాన్ని ఆపుచేయాలి. ఈ అల్లరి మూకలు చేసే హత్యలు శాంతిభద్రతల లోపంతో ఎక్కడో ఒకటి లేదా రెండు సంఘటనలుగా జరిగినవి కాదు. ఆధునిక భారతదేశంలో లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్య లక్షణాన్ని కూల్చివేసి దాని స్థానంలో 'హిందూ రాజ్యాన్ని' ఏర్పాటుచేసే భావజాలంలో భాగమే ఈ అల్లరి మూకలు చేసే హత్యలు. ఇది చాలా ప్రమాదకరమైన విషయం కాబట్టి ఈ దళాలు చట్టబద్ధంగా నిషేధించబడాలి.**

భోజనం చేస్తున్న అఖ్లాక్‌ను గొడ్డు మాంసం తింటున్నాడన్న ఆరోపణతో హత్య చేశారు. ఇది 2015లో జరిగింది. జార్ఖండ్‌లోని లాతేహార్‌లో పశువుల సంతకు తమ పశువులను తీసుకొని పోతున్న యిద్దరు యువకులను ఉరి తీశారు. అల్వర్‌లో పెహ్లూఖాన్ అనే పాలు ఉత్పత్తి చేసే రైతును చంపివేశారు. ఉనాలో చనిపోయిన ఆవుల చర్మాలను తీస్తున్న దళితులను హత్య చేశారు. దురదృష్టవశాత్తు దళితులు చర్మం వలిచే పని చేస్తుంటారు. పిల్లలను కొట్టి చంపారు. ఇదంతా సామాజిక మాధ్యమంలో వర్ణించబడింది. మన ముందు జునైద్, అతని సోదరుని ఉదంతం వున్నది. బహిర్భూమికి వెళ్తున్న మహిళలను చిత్రీకరించవద్దన్నందుకు రాజస్థాన్‌లో అధికారులు జాఫర్ అనే వ్యక్తిని హత్యచేశారు. మన దేశంలో పెరిగిపోతున్న అసహనం కారణంగా భయకంపితులను చేస్తున్న ఈ గాథలను ఆలకించండి.

మనం ఆ స్థాయిలో పెరిగిన అమానవీయతకు చేరుకున్నాం. మనం ఎందుకు ఈ స్థితికి చేరుకున్నాం అనే విషయం అర్థం చేసుకోవాలి. ఆ విషయాన్ని చర్చించాలి. మనం ఈ సభలో దానిపై ఒక నిర్ధారణకు రావల్సివున్నది. స్పానిష్ విచారణ సమయంలో ముస్లింలను, యూదులను గుర్తించడానికి "పంది మాంసం ఎవరు తింటారు?" అని అడగడం ద్వారా గుర్తిస్తే, మనం "గొడ్డు మాంసం ఎవరు తింటారు?" అని ప్రశ్నించి భారతదేశంలో హిందూ ఎవరో, హిందూయేతరులు ఎవరో 2017లో గుర్తించే పద్ధతి అనుసరించేదాకా మన దేశం వచ్చింది?

యిప్పుడు చుట్టూ తిరుగుతున్న ప్రయివేట్ సైన్యం గురించి ఏమిటి? దానికి ప్రధానమంత్రి అది రాష్ట్రాలకు సంబంధించిన శాంతిభద్రతల సమస్యగా పేర్కొన్నారు. చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకుంటున్న ఈ ప్రయివేట్ సైన్యం కేంద్ర ప్రభుత్వ ఆజ్ఞలతో నిషేధించాలి. దేశంలోని చట్టాన్ని అమలు చేయాలో ఒత్తిడి చేస్తున్న ఏ అధికారమూ లేని ప్రైవేట్ సైన్యాన్ని నిలువరించే మార్గం యిది మాత్రమే. అందుకని వివిధ పాశవిక చర్యలకు పాల్పడుతున్న మోరల్ పోలీసింగ్, గోరక్షక దళాల సభ్యులను వెంటనే నిషేధించాలని మనం ప్రభుత్వాన్ని అడగాలి.

అయితే యిదంతా ఎందుకు జరుగుతున్నది? ఒక్కసారిగా దేశంలో నేరాల సంఖ్య పెరుగుతుంది కాబట్టి ఇదంతా జరగడం లేదు. ఇది ఒక విధమైన భావజాలం కారణంగా జరుగుతున్నది. దీనిని మనందరం అర్థం చేసుకోవాలి. మనందరం స్వతంత్ర్య భారతదేశాన్ని, దాని రాజ్యాంగాన్ని వారసత్వంగా పొందియున్నాం. ఇది మూడు దార్శనికతల మధ్య జరుగుతున్న యుద్ధ పర్యవసానం. స్వాతంత్ర్య పోరాట కాలంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన దార్శనికత ప్రధాన స్రవంతిలో వున్నది. వారు భావి స్వాతంత్ర్య భారతదేశం ఒక లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా వుండాలని పేర్కొన్నారు. వామపక్షీయులమైన మాకు వారితో విభేదం వున్నది. మనం అక్కడే నిలిచిపోకూడదని మేము చెప్పాం. మన రాజకీయ స్వేచ్ఛ, ఆర్థిక స్వేచ్ఛగా మారడానికి యింకొంత ముందుకెళ్ళాలని, అది సోషలిస్ట్ వ్యవస్థలో మాత్రమే జరుగుతుందని, లేకుంటే సామాజిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యం నిస్సహాయంగా తయారవుతుందని మేము కాంగ్రెస్ వారితో చెప్పాం. రెండు వ్యక్తీకరణలుగల మూడవ దార్శనికత మరొకటి వున్నది. ఇస్లామిక్ భారతదేశం గురించి మాట్లాడిన ముస్లిం లీగ్, హిందూ రాజ్యం గురించి మాట్లాడుతున్న ఆర్.ఎస్.ఎస్ ఆ రెండు వ్యక్తీకరణలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి.

దేశానికి స్వాతంత్ర్యం రావాలని, దేశ ప్రజలు ఆచరిస్తున్న మతం ఆధారంగా మత నాయకులచే ఈ దేశం పాలించబడాలని ఆ రెండు వ్యక్తీకరణలు కోరాయి. దురదృష్టవశాత్తు బ్రిటిష్‌వారి సహకారం పొందడంలో ముస్లిం లీగ్ విజయం సాధించింది. తద్వారా దేశ విభజన జరిగింది. రాజ్య పాలన మత ప్రాతిపదిక ఆధారంగా వుండాలన్న ఈ భావం ఇతర రెండు దార్శనికతలకు వ్యతిరేకమైనదిగా వున్నది.

స్వాతంత్ర్యానంతరం భారతదేశం లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా ఏర్పడింది. హిందూ రాజ్య ఏర్పాటును సుసాధ్యం చేయలేదన్న కోపంతో గాంధీని హత్య చేశారు. దీని తరువాత, సర్దార్ పటేల్ చొరవతో ఆర్ఎస్ఎస్‌పై నిషేధం విధించబడింది. 1948 ఫిబ్రవరి 4, స్వయంగా పటేల్‌చే తయారు చేయబడిన నిషేధపు ఆజ్ఞ ఏమి చెప్పింది? సర్దార్ ఈ విధంగా పేర్కొన్నారు: "సంఘ్ యొక్క అభ్యంతరకరమైన, అపాయకరమైన కార్యకలాపాలు అడ్డూ అదుపూ లేకుండా కొనసాగినాయి. సంఘ్ కార్యకర్తల ప్రేరేపిత చర్యలు, హింసా విధానంతో అనేకమంది క్షతగాత్రులయ్యారు. తాజాగా గాంధీజీ హత్య చేయబడినారు". ఇది వ్యాప్తి చెందిన హింసా విధానం. కొంతమంది చెబుతున్నట్టు గోరక్షకులందరు ఆర్ఎస్ఎస్ వారేనని నేను చెప్పడంలేదు. కొంతమంది వారు జాతి వ్యతిరేకులు, నేరస్థులని అంటున్నారు. ప్రధానమంత్రి కూడ అలానే చెప్పియున్నారు. వారు రాత్రంతా నేరస్థులు, పగలంతా వారు యింకేదైనా అయి వుండవచ్చు.

కానీ, వారు యిలా చేయడానికి ధైర్యం ఎలా, ఎందుకు వచ్చింది? ఈ హింసా విధానం వ్యాప్తి వల్లనే అలా జరుగుతుంది. కానీ గాంధీజీ హత్యానంతరం దార్శనికతల మధ్య వున్న యుద్ధం నిలిచిపోలేదు.



దురదృష్టవశాత్తు అది నిలిచిపోయిందని అనేక మంది ఉపశమనం పొందినారు. కానీ, అలా జరగలేదు. అటు తర్వాత మనం ఏం చూశాం? గాంధీ హత్యానంతరం, రాజ్యాంగాన్ని ఆమోదించిన తరువాత కూడ మనం జాతీయవాదం ముద్రను సంపాదించాం. ఆ సమయంలో ఒక ఆర్ఎస్ఎస్ ముఖ్యుడు పేర్కొన్న విషయాన్ని ఉదహరిస్తాను, "ఇస్లాం, క్రైస్తవ మతాలలోనికి మారిన వారి యొక్క వైఖరి ఏమిటి? వారు ఈ దేశంలోనే జన్మించినారు, సందేహం లేదు. కానీ వారు ఈ దేశానికి విశ్వాసంగా వున్నారా? వారిని పెంచిన ఈ దేశానికి వారు కృతజ్ఞతగా వున్నారా? వారు ఈ దేశపు, సాంప్రదాయపు బిడ్డలని, దానికి సేవ చేయడం తమ అదృష్టం అని వారు భావిస్తున్నారా? ఈ దేశానికి సేవ చేయడం వారి విధి అని అనుకుంటున్నారా? లేదు! వారి విశ్వాసంలో వచ్చిన మార్పుతోనే ఈ జాతిపట్ల వారికున్న ప్రేమ, శ్రద్ధలు పోయాయి". స్వాతంత్ర్యం, రాజ్యాంగ ఏర్పాటు అనంతరం కూడ నీవు వ్యాప్తి చేస్తున్న భావజాలపు విలువల అర్థం ఏమిటి? కులం, జాతి, లింగ భేదంతో నిమిత్తం లేకుండా యిది సమానత్వ హక్కును కాదంటుంది.

ఈ భావజాలం ఈ స్థితికి ఎదిగింది. అందువల్ల జాతీయవాదం అంటే హిందూ జాతీయతావాదం లేదా హిందూత్వ జాతీయతావాదంతో సమానం చేయబడుతుంది. దేశభక్తుడంటే దేశభక్తుడే. అది భారతీయ దేశభక్తుడు. అందుకే మనం కోరుకున్నది భారతీయ దేశభక్తి. హిందూత్వ దేశభక్తి లేదా హిందూత్వ జాతీయతావాదం కాదు. పోషించవలసింది భారత జాతీయవాదం. అది మన విధి. దానిని పోషించకపోవడం వల్లనే మనకు యిక్కడ హత్యలు చేసే అల్లరిమూక ఏర్పడింది. ఆ ద్వేష భావంలో నుండే ఈ అల్లరి మూక తయారైంది.

నేడు మనం చూస్తున్న ఈ రక్షక దళాల గురించి సర్దార్ పటేల్ చాలా తీవ్రంగా వ్యాఖ్యానించాడు. వీరిచేత వ్యాప్తి చేయబడుతున్న హింసా విధానం అనేక మందిని పాశవిక చర్యలకు పాల్పడేలా చేస్తున్నది. మన రాజ్యాంగ పునాదులపై చేస్తున్న దాడుల ఫలితంగా సమానత్వపు హక్కు కాలరాయబడుతున్నది. విశ్వాసం కలిగి వుండే ప్రాథమిక హక్కు, దానిని ప్రచారం చేసుకునే హక్కు నిరాకరించబడుతున్నాయి. కాబట్టి మన రాజ్యాంగ సక్రమ నిర్వహణకు అల్లరిమూకల, రక్షక దళాలకు వ్యతిరేకంగా పోరాడటం అవసరం.

ఈ వారాంతపు "Financial Times" ఏమి చెపుతున్నది? ఈ ప్రభుత్వంలోని ప్రధానమంత్రి హిందూత్వవాదుల దుర్మార్గాలకు సహాయపడడం ఆపివేయాలి. గొడ్డు మాంసం తిన్నారని, గొడ్డు మాంసం వ్యాపారం చేస్తున్నారని అనుమానంతో హిందూత్వ రక్షక దళాలు చేస్తున్న దాడుల సంఖ్య పెరిగిపోతున్నది. ఈ దాడులలో 28 మందికిపైగా హత్య చేయబడినారు. ఇది నేడు మీ అంతర్జాతీయస్థాయి. మన రాజ్యాంగ విలువలకు వ్యతిరేక చర్యలు మన దేశంలో జరుగుతున్న విషయాన్ని వారు గుర్తిస్తున్నారు.

సంస్కరణలు, ఆర్థిక విధానాలపై ప్రధానమంత్రి కేంద్రీకరిస్తున్నారు, కానీ హిందూత్వ ఎజెండాపై కేంద్రీకరించడంలేదు. కాబట్టి దేశం హిందూత్వవైపు వెళ్ళడాన్ని ఆపుచేయాలి. ఈ అల్లరి మూకలు చేసే హత్యలు శాంతిభద్రతల లోపంతో ఎక్కడో ఒకటి లేదా రెండు సంఘటనలుగా జరిగినవి కాదు. ఆధునిక భారతదేశంలో లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్య లక్షణాన్ని కూల్చివేసి దాని స్థానంలో 'హిందూ రాజ్యాన్ని' ఏర్పాటుచేసే భావజాలంలో భాగమే ఈ అల్లరి మూకలు చేసే హత్యలు. ఇది చాలా ప్రమాదకరమైన విషయం కాబట్టి ఈ దళాలు చట్టబద్ధంగా నిషేధించబడాలి. మనందరం కలిసి ఈ దేశం ముందుకు పోవడానికి కృషి చేద్దాం.

(జూలై19న, రాజ్యసభలో చేసిన ప్రసంగం సంక్షిప్తంగా...)

అనువాదం: బోడపట్ల రవీందర్

సెల్: 9848412451

నితీశ్‌కుమార్ ఫిరాయింపుదారుడే...



జి. తిరుపతయ్య

బీహార్లో జరుగుతున్నది మోసమా.., అవకాశవాదమా.., ముందు చూపా? వీటిల్లో ఏదైనా కావచ్చు కాకపోవచ్చు కాని అవినీతిపై పోరాటమనీ, సచ్ఛీలతతో పరిపాలన అనీ చెబితే అది శుద్ధ అబద్ధమే! అధికారంలో లేని వాడు అవినీతిపై పోరాటం చేస్తానని అనాలి, అధికారంలో ఉన్నవారు అవినీతి పరులపై చర్యలు తీసుకోవాలి. నిజంగా బీహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ దోషి అనుకున్నప్పుడు ఆయన్ను బర్తరఫ్ చేసివుంటే అందరూ హర్షించేవారు. చట్టప్రకారం క్రమశిక్షణా చర్యలకు ఉపక్రమించిఉంటే లాలూ ప్రసాద్ యాదవ్ అండ్ టీం ఉండేదా ఊడేదా తేలిపోయేది. చర్యలకు ఉపక్రమించకుండా ఏ శక్తి తనని నిలువరించిందో అలాంటి శక్తిని ఇప్పుడెలా ఎదుర్కొంటాడో కూడా బహిర్గత పర్చాలి. అలా చేయకుండా, లోలోపల అసలేం జరుగుతుందో ప్రజలకు వివరించకుండా ఓ వారం రోజులు ఆరోపణలూ ప్రత్యారోపణలతో మమ అనిపించి తన దోవ తాను చూసుకోవడం ఏ నీతి శాస్త్రంలోనిది నితీశా!? మహాఘటబంధన్‌లో ఉంటూనే ఏకపక్షంగా అపోజిషన్ పార్టీ ప్రతిపాదనలకు మద్దతు తెలుపడం నీతి ఎలా అవుతుంది? ఓ వైపు ఢిల్లీలో కేంద్రప్రభుత్వ కార్యక్రమాలకు హాజరౌతూనే మరోవైపు కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాహుల్ గాంధీని కలుస్తారు, ఇవన్నీ వ్యక్తిగతమా అధికారికమా ప్రజలకు వివరించాల్సిన బాధ్యత నితీశ్‌కు ఉన్నది.

జేడీయూ అధికార ప్రతినిధి(స్పోక్స్ పర్సన్), రాజ్యసభ సభ్యుడు, మాజీ ఐఎఫ్ఎస్ అధికారి పవన్ కుమార్‌వర్మ పలు సందరాల్లో సీబీఐ అనేది పంజరంలో పావురమనీ, యజమాని ఆడించినట్టల్లా అది ఆడుతుందని గుజరాత్ అల్లర్లలో దోషులైన మాయా కొద్నాని, అమిత్ షా, కొంతమంది అధికారులను ఉటంకిస్తూ వ్యాసాలూ ఉపన్యాసాలూ అధికారిక హోదాలో వెలిబుచ్చారు. వారు నమ్మని నేర పరిశోధనా సంస్థ ఆరోపణలే ఆధారంగా అధికారం రూపం మార్చితే నవ్విపోరా జనాలు!? వేదిక మారినప్పుడల్లా విధానాలు మార్చుకునే కుహనా వాదులు మొన్న దెప్పి పొడిచిన వాళ్ళనే నేడు దేవుళ్ళుగా కొలవడం హతవిధీ అనుకోవడమేనా? వ్యక్తి పూజకు వ్యతిరేకమని, మతతత్వానికి వ్యతిరేకమని బీజేపీలో ఈ రెండూ తప్ప వేరే లేవని పలికిన నితీశ్‌కు కనిపించిన మార్పులేవో వివరించాలి. హిమాచల్ ప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్‌లలో పార్టీ ఫిరాయింపులతో బీజేపీ అధికారం దక్కించుకోవటాన్ని దునుమాడిన జేడీయూ నేడు చేసింది ఫిరాయింపు కాదా? అంతకన్నా మరీ దారుణం ఎందుకంటే ఇది అధికారిక ఉన్మాదాభిచారం.

2013 లోనూ సీను ఇలాగే జరిగింది. ఎన్‌డీఏ భాగస్వామిగా ఉన్న నితీశ్ కారణాలేమైనా కాంగ్రెస్, ఇతరుల సహాయంతో గట్టెక్కెరు. అన్నాళ్ళూ భాగస్వామిగా ఉండి అప్పటికి రాబోయే ఎన్నికల్లో ఎన్‌డీఏతో ఉంటే ఎన్నికలను గెలవలేమనే అంచనాకు వచ్చిన నితీశ్ ఇతరుల పంచన చేరిపోయారు. మహాఘట్బంధన్ ఏర్పాటు చేసే నాటికి లాలూ ప్రసాద్ చరిత్రంతా మచ్చల తుకుడేనని, ఎన్నికల్లో కూడా పోటీ చేయలేనంత అనర్హత కలిగి ఉన్నాడని వీరికి తెలిసినప్పటికీ ఎందుకు జత కట్టారో ప్రజలకు జవాబుదారీ వారే. అటు విద్యార్హతా ఇటు



రాజకీయనుభవం రెండూ లేని లాలూ కొడుకులకు ఉప ముఖ్యమంత్రీ, మంత్రి పదవులు ఇచ్చేటప్పుడు తెలియదా వారి గురించి!? బీహార్ ఎన్నికల సందర్భంగా గెలుపే ప్రధానంగా నరేంద్ర మోడీ బీహార్ రాష్ట్రానికి లక్షా యాబై వేల కోట్ల ప్యాకేజీని ప్రకటించినప్పుడు దానిని రాజకీయ ప్రలోభంగా అభివర్ణించి ఇది ఒక రకమైన అవినీతేనని మోడీని దుయ్యబట్టారు. నిఖార్సుగా నిలబడతాడని నితీశ్‌కుమార్‌పై కాస్తంత ఆశలు పెట్టుకున్న మాట వాస్తవమే కానీ అధికారం కోసం ఆత్మీయులను (నమ్మి ఓటేసిన వారిని) వంచించి అవతలి వారి పంచన చేరడం ఆయనలోని అధికార దాహానికి అద్దం పడుతుంది. ఇప్పుడు కూడా 2019 ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఈ అడుగు వేశారన్నది వాస్తవం. ఎందుకంటే బీజేపీ నయానా భయానా చేజిక్కించుకుంటున్న రాష్ట్రాలనూ చూస్తుంటే భయమేసిందేమో, కనుక దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకునే బాపతని మరోమారు తేల్చినారు. ఇక్కడ మరో లెక్క కూడా ఉన్నది, ఒకవేళ లాలూయే పక్కకు జరిగినయెడల తన సీఎం పదవికి ఎసరు వస్తదని కూడా అంచనా వేసియుండవచ్చు. ఎన్ని అకృత్యాలైనా చేసి బీహారును దక్కించుకోవాలనుకున్న మోడీకి బంగారు పళ్ళెంలో పెట్టి నితీశ్ అప్పగించారు. అయితే ప్రధానమంత్రి అర్హత కలిగిన వ్యక్తి నితీశ్ అని అంచనా వేసినవారంతా మోడీ వ్యూహాల్లో జూనియర్ భాగస్వామిగా మారిపోయినందుకు ముక్కున వేలేసుకున్నారు. నితీశ్ భాగస్వామిని మార్చడం మోసమేమీ కాదు ఎందుకంటే ఇది మోసమైతే 2013లో చేసిందీ మోసమే అంటూ పవన్ కుమార్ సెలవివ్వడం ఫిరాయింపులను జేడీయూ బలపరుస్తున్నట్టు రుజువవుతోంది. ఒక పార్టీ నుండి గెలిచిన వారు ఎలాగైతే పార్టీ మారితే అనర్హులుగా ప్రకటించాలని చట్టం చెబుతుందో ఒక సమూహం నుండి మరో సమూహానికి వెళ్ళడం కూడా ఫిరాయింపుగానే భావించి అనర్హులను చేసినప్పుడే నిజాయితీ కొంతైనా నిలబడుతుంది.

సెల్: 9951300016

మెయిల్ @ నవతెలంగాణ

'టీమాస్ ఫోరం' నిలబడాలి



రాజేందర్ దామెర

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తోంది. ప్రజాస్వామ్యం గురించి గానీ, హక్కుల గురించి గానీ, సమానత్వం గురించి గానీ, హింసా, నిర్బంధం, అణచివేత, వివక్ష గురించి ఎవరేం మాట్లాడినా కేసీఆర్ ప్రభుత్వం తప్పుగానే భావిస్తోంది. నిన్న మొన్నటి సిరిసిల్ల జిల్లా నేరళ్ల ఘటన కావచ్చు, ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో ప్రభుత్వం చేపట్టిన భూసేకరణ విషయంలో కావచ్చు, గిట్టు బాటు ధర కావాలని అడిగితే రైతుల చేతులకు సంకెళ్లు వేసిన సంఘటన కావచ్చు, ప్రభుత్వం తీరు ప్రజలను విస్మయానికి గురిచేసింది. ప్రజాసంఘాలు, పార్టీలు ప్రభుత్వ పద్ధతులను ఏ మాత్రం ప్రశ్నించినా తట్టుకునే స్థితిలో లేకపోవడం తెలంగాణ సమాజాన్నే ఆశ్చర్యానికి గురి చేసింది. అంతా సరైనా పద్ధతుల్లోనే జరుగుతోంది. కావాలని రాద్ధాంతం చేస్తున్నారని ప్రభుత్వం ఎదురుదాడికి దిగడం, ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు, పార్టీలు మాట్లాడేదంతా తప్పే అన్నట్టు చిత్రించడం పరిపాటిగా మారింది. సిరిసిల్ల జిల్లా నేరెళ్ల ఘటనలో ప్రభుత్వం తీరు ఎవరి వైపో స్పష్టంగా తేలిపోయింది. దళితులపై థర్డుడిగ్రీ ప్రయోగించి, ప్రభుత్వాధినేతలు మాట్లాడిన తీరు, అక్కడ జరుగుతున్న ఇసుక మాఫియాను కప్పిపుచ్చడానికి ఊతమిచ్చేవిధంగానే ఉన్నాయనడంలో అతియోశక్తి లేదు. ఈ నేపథ్యంలో పాలకులు ఎంతైతే కఠినంగా వ్యవహరిస్తున్నారో, అణచివేసే చర్యలకు పాల్పడుతున్నారో అదే స్థాయిలో ప్రతిఘటించే శక్తి కూడా బలపడుతుందనేది గమనించాలి. అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలో ప్రశ్నించే గొంతులు, ప్రజాస్వామిక శక్తులు, ప్రజల పక్షాన నిలబడేందుకు 'టీమాస్ ఫోరం' పైరుతో ఒక్కతాటిపైకి రావడం స్వాగతించాల్సిన అంశం. విభిన్న పథాలు కలిగిన శక్తులన్ని ఒక వేదికమీదికి రావడం సాధరణమైన అంశమేమి కాదు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో స్వరాష్ట్ర పాలకుల విధానాలను ఎదిరించేందుకు ప్రత్యామ్నాయ వేదికగా 'టీమాస్ ఫోరం' ఏర్పడింది. ఇప్పటికే 'టీమాస్ ఫోరం' ప్రజలను ఆలోచింపజేస్తోంది. ప్రభుత్వంపైనా ప్రజలకు పెరుగుతున్న అసంతృప్తిని, టీమాస్ ఫోరంపై ప్రజలకున్న విశ్వాసాన్ని సరైన పద్ధతుల్లో సమన్వయం చేసుకుంటూ ప్రజలను జాగృతం చేయాల్సిన అవసరం ఎంతో ఉంది. తెలంగాణ రాష్ట్రంలో ఆకాశానికి నిచ్చేన వేస్తూ ప్రజలను మభ్యపెడుతున్న కేసీఆర్ విధానాలను ఎండగట్టాలి. తెలంగాణ రాష్ట్రాన్ని ఉన్నతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు పునాదులు బలంగా వేయాలి.

- వరంగల్.



పోషకాల కొర్రలు...

కొర్రలు.. ఈ తరానికి అంతగా తెలియని ఆహారం. వెనకట మన పెద్దలు ఎక్కువగా తీసుకున్న పోషకాహారం. వరి అంతగా పండని రోజుల్లో తెలంగాణలో ఇదే ప్రధాన ఆహారం. పోషకాలతోపాటు అత్యధిక ఫైబర్ ఉన్న కొర్రలు తిన్నవాళ్లూ ఇప్పటికీ బలంగా ఉన్నారు. బియ్యం పెరిగాక.. కొర్రలు తగ్గాయి. కానీ జనానికి రోగాలు పెరిగాయి. ఆరోగ్యంగా ఉండాలంటే మళ్లీ పాత ఆహార పద్ధతులకు అలవాటు పడాల్సిందే. అందుకే ఈ వారం కొర్రల స్పెషల్స్.



లడ్డు

కావలసిన పదార్థాలు: కొర్రలు - ఒకటిన్నర కప్పు, తేనె - పావు కప్పు, పంచదార పొడి - పావు కప్పు, యాలకుల పొడి - 1 టీ స్పూను, నెయ్యి - 1 టేబుల్ స్పూను, జీడిపప్పు - 2 టేబుల్ స్పూన్లు.

తయారుచేసే విధానం:
కొర్రలను దోరగా వేయించాలి. చల్లారిన తర్వాత బరకగా పొడి చేసుకోవాలి. నెయ్యిలో జీడిపప్పులు వేయించాలి. అదే కడాయిలో కొర్రలు, పంచదార, యాలకుల పొడులు వేసి కొద్దిసేపు వేయించి మంట తీసెయ్యాలి. చల్లారిన తర్వాత తేనె కలిపి, లడ్డూలు చేసుకుని జీడిపప్పుతో అలంకరించాలి. అంతే కొర్ర లడ్డూ రెడీ!



పాయసం

కావలసిన పదార్థాలు: కొర్రలు - 1 కప్పు, శనగపప్పు - పావు కప్పు, పాలు - అర లీటరు, పచ్చి కర్జూరం - 1 కప్పు, జీడిపప్పు, ఎండుద్రాక్ష - పావుకప్పు, యాలకుల పొడి - అర టీ స్పూను, తేనె - ఒక టీ స్పూను, నెయ్యి - 1 టీ స్పూను.

తయారుచేసే విధానం: కొన్ని నీళ్లు చిలకరించి కర్జూరాన్ని పేస్టులా చేసుకుని పక్కనుంచాలి. కొర్రల్ని దోరగా వేయించి, శనగపప్పుతోపాటు మూడు కప్పులు నీళ్లు పోసి మూడు విజిల్స్ వచ్చేవరకు కుక్కర్లో ఉడికించాలి. చల్లారిన తర్వాత పాలు, కర్జూరం పేస్టు కలిపి చిన్నమంటపై బుడగలు వచ్చేవరకు ఉంచాలి. తర్వాత సర్వింగ్ బౌల్‌లోకి తీసుకుని నెయ్యిలో వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్‌లతో అలంకరించాలి. యాలకుల పొడి, తేనె చల్లి వేడి వేడిగా తింటే రుచి అద్భుతం!

దోశ

కావలసిన పదార్థాలు: కొర్రలు - రెండు కప్పులు, మినపప్పు- కప్పు, శనగపప్పు - రెండు టీ స్పూన్స్, మెంతులు- అర టీస్పూన్.

తయారుచేసే విధానం: కొర్రలు, మినప్పప్పు, శనగపప్పును శుభ్రంగా కడిగి, వేర్వేరుగా నాలుగు గంటల పాటు నానబెట్టాలి. విడివిడిగా మిక్సీలో వేసి మెత్తగా రుబ్బుకోవాలి. తర్వాత మూడింటినీ కలిపి, ఉప్పు వేసి రాత్రంతా పులియబెట్టాలి. పొద్దున్నే బయటకు తీసి కొంచెం నీరు కలిపి.. దోశలు వేసుకోవాలి. దీనిని కూడా కొబ్బరి, పల్లీ, పుట్నాల చట్నీతో తింటే బాగుంటాయి. ఎల్లి పాయ కారంతో తిన్నా రుచిగా ఉంటాయి!





ఇడ్లీలు

కావలసిన పదార్థాలు: కొర్ర బియ్యం - మూడు కప్పులు, మినప్పప్పు - కప్పు, మెంతులు - టేబుల్ స్పూన్, ఉప్పు, నూనె - తగినంత.

తయారుచేసే విధానం: కొర్ర బియ్యం, మినపప్పును వేర్వేరుగా 8 నుంచి 10 గంటలపాటు నానబెట్టాలి. వాటికి మెంతుల్ని కలిపి విడివిడిగా రుబ్బాలి. ఆ తర్వాత తగినంత ఉప్పు కలిపి, రెండింటినీ ఒక్క గిన్నెలో వేసి బాగా కలపాలి. ఈ పిండిని ఎనిమిది గంటల పాటు పులియబెట్టాలి. ఆ తర్వాత ఇడ్లీ పాత్ర తీసుకొని కొద్దికొద్దిగా నూనె రాసి ఇడ్లీలను ఆవిరి మీద ఉడికించాలి. కొబ్బరి, పల్లీ చట్నీలతో ఈ ఇడ్లీలు తింటే బాగా టేస్టీగా ఉంటాయి!

గెరిల్లా సైనికురాలు

స్వాతంత్ర్యపోరాటంలోనూ, తెలంగాణ సాయుధ పోరాటంలోనూ పాల్గొన్న మహిళల సంఖ్య తక్కువేమి కాదు. ఎంతో మంది మహిళలు ఇంటి బాధ్యతలతో పాటు ఉద్యమబాటలోనూ ముందున్నారు. వారిలో ఒకరు దాయం ప్రియంవద. దివంగత తెలంగాణా సాయుధ పోరాటయోధుడు దాయం రాజిరెడ్డి సోదరి. భీమిరెడ్డి నరసింహారెడ్డి, శశిరేఖ, మల్లు స్వరాజ్యం తదితర ఉద్యమకారులంతా ప్రియంవద సమీప బంధువులు.



దాయం ప్రియంవద
(1928 - ఆగస్టు 3, 2013)

నల్లగొండ జిల్లా, తుంగతుర్తి మండలం వెంపటి సమీపంలోని తూర్పుగూడెంలో 1928లో ప్రియంవద జన్మించారు. తల్లిదండ్రులు లక్ష్మమ్మ, రామకృష్ణారెడ్డి. మధ్య తరగతి వ్యవసాయ కుటుంబం. అమ్మాయిలకు విద్య అంతంత మాత్రమే అయినా ఆమెను చదివించారు. రష్యన్ సాహిత్యం, గోర్కి నవలతో పాటు రెండో ప్రపంచ యుద్ధం గురించి వచ్చిన పుస్తకాలు చదివి నాటి ప్రపంచ పరిస్థితిని అర్థం చేసుకున్నారు.

1943లో 15 ఏండ్ల వయసులోనే అన్న రాజిరెడ్డితో కలిసి ఖమ్మం ఆంధ్రమహాసభకు హాజరయ్యారు. తెలంగాణ సాయుధపోరాట యోధులు బొమ్మగాని ధర్మభిక్షం, భీమిరెడ్డి నరసింహారెడ్డి, దాయం రాజిరెడ్డిలతో కలిసి సూర్యాపేట ప్రాంతంలో జరిగిన ఉద్యమాల్లో పాల్గొన్నారు.


గెరిల్లా సైనికురాలిగా ఆయుధం పట్టడానికి ముందు ఆమె విజయవాడలో ఆత్మరక్షణ, ఆయుధశిక్షణ పొందారు. . సాయుధ పోరాటంలో గాయపడ్డ వారికి వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేకంగా ఆరోగ్యసేవిక (నర్సింగ్) ట్రైనింగ్ పొందారు. మహిళా హక్కుల సాధన, బాల్యవివాహాల నిర్మూలన, బాలికా విద్య కోసం ఉద్యమం చేపట్టారు. మహిళల కూలిరేట్ల పెంపు కోసం ఆమె రాజీలేని పోరాటం సాగించారు.

Women of the day

గ్రామాల్లోతిరిగి సమాజంలో స్త్రీలకు ఉండే ఇబ్బందులను ఎలా ఎదుర్కోవాలో చైతన్యం కల్పించేవారు. ఆమె గొంతులో వినిపించే ఆత్మస్థైర్యం ఎందరో మహిళల్లో అవగాహన కల్పించేలా ఉండేది. చదువు కోవాలన్న ఆసక్తి ఉన్న మహిళలకు తానే స్వయంగా పాఠాలు చెప్పేవారు. వీధివీధికి గ్రూపు మీటింగులు పెట్టి మహిళలంతా సంఘటితంగా తమ హక్కులను సాధించుకోవాలని సూచించేవారు.

ఎటు చూసినా రజాకార్ల దాడులు.. పోరాటయోధుల ఆచూకి చెప్పమని వేధింపులు అన్నింటినీ భరించింది. తల్లిదండ్రులను చూసేందుకు వచ్చిన ఆమెను పోలీసులు అరెస్టు చేసి చంచల్‌గూడ జైల్లో బంధించారు. మూడు నెలల తర్వాత బయటికి వచ్చి.. ఆయుధ శిక్షణ తీసుకున్నారు. మరోసారి సైన్యం చేతిలో అరెస్టు కావడంతో రెండేండ్లు జైలుశిక్ష విధించారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జైళ్ళలోనూ ఆమె జైలు జీవితం గడిచింది. తుదిశ్వాస విడిచే వరకూ సిపిఐ నాయకురాలిగా, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్టు కార్యక్రమాల్లో చురుకైన పాత్రను నిర్వర్తించారు. తెలంగాణ సాయుధ పోరాటం తర్వాత సైద్ధాంతిక నిబద్ధత కలిగిన కమ్యూనిస్టుగా జీవించారు.

పది నిమిషాలు మౌనంగా !



24 గంటల్లో కేవలం పది నిమిషాలు మీ కోసం మీరు మౌనంగా ఉంటే చాలు ఎంతో మార్పును చూస్తారని చెబుతున్నారు నిపుణులు. వాటికి సంబంధించి కొన్ని విషయాల గురించి తెలుసుకుందాం!

ఉదయం లేవగానే పది నిమిషాలు మౌనంగా ఒక చోట కూర్చుంటే సరిపోతుంది. ఏ ఆలోచనలు వస్తున్నాయో వాటిని గమనించండి. అలా గమనిస్తూ నిమిషానికి ఒకసారి ధైర్యంగా శ్వాస తీసుకుని వదలండి. ఈ అలవాటు రోజులో ఎంత క్లిష్టమైన పరిస్థితులనైనా ఎదుర్కొనే శక్తినిస్తుంది.

అలాగే ఆఫీసు పనులు ముంగించుకొని ఇంటికి వచ్చే ముందు.. ఓ ఐదు నిమిషాలు ఆ రోజు మీరు ఏం చేశారో రాసుకోండి. వాటిని ఎంత వరకు పూర్తి చేశారో కాగితం మీద రాసుకోండి. పనులు పూర్తి చేయలేక పోవడానికి కారణాలను విశ్లేషించుకుంటే సరిపోతుంది. దాంతో పాటు రాత్రి పడుకునే ముందు ఆనందం కలిగించిన సంఘటనలను, విజయాలను గుర్తు చేసుకోవాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది. కాబట్టి ఓ సారి ప్రయత్నించి చూడండి !

వస్తువులుగానే చూస్తున్నారు

'ఆడది విలాసవస్తువు కాదు. ఆడవాళ్లని సెక్స్ సింబల్స్‌గా భావించడం సరైనది కాదు' ఇలాంటి మాటలు మనం నిత్యం వింటూనే ఉంటాం. ఇది నిజం కూడా. అయితే నిజంగా మన మెదడు ఆడవాళ్లని, మగవాళ్లని చూసే తీరులో ఏమైనా మార్పు ఉందా? అనే విషయంపై బెల్జియంకు చెందిన ఫిలిప్పే బెర్నాడ్ అనే పరిశోధకుడికి అనుమానం వచ్చింది...

మన మెదడు వస్తువులని వేరేగా, మనుషులని వేరేగా గమనిస్తుంది. అందుకు ఓ ఉదాహరణ చెప్పుకోవచ్చు. ఒక పెన్ను ఉందనుకోండి. అందులోని క్యాప్ మాత్రమే చూపిస్తే.... అది పెన్నుకి సంబంధించిన భాగమని పసిగట్టేస్తాం. అదే ఒక మనిషి ముక్కుని మాత్రమే చూపిస్తే, అది ఎవరిదో కనిపెట్టేందుకు చాలా ఇబ్బంది పడతాం. వస్తువులనీ, మనుషులనీ పసిగట్టడంలో మరో తేడా కూడా ఉంది. మనుషులని తిరగేసి చూసినప్పుడు, వారు ఫలానా అని గుర్తించడం కొంచెం కష్టం. కానీ వస్తువులని తిరగేసి చూసినా, మామూములుగా చూసినా... ఇది పెన్ను, ఇది పుస్తకం, ఇది టీవీ అని ఠక్కున చెప్పేయగలుగుతాం.



ఇలాగే వస్తువులనీ, మనుషులనీ మెదడు ప్రాసెస్ చేసే తీరునిబట్టి, జనం ఆడవాళ్లని ఎలా చూస్తున్నారో తెలుసుకోవాలనుకున్నారు పరిశోధకుడు. ఇందుకోసం తక్కువ దుస్తులలో ఉన్న మోడల్స్ బొమ్మలని ఎంచుకున్నారు. వీరిలో మగవారి ఫొటోలు, ఆడవారి ఫొటోలు రెండూ ఉన్నాయి. ఈ ఫొటోలను కొందరికి తిరగేసి చూపించారు. ఆ తర్వాత కాసేపటికి అదే ఫొటోని సరిగ్గా నిలబెట్టి చూపించి... 'ఇంతకు ముందు మీరు చూసిన ఫొటోలో వ్యక్తీ ఇందులో ఉన్న వ్యక్తీ ఒకరేనా!' అని అడిగారు.

వారు చెప్పిన సమాధానాలకు పరిశోధకులు సైతం ఆశ్చర్యపోయారు. ప్రేక్షకులు ఆడవారి ఫొటోలను సరిగ్గానే పోల్చుకోగలిగారు. కానీ మగవారి ఫొటోలని పోల్చుకోవడంలో కాస్త ఇబ్బంది పడ్డారు. అంటే! ఆడవారిని వస్తువులుగానూ, మగవారిని మనుషులుగానూ గుర్తిస్తున్నారన్నమాట. ఇలా ఈ వివక్ష కేవలం ప్రకటనలో కనిపించే మహిళల పట్లేనా లేకపోతే, మన నిజజీవితంలో ఎదురుపడే ప్రతి ఆడవారినీ మనం వస్తువులుగానే చూస్తున్నామా? అని తేల్చేందుకు త్వరలోనే మరో పరిశోధన చేపట్టనున్నారట.

ఫిలిప్పే బెర్నాడ్ చేసిన ఈ పరిశోధన కాస్త బాధగా ఉన్నా... తరతరాలుగా మన సమాజం ఆడవారిని చూస్తున్న తీరు వల్లనే మన మెదడు కూడా ఇలా మారిపోయి ఉండవచ్చు అంటున్నారు నిపుణులు. అందుకే సమాజం ఆడవారిని చూసే తీరులో, ఆలోచనల్లో మార్పు రావాలి.

కొత్తిమీర..




కూర ఎంత బాగా వండినా.. చివరకు కొత్తిమీర చేర్చందే రుచి రాదు. ఒక్క కూరకేనా... సలాడ్స్, సూప్ అన్నింటికీ రంగు, రుచి, వాసనను ఇచ్చేది కొత్తిమీర. అయితే దీన్ని చాలా మంది యాడెడ్ ఫ్లేవర్‌లాగానే చూస్తారు... కానీ అంతకుమించిన బెనిఫిట్స్ ఇందులో ఉన్నాయి.

కీలకమైన విటమిన్స్ 'సి', 'బి12', 'కె', 'ఎ' ఇందులో ఉన్నాయి. రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు ఎముకల పటిష్టతకు తోడ్పడుతుంది. నరాల వ్యవస్థను శుద్ధి చేస్తుంది. చర్మక్యాన్సర్ రాకుండా కాపాడుతుంది. రక్తపోటును అదుపులో ఉంచుతుంది. ఇందులో ఉన్న ఫోలిక్ యాసిడ్ గుండెకు టానిక్‌లా పనిచేస్తుంది. అలర్జీలు రాకుండా కాపాడుతుంది. అల్సర్స్‌బారిన పడకుండా చేస్తుంది. డయాబెటిస్, కోలన్ క్యాన్సర్, ఆస్తమా వంటివి దరి చేరనివ్వదు.

నేనూ వివక్షను ఎదుర్కొన్నా...

సెరెనా విలియమ్స్... టెన్నిస్ స్టార్. 23సార్లు గ్రాండ్‌స్లామ్ దక్కించుకున్న గ్రాండ్ లేడీ. ప్రపంచంలోనే అత్యధిక రికార్డులు బద్దలు కొట్టిన ఫీమేల్ అథ్లెట్. ఇటీవల ఆమె ఫార్చ్యూన్ మ్యాగజైన్‌లో జాతివివక్ష, లింగ వివక్ష గురించి రాసిన ఆర్టికల్ సంచలనం రేపుతోంది. నల్లజాతి మహిళలకు సరైన వేతనం ఇవ్వడం లేదన్న ఆవేదనతో ఆమె రాసిన లేఖ అందరినీ కదిలిస్తోంది. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో... తెల్లజాతి మహిళలకంటే నల్లజాతి మహిళలు 17శాతం తక్కువ వేతనాన్ని పొందుతున్నారని ఆ లేఖలో పేర్కొంది. సాధారణ కూలీ నుంచి గ్రాడ్యుయేట్స్ వరకు అన్ని స్థానాల్లోనూ తక్కువగా చూడబడుతున్నారని వాపోయింది. పురుష అథ్లెట్లతో తాను కూడా అనేక అవమానాల పాలయ్యానని, టెన్నిస్ కోర్టులోనూ, బయటా జాతివివక్షను ఎదుర్కొన్నానని పేర్కొంది. ప్రస్తుత పరిస్థితులు మారాలంటే చట్టాల్లో, వాటి అమలు తీరులో మార్పు రావాలని కోరింది.





మిమ్మల్ని మీరు నమ్మండి...

"నా జీవితంలో ప్రతిదశలోనూ నాకోసం నేను నిలబడటం, నాకోసం నేను గొంతెత్తడం నేర్చుకున్నాను. కానీ నా అదృష్టం కొద్దీ నేను ఆత్మవిశ్వాసంతో ఉండటం, నా కుటుంబం, స్నేహితులు మద్దతుగా నిలవడం, ప్రోత్సహించడం నన్ను ముందుకు నడిపించాయి. అయినా ఈ అన్యాయం ఎప్పుడూ గాయపరుస్తూనే ఉండేది. ప్రస్తుతం నేను ఆర్థికంగా ఊహించినదానికంటే బలంగానే ఉన్నాను. కానీ నేను మాట్లాడుతున్నది నా గురించి మాత్రమే కాదు... అమెరికాలో ఉన్న 24 మిలియన్ల నల్లజాతి మహిళల గురించి మాట్లాడుతున్నాను. ఒకవేళ నేను టెన్నిస్ రాకెట్‌ను గనుక పట్టుకోకపోయి ఉంటే... వారిలో ఒకరిలాగనే మిగిలిపోయేదాన్ని. 23 గ్రాండ్‌స్లామ్‌లు సాధించడం కంటే... పేదరికం, జాతివివక్ష, లింగ వివక్షను అధిగమించడమే చాలా కష్టమైన పని. తరతరాలుగా కొనసాగుతున్న అణచివేత మహిళలను ఇంకా తాము తక్కువగానే భావించేలా చేస్తున్నది. నల్లజాతి మహిళలు భయపడకండి. సమానవేతనం కోసం మాట్లాడండి. అవకాశం ఉన్న ప్రతిచోటా, సందర్భం వచ్చినప్పుడల్లా మీ గొంతెత్తండి. దానివల్ల మీ తరువాత వచ్చే మహిళలకు దారి చూపిన వారవుతారు. ప్రతి మహిళలో ఎంతో కొంత శక్తి సామర్థ్యం ఉంటుంది. మీలో కూడా ఉండే ఉంటుంది. కాకపోతే అది మీరు తెలుసుకోవడానికి చాలా సమయం పడుతుండొచ్చు. నాలో ఉన్న శక్తిని నేను గుర్తించడానికి చాలా సమయమే పట్టింది. కాబట్టి ఆందోళన పడకండి. మిమ్మల్ని మీరు నమ్మండి" అంటూ ధైర్యాన్ని నూరిపోసింది. రెడిట్ కో ఫౌండర్ అలెక్సిస్ ఒహానియన్‌తో రిలేషన్‌లో ఉన్న సెరెనా... ప్రస్తుతం గర్భిణి.

ఇట్లా చేద్దాం

బాదం నూనెలో కొంచెం ఆలివ్ నూనె కలిపి కంటి చుట్టూ ఉండే నలుపు ప్రాంతంపై రాస్తే ఆ నలుపును నివారించవచ్చు.

సబ్‌కలెక్టర్ ఆదర్శం సర్కారు ఆస్పత్రిలో ప్రసవం



రంపచోడవరం: ఆ ఐఎఎస్ అధికారి అందరికీ ఆదర్శంగా నిలిచారు. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం కల్గించాలనే ఉద్దేశ్యంతో ముందడుగు వేశారు. పండంటి శిశువును కనడానికి ప్రభుత్వాస్పత్రినే ఎంపిక చేసుకున్నారు. సర్కారు ఆస్పత్రులను ఒక పథకం ప్రకారం ప్రభుత్వమే నీరుగార్చుతున్న సమయంలో తూర్పుగోదావరి జిల్లా సబ్‌కలెక్టర్ విజయకృష్ణన్ తీసుకున్న ఈ నిర్ణయం అందరి ప్రశంసలకు నోచుకుంది. బుధవారం తెల్లవారు జామున 5.30 గంటలకు రంపచోడవరం ప్రభుత్వాస్పత్రిలో రాజమహేంద్రవరం సబ్‌కలెక్టర్ విజయకృష్ణన్ ప్రసవం నిమిత్తం చేరారు. రాజమహేంద్రవరం నుంచి వచ్చిన డాక్టర్లు ఇందిర, రమేష్‌కిషోర్, ఎనస్థీషియన్ విష్ణువర్ధిని, స్థానిక వైద్యులు వీరబ్బాయి, రాములు ఆమెకు వైద్యసేవలందించారు. సిజేరియన్ చేశారు. ఉదయం 6.30 గంటలకు మగ బిడ్డకు ఆమె జన్మనిచ్చారు. ఆమె భర్త ఐటిడిఎ పిఒ దినేష్‌కుమార్ విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకం కలిగించడానికే తమ దంపతులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

'బెల్టు' తీయండి: సీఎం చంద్రబాబు

అమరావతి : అవినీతికి పాల్పడితే వ్యవస్థపై నమ్మకం పోతుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. బెల్టు షాపుల నిర్మూలన, ఇసుక తవ్వకాలపై తన నివాసం నుంచి బుధవారం జిల్లా కలెక్టర్లు, మైనింగ్, ఎక్సైజ్ శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటి వరకూ రాష్ట్రంలో తొలగించిన బెల్టు షాపులు, నమోదు చేసిన కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు జవాబు దారీ తనంగాగా ఉంటేనే పాల కులు, అధికార యంత్రాం గంపై గౌరవం పెరుగుతుందన్నారు. బెల్టు షాపులను పూర్తిగా తొలగించాలని ఆదేశి ంచారు. చట్ట ఉల్లంఘనలకు పాల్పడితే లైసెన్సులు రద్దు చేయాలన్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయా లని, అధిక ధరలకు ఇసుకను అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

సీఎంకు వినిపించేవి సింగపూర్ మాటలే

రాజేంద్రసింగ్ వ్యాఖ్య

- కృష్ణా తీర పరిరక్షణ యాత్ర ప్రారంభం



అమరావతి : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి సింగపూర్ మాటలే వినపడుతున్నాయని రామన్ మెగసెసే అవార్డు గ్రహీత రాజేంద్రసింగ్ వ్యాఖ్యానించారు. విజయవాడ కనక దుర్గఘాట్ వద్ద కృష్ణా నది పరిరక్షణ, పరిశీలన యాత్ర బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాజేంద్రసింగ్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ఎవరూ చెప్పినా వినడం లేదని, జగ్గీవాసుదేవ్ చెబితే వింటారేమో చూడాలని అన్నారు. అమరావతిలో కృష్ణానదిని ఆక్రమించి అనేక నిర్మాణాలు చేపట్టారని, వాటిని తొలగించాలని తెలిపారు. ముఖ్యమంత్రి కూడా కృష్ణానది పరివాహక చట్టాన్ని ఉల్లంఘించి నిర్మించిన అక్రమ నిర్మాణంలోనే ఉంటున్నారని స్పష్టం చేశారు. నదులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనా, ప్రభుత్వాలపైనా ఉందని సూచించారు. చంద్రబాబుకు మాత్రం అవేమీ పట్టడం లేదన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరువల్ల బోరుల్లో నీరూ కూడా కలుషితం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు సింగపూర్ చుట్టూ తిరుగుతున్నారని, ఆ దేశం మాటలే వింటున్నారని తెలిపారు. అక్కడి ప్రజలు గాల్లో ప్రయాణాలు చేస్తారని, భారతదేశ ప్రజలు ఇప్పటికీ భూమినే నమ్ముకుని ఉన్నారని విశ్లేషించారు. నిపుణులు విక్రం సోనీ మాట్లాడుతూ అత్యంత విలువైన నీటి వనరులున్న భూములను రాతి నిర్మాణాలు చేపట్టడానికి కేటాయించడం అత్యంత ప్రమాదకమని తెలిపారు.

టీడీపీకి శిల్పా గుడ్‌బై



నంద్యాల: నంద్యాల ఉప ఎన్నికల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. అధికార తెలుగుదేశం పార్టీకి ఎమ్మెల్సీ చక్రపాణిరెడ్డి షాకిచ్చారు. టీడీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. తమను కొద్దికాలంగా టీడీపీ నేతలు అవమానిస్తున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఇంతవరకు టీడీపీ లోకి వెళ్లిన ఎమ్మెల్యేలంతా రాజీనామా చేస్తే తానూ ఎమ్మెల్సీ పదవికీ రాజీనామా చేస్తానని ప్రకటించారు. ఆయన సోదరుడు మోహన్‌రెడ్డి వైసీపీ అభ్యర్థిగా నంద్యాల ఉప ఎన్నికల బరిలో దిగిన నేపథ్యంలో చక్రపాణిరెడ్డి రాజీనామా చేయడం టీడీపీని రాజకీయంగా ఒక కుదుపు కుదిపింది. వెంటనే సీఎం నేరుగా రంగంలోకి దిగారు. జిల్లా నాయకత్వంతో మాట్లాడారు. చక్రపాణి రాజీనామా వ్యవహారం ఎన్నికలపై పడకుండా చూడాలని ఆదేశించారు. ఈ పరిణామంపై ఇన్‌చార్జి మంత్రి కాలువ శ్రీనివాసులు, ఎంపీ రమేష్‌పైనా సీఎం ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. పార్టీకి రాజీనామా అనంతరం ఎమ్మెల్సీ చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ పదవికీ రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, రాజీనామ లేఖను జేబులో పెట్టుకొని తిరు గుతున్నా నని తెలిపారు. అయితే పార్టీ ఫిరాయిం చిన ఎమ్మెల్యేలంతా రాజీ నామా చేస్తే, అంతా కలిసి ప్రజాక్షేత్రంలో తేల్చుకుందామని సవాల్ చేశారు. శిల్పా చక్రపాణిరెడ్డి సోదరుడు శిల్పా మోహన్‌రెడ్డి ఇటీవల వైసీపీలో చేరి ఆ పార్టీ నంద్యాల అభ్యర్థిగా బరిలో నిలిచిన విషయం తెలిసిందే. సోదరుడు వైసీపీలో చేరినా బంధుత్వం వేరు, రాజకీయాలు వేరు టీడీపీలోనే ఉంటానని శిల్పా చక్రపాణిరెడ్డి ప్రకటించినా పార్టీ నుంచి సరైన ఆదరణ లేకపోవడంతో ఆయన టీడీపీని వీడేందుకు నిర్ణయించుకున్నారు.

ఇసుకలారీకి మరొకరు బలి

- సిరిసిల్ల నుంచి సిద్దిపేట వెళ్తుండగా ఘటన



నవతెలంగాణ-ముస్తాబాద్

నేరెళ్ల ఘటన పూర్తిగా సమసిపోకముందే మరో ఇసుకలారీ ఓ వృద్ధుడిని బలితీసుకుంది. ఈ ఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోత్గల్‌లో బుధవారం జరిగింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. కొడుముంజ క్వారీ నుంచి ఇసుకను ముస్తాబాద్ మండలం గన్నెవారిపల్లె, పోత్గల్ మీదుగా గజ్వేల్‌కు తరలిస్తున్నారు. ఈ క్రమంలో పోత్గల్‌కు చెందిన గన్నె శంకరయ్య(56) తన ద్విచక్రవాహనంపై గన్నెవారిపల్లె నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. అదే సమయంలో ఎదురుగా వచ్చిన ఇసుక లారీ గ్రామశివారులో శంకరయ్య వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో అతని కాళ్లు, నడుము విరిపోయి తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు హుటాహుటిన స్థానిక ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సాయంత్రం మరణించాడు. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ పందిరి, సెస్ మాజీ డైరెక్టర్ గౌతమ్‌రావు, జడ్పీ కో - ఆప్షన్ సభ్యుడు సర్వర్‌పాషా, మండల కో-ఆప్షన్ అన్వర్‌పాషా, టీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు సంతోష్‌రావు పరామర్శించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఎంతమంది దళితుల రక్తం తాగితే ధన దాహం తీరుతుంది: ఉత్తమ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎంత మంది దళితులు రక్తం తాగితే మీ ధన దాహం తీరుతుందని ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావును టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. సిరిసిల్లలో జరుగుతున్న ప్రమాదాలను కేటీఆర్ హత్యలుగా భావిస్తున్నామని, ఆయనపై హత్యకేసులు నమోదు చేయాలని, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.అధికార పార్టీ, కేసీఆర్ కుటుంబం, కేటీఆర్ స్వయంగా ఇసుక మాఫియాకు అండదండలు ఉండడంతో చెలరేగిపోతున్నారని విమర్శించారు. బుధవారం ఈమేరకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. గత కొంత కాలంగా సిరిసిల్ల ఇసుక మాఫియా విషయంలో కాంగ్రెస్ పోరాటం చేస్తోందన్నారు. సగటున పది రోజుల కొకసారి ఇసుక లారీ ప్రమాదం జరుగుతుందన్నారు. ఇంత జరుగుతున్నా కూడా ఇసుక మాఫియా ఆగడాలు ఇంకా మితిమీరిపోతున్నాయన్నారు. ఇసుక లారీతో దుమ్ము, ధూళిలతో, శబ్దాలతో అక్కడి ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కేటీఆర్ తన ధనదాహానికి జనాన్ని బలి తీసుకుంటున్నాడని మండిపడ్డారు.

సాంకేతిక సాయం మాత్రమే అందిస్తాం

- నిజామాబాద్‌లో స్పైస్‌పార్క్ ఏర్పాటుపై కేంద్రం



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

పసుపు పంట కోసం రాష్ట్రంలోని నిజామాబాద్‌లో స్పైస్(మసాలా దినుసులు) పార్క్ ఏర్పాటు చేయాల్సిందిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు అందాయని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వివరించారు. అయితే స్పైస్ పార్క్ కోసం రాష్ట్ర ప్రభుత్వం స్థలం, నిధులు సమకూరిస్తే కేంద్ర ప్రభుత్వంగా సాంకేతికపరమైన సాయం అందిస్తామని తెలిపారు. ఈ మేరకు రాజ్యసభలో రాతపూర్వక సమాధానంలో బుధవారం వివరించారు. అయితే తెలంగాణలో స్పైస్ అభివృద్ధి ఏజెన్సీ(ఎస్‌డీఏ) ఏర్పాటు చేసేందుకు కేంద్ర సర్కారు ఆమోదం తెలిపిందని తెలిపారు. వరంగల్‌లో ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేయడం వల్ల పరిశోధన, ఉత్పత్తి, మార్కెటింగ్, మసాలా దినుసుల ఎగుమతి, నాణ్యత మెరుగుపరడం తదితర అంశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమన్వయం చేసుకునే వీలుంటుందని తెలిపారు. మిర్చి, పసుపు రైతులకు సాయం అందించేందుకు కేంద్ర సర్కారు పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు.

తెలుగు రాష్ట్రాల్లో పారిశ్రామిక ప్రోత్సాహంపై కేంద్రం మౌనం

- పారిశ్రామికాభివృద్ధి బాధ్యత రాష్ట్రాలదేనని వెల్లడి

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన ప్రాంతాల్లో పారిశ్రామికాభివృద్ధికి కేంద్రం ఇస్తున్న ప్రోత్సాహం ఏమిటని ప్రశ్నించగా.. సర్కారు మౌనం వహించింది. వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఇచ్చిన రాతపూర్వక సమాధానంలో దాటవేత ధోరణి అవలంభించారు. అయితే తెలంగాణ, ఏపీలో వెనుకబడిన ప్రాంతాల్లో పారిశ్రామికాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పన్ను ప్రోత్సాహకాలతో పాటు ఆర్థిక వెసులుబాటు కల్పించాలని విభజన చట్టంలోని సెక్షన్ 94లో పేర్కొన్నారని మంత్రి నిర్మలా సీతారామన్ వివరించారు. అయితే కేంద్ర ప్రభుత్వంగా ఇప్పటి వరకు ఏం చర్యలు చేపట్టారని ప్రశ్నించగా జవాబు దాటవేశారు. పారిశ్రామిక ప్రోత్సాహం కోసం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఫెసిలిటేషన్ స్కీంను ప్రారంభించాలని ఏపీ సర్కారు ప్రతిపాదనలు పంపిందని పేర్కొన్నారు. దానిపై వాణిజ్యశాఖ ఏం నిర్ణయం తీసుకున్నరన్న దానిపై సమాధానం దాటవేశారు. కాగా వెనుకబడిన ప్రాంతాల్లో పారిశ్రామికాభివృద్ధి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకాశ్మీర్ రాష్ట్రాలకు కల్పించిన ప్రత్యేక వెసులుబాటు ముగిసిందని వివరించారు.

ఎగుమతుల వృద్ధి రేటు క్షీణత..

గడిచిన ఏడాది కాలంలో ఎగుమతుల వృద్ధి రేటు తగ్గిడం వాస్తవమేనని నిర్మలా సీతారామన్ వెల్లడించారు. సరుకుల ఎగుమతి ఆశాజనకంగానే ఉన్నప్పటికీ వృద్ధి రేటు మాత్రం తగ్గిందని తెలిపారు. అయితే అంతర్జాతీయంగా సరుకుల ధరలు తగ్గుముఖం పట్టడంతో సరుకుల ఎగుమతిదారులపై దాని ప్రభావం పడిందని చెప్పారు.

నేరెళ్ల బాధితుల విడుదల

- ప్రాణ హాని ఉంది : బాధితులు



నవతెలంగాణ-కరీంనగర్ టౌన్

కరీంనగర్ జైలు నుంచి బుధవారం రాత్రి నేరెళ్ల బాధితులు విడుదలయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన నేరెళ్ల ఘటన బాధితులకు షరతులతో కూడిన బెయిల్‌ను కోర్టు మంజూరు చేసింది. విడుదలైన వారిలో మాజీ సర్పంచ్ పెంట బానయ్య, గంధం గోపాల్, చెప్యాల బాలరాజు, కోల హరీష్, పసుల ఈశ్వర్ కుమార్, జిల్లెల్లకు చెందిన చీకోటి శ్రీనివాస్, కోరుకంటి గణేశ్, రామచంద్రపూర్‌కు చెందిన బత్తుల మహేశ్ ఉన్నారు. 'మిమ్మల్ని చూస్తామని అనుకోలేదు' అంటూ కుటుంబ సభ్యులు, బంధువులు జైలు గేటు బయట కన్నీరు మున్నీరయ్యారు. ఒంటిపైన అయిన గాయాలను బాధితులు చూపారు. ఇది చూసి కుటుంబ సభ్యులు తీవ్ర ఉద్వేగానికి లోనయ్యారు. అనంతరం బాధితులు మీడియాతో మాట్లాడుతూ.. తమకు ప్రాణ హాని ఉందని వాపోయారు. ఇప్పటికీ తాము నడువలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మూత్రం పోస్తే రక్తం వస్తుందని వాపోయారు. పోలీసులు కరెంటు షాక్ పెట్టి హింసించారని, అనరాని మాటలు అన్నారని కన్నీరుమున్నీరయ్యారు. 'ఇవన్నీ బయట చెబితే డ్రగ్స్ కేసులో ఇరికిస్తాం. మీ కుటుంబ సభ్యులను వ్యభిచారం కేసులో ఇరికిస్తాం. ఇప్పటికే మిమ్మల్ని కుటుంబానికి పనికి రాకుండా చేశాం. ఇక మీ భార్యలను మావద్దకు పంపండ్రా...' అంటూ పోలీసులు చెప్పరాని మాటలతో వేధించారని గోడు వెళ్లబోసుకున్నారు. బాధితుల విడుదల నేపథ్యంలో బుధవారం రోజంతా మీడియా ప్రతినిధులు, పలు పార్టీల నేతలు జైలు ఎదుట పడిగాపులు కాశారు. మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండి సంజయ్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గీట్ల ముకుందరెడ్డి, నాయకులు గుడికందుల సత్యం, మైనార్టీ నాయకులు వసీం అహ్మద్, వివిధ ప్రజా సంఘాల నాయకులు జైలు నుంచి విడుదలైన బాధితులను పరామర్శించారు.

కృత్రిమ వర్షాలు కురిపించండి

సీఎంకు చాడ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పంటలు ఎండిపోతున్న తరుణంలో మేఘమథనం ద్వారా కృత్రిమ వర్షాలు కురిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావుకు ఆయన బుధవారం లేఖ రాశారు. 20 రోజులుగా వర్షాలు లేకపోవడంతో వేసిన విత్తనాలు ఎండిపోతున్నాయని తెలిపారు.

గుల్బర్గా ఉర్సు ఉత్సవాలకు ప్రత్యేక రైళ్లు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

గుల్బర్గాలోని హజ్రత్ ఖ్వాజా బందానవాజ్ ఉర్సు ఉత్సవాల నేపథ్యంలో ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా హైదరాబాద్-గుల్బర్గా-హైదరాబాద్ మధ్య ఈనెల 8 నుంచి 12వ తేదీ మధ్య నాలుగు ప్రత్యేక రైళ్లు నడపేందుకు ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది.

ఆన్‌లైన్‌లో పిల్లల దత్తత : తుమ్మల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నవజాత శిశువుల దత్తత విషయంలో అక్రమాలు జరగకుండా ఉండేందుకుగాను పూర్తిగా ఆన్‌లైన్ పద్ధతిలో దత్తత ప్రక్రియ చేపట్టేలా చర్యలు తీసుకుంటామని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ అడ్వయిజరీ కమిటీ (కారా) చైర్మెన్ రాంచందర్ రెడ్డి సచివాలయంలో మంత్రితో భేటీ అయ్యారు.

మానేరు వాగులో ఉయ్యాలో.. ఇసుక మాఫియాను వేలాడదీయాలో..

తొలి ఏకాదశి..ఏడాది పొడుగూతా పండుగలకు తలుపులు తెరుస్తుంది. ఆ దినం (జులై 4) ఇంటిల్లీపాదీ తినడానికి కూసున్నారు. ఇంతలో వచ్చీరావడంతోనే కంచాలను తన్నేసి..ఈశ్వర్‌కుమార్‌ను లాక్కెళ్లారు. అట్లా మరో ఏడుగురిని పట్టుకెళ్లారు. దాదాపు 4 రోజులు చిత్రవధ చేశారు. వ్యభిచారం కేసులు పెడతామంటూ ఇంటి ఆడోళ్ల గుండెల్లో దడ పుట్టించారు. ఆ 8 కుటుంబాలే కాదు...నేరెళ్లసహా ఆయా పల్లెల్లో అనేక మంది భీతిల్లారు. పలువురు ఎక్కడెక్కడో తలదాచుకున్నారు. ఇట్లా..అనేక ఇండ్లల్లోని రాబోయే బతుకమ్మ సంబురాలను అద్వాన్నుగానే దోచేశారు. ఇక ఆ బడుగులు ఏమని 'బతకుమ్మ' పాడాలి? అదే మానేరు వాగులో ఇసుక మాఫియాను వేలాడదీయాలని తప్ప..!!

ఇల్లెందుల దుర్గాప్రసాద్



ఇసుక లారీలు మనుషులను చంపేశాయి. వారికవి కేవలం రోడ్డు ప్రమాదాలుగానే కనిపించాయి. కానీ, అదే ఇసుక లారీలను కాలబెడితే మాత్రం కొంపలు మునిగినట్టు ఫీలయ్యారు. చట్టమూ కలత చెందేంతటి వికృతంగా ప్రవర్తించారు. లారీలు దహనమైతే ఇన్సూరెన్సు వస్తుంది. వాటిని మళ్లీ కొనొచ్చు. పోయిన ప్రాణాలను తెచ్చివ్వగలరా? ఈ మాత్రం సోయి లేకపాయే. ఉన్మాదం ఆవహించినట్టుగా తోలు వొలిచారు. ఇదంతా పాలక పెద్దలకు వినోదమైంది. మాటి మాటికీ 600 కోట్లు ఖజానాకు తెచ్చామంటున్నారు. మరి..వెలకట్టలేని జీవితాలకు పాడె కట్టిన సంగతిని మరుగుపరుస్తున్నారు. ఇదెక్కడి విపరీతం? ఇంత జరుగుతున్నా..ఇసుక లారీల పైత్యం మాత్రం వదలడంలేదు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రాన్ని ఆనుకునే మానేరు వాగుంది. దాని పరివాహకంలో రెండు ఇసుక క్వారీలున్నాయి. అవే ఇప్పుడు మాఫియాకు సిరులు కురిపిస్తున్నాయి. అమాయకులకు కన్నీళ్లు పెట్టిస్తున్నాయి.

సక్రమాల పేరిట సవాలక్ష అక్రమాలు

మిడ్ మానేరు ముంపు పరిసరాల్లో 2 కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుకుంది. దాంట్లో కనీసం 20 లక్షల క్యూబిక్ మీటర్ల మేర ఇప్పటికే తరలించుకుపోయారు. నిజానికి మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్ఎండీసీ) సైట్‌లో ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలి. అట్లా చేసేదానికంటే..సగటున మూడింతలు ఎక్కువగా రవాణా అవుతోన్నట్టు ప్రచారంలో ఉంది. అంటే..సపోజ్ 500 ట్రిప్పులు పోవాల్సింది..1,500 ట్రిప్పులు పోతున్నట్టు. సీనరేజి చార్జీల చెల్లింపునూ, క్షేత్రస్థాయిలో తరలింపును సరిగా లెక్కిస్తే అక్రమాల పద్దు ఎంతో తేలుతుంది. 12 చక్రాల లారీల్లో గరిష్ఠంగా 30 టన్నులే నింపాలి. కానీ, 40 టన్నులదాకా కుక్కుతున్నారు. పొక్లెయిన్లతో చకాచకా కానిచ్చేస్తున్నారు. పైకి సక్రమమంటూనే ఇట్లా సవాలక్ష అక్రమాలను నిర్భీతిగా, దర్జాగా వెలగబెడుతున్నారు.

తిలా పాపం తలా పిడికెడు..

వాస్తవానికి భూగర్భ వనరులు-గనుల విభాగం, రవాణా శాఖ, రెవెన్యూ డిపార్టుమెంటు కడక్‌గా ఉండాల్సింది. ఇవి మూడూ తలుచుకుంటే..ఒక్క క్యూబిక్ మీటరు ఇసుకైనా దొంగచాటుగా పోదు. అంతేకాదు..కాలం, వేగంతో పోటీ పడి ట్రిప్పుల సంఖ్య పెంచుకునే మతిలేని యావకూ పగ్గాలు వేయొచ్చు. ఆ మూడూ ఎప్పుడో మూడొచ్చినప్పుడు అన్నట్టుగా 'రికార్డు'ల కోసమన్నట్టుగా కన్నెర్రజేస్తాయి. రోజూ వెయ్యి, పదిహేనొందల ట్రిప్పులు ఓవర్‌లోడ్లతో పోతుంటాయనడానికి ధ్వంసమైన రహదారులే సాక్ష్యం. కానీ, గత జూన్ వరకు 9 నెలల కాలంలో జస్ట్ 300 కేసులు ట్రాన్స్‌పోర్టు వింగ్‌లో నమోదయ్యాయి.

పోలీసు పెత్తనం..

ఆ మూడు మాతృ శాఖలకంటే ఎక్కువ ఆధిపత్యం పోలీసు డిపార్టుమెంటుదనే పేరుంది. ఇసుక లారీల కదలికలు మొదలు సమస్త సమాచారం పోలీసుల గుప్పిట ఉంటుంది. అందుకే వారి చల్లని చూపు కోసం ఇసుక మాఫియా నిరంతరం 'ఫ్రెండ్లీ'గా ఉంటుందనే చర్చ లేకపోలేదు. సిరిసిల్ల మానేరు నది నుంచి షురువయ్యే 'చైను-లింకు' రాజీవ్ రహదారి మీదుగా రాజధానిదాకా కొనసాగుతుంది. మరీ ముఖ్యంగా ఇసుక లారీల ఉనికి ఉండే పోలీసు స్టేషన్ల ఎస్సైలకు 'ప్రత్యేక' టార్గెట్లు సమీప ఉన్నతాధికారులు విధిస్తారనే ఆరోపణలు కొత్తేం కాదు. కుకునూరుపల్లి ఎస్సై రామకృష్ణారెడ్డి పిస్తోలుకు బలవ్వడం ఆ కోవలోనిదనే ముద్రపడింది.

తిరుగుబాటులు తరిగేలా..

ఇసుకంతా ప్రభుత్వ పనులకే అంటున్నారు. అదే నిజమైతే..పక్కా లెక్క ప్రకారం నిత్యం 200 నుంచి 500 ట్రిప్పులే పోవాలి. వాస్తవంలో మాత్రం వెయ్యికి పైగానే అనే వాదనలున్నాయి. అనర్థాలకు ఇక్కడే బీజం పడింది. ఓవర్ లోడూ ఆపై స్పీడూ. ఈ రెండూ దారెంట వెళుతున్న మనుషుల ప్రాణాలను హరిస్తున్నాయి. మానేరు వాగు చింతల్‌ఠాణా క్వారీ నుంచి రెండూళ్లను దాటేసి సిరిసిల్ల-సిద్దిపేట మెయిన్ రోడ్డుకు లారీలు ఎక్కుతాయి. అట్లా..సిద్దిపేట-హైదరాబాద్ రాజీవ్ రహదారి మీదకు వస్తాయి. ఒక సిరిసిల్ల-సిద్దిపేట మార్గంలోనే రెండు నెలలకు ఒకరు చొప్పున ఇసుక లారీలకు నైవేద్యమయ్యారు. తొవ్వపొన్న పోతున్న ఆ మృతులందరూ అణగారిన, రెక్కల కష్టంపై ఆధారపడిన అభాగ్యులే. గాయాలతో ప్రాణాపాయం తప్పిన వాళ్లు పదుల సంఖ్యలోనే ఉంటారు. ఎన్నిసార్లు మొత్తుకున్నా..తీరు మారని ఇసుక లారీలపై సిరిసిల్ల సెగ్మెంట్‌లోని కొన్ని గ్రామాల ప్రజలు తిరుగుబాటు చేశారు. మళ్లా అట్లాంటి ఎదురు తిరగడాలు ఉండకూడదనే ఉద్దేశంతోనే ఆ ఎనమండుగురికి నరకం చూపారనే అభిప్రాయాలు గట్టిగా వ్యక్తమవుతున్నాయి. పాలకులు, పోలీసులు ఆత్మపరిశీలన చేసు కోవాల్సిన తరుణమిదే.

సెప్టెంబర్ 9,10న రాష్ట్ర ప్రథమ మహాసభలు

- ఆల్ హమాలీ ఫెడరేషన్ (సీఐటీయూ)


నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

సెప్టెంబర్ 9,10వ తేదీల్లో ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రథమ మహాసభలు నిర్వహించనున్నట్టు ఆల్ హమాలీ ఫెడరేషన్ (సీఐటీయు) తెలిపింది. ఈ మహాసభకు వేలాదిగా తరలి రావాలని పిలుపునిచ్చింది. బుధవారం సీఐటీయు కార్యాలయంలో ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఐటీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం సాయిబాబు, రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో 5లక్షల మంది హమాలీలు ఉన్నారని, వారందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. హమాలీలందరికీ ప్రమాద బీమా, పీఎఫ్, ఇఎస్ఐ లాంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ బరువులు మోయడం వల్ల హమాలీల శరీరంలో సత్తువ తగ్గి అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. దుమ్ము, ధూళీలో పని చేస్తుండటం వల్ల శ్వాసకోశ వ్యాధుల భారీన పడి ప్రాణాలు కూడా కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హమాలీలకు కూడా 8గంటల పని విధానం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సెప్టెంబర్‌లో జరిగే హమాలీ ఫెడరేషన్ మహాసభ అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటుందని చెప్పారు.

టీఆర్ఎస్‌లో ఇమడలేకపోతున్న డీఎస్ !

- రాష్ట్రపతి కోవింద్ ఫొటో సెషన్‌కూ దూరం
- ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలతోనే ఎక్కువసేపు చర్చలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



అయిష్టంగానే గులాబీకండువా కప్పుకున్న డి.శ్రీనివాస్‌కు ఇప్పటికీ టిఆర్ఎస్‌పార్టీలో ఇమడలేకపోతున్నారు. ఆ పార్టీ నేతలతో పూర్తిగా కలవలేకపోతున్నారు. దూరందూరంగా ఉంటున్నారని తెలిసింది. ముఖ్యమంత్రి కేసీఆర్ పలకరించినప్పుడో, ఆయనతో ప్రత్యేకంగా పని ఉన్న సందర్భంలోనే డిఎస్ మాట్లాడుతున్నారని సమాచారం. మిగతా టిఆర్ఎస్ నేతలతో ఆయనకు ప్రత్యేకంగా సంబంధాలు లేకపోవడం కూడా కారణమై ఉండొచ్చని గులాబీ వర్గాలు అంటున్నాయి. సలహాదారుడిగా నియమితులైన సమయంలోనూ డి.శ్రీనివాస్ పెద్దగా స్పందించిన సందర్భాలు తక్కువ. ఎంపీగా నియమితులైన తర్వాత ఒకటి రెండుసార్లు మినహా ఆయన మీడియా ఎదుట మాట్లాడింది లేదు. డిఎస్ సూచనలు, సలహాలను కూడా టిఆర్ఎస్‌పార్టీ తీసుకోవడం లేదు. నిజామాబాద్‌లో కవిత ఉండడంతో ఆయన అవసరం అంతగా లేకుండా పోయింది. పెద్దరికానికి విలువ ఉండడం లేదని సన్నిహితుల వద్ద వాపోయినట్టు తెలిసింది. రాజ్యసభలో టిఆర్ఎస్ ఎంపీగా కొనసాగుతున్నా, ఖాళీ సమయాల్లో ఎక్కువసేపు కాంగ్రెస్‌పార్టీ పెద్దలతోనే మాట్లాడుతున్నారని తెలిసింది. రాష్ట్రపతిగా కోవింద్ ఎన్నికైన తర్వాత సీఎం కేసీఆర్ తన పార్టీ ఎంపీలతో కలిసి గ్రూపు ఫొటో దిగారు. దీనికి డిఎస్ హాజరుకాకపోవడం పలు అనుమానాలకు దారి తీసినట్లయింది. వాస్తవానికి కాంగ్రెస్‌పార్టీ నుండి టీఆర్ఎస్‌లో చేరిన తర్వాత కేశవరావు కూడా మీడియా ముందు ఎక్కువగా మాట్లాడిన సందర్భాలు లేవు. నేతలను కలిసిన దాఖలాలు లేవు. ఆయన దగ్గరికి వచ్చేవారూ లేరు. కాంగ్రెస్‌పార్టీలో ఉన్నప్పుడు కేశవరావు, డి.శ్రీనివాస్ ప్రతిరోజూ ఏదో ఒక అంశంపై స్పందిస్తూనే ఉండేవారు. పార్టీ నాయకత్వంపైనా, ప్రభుత్వంపైనా ప్రతిపక్షాలు విమర్శలు చేసినా ఖండించేవారు. వారికి మీడియా కూడా ప్రాధాన్యత ఇచ్చేది. ఇప్పుడు మాట్లాడేందుకు ఆ ఇద్దరు నేతలు నిరాకరిస్తున్నారు. మీడియా కూడా ప్రాధాన్యత పెద్దగా ప్రాధాన్యత కల్పించడం లేదు. ముఖ్యమంత్రి కేసీఆర్‌పైనా, టిఆర్ఎస్‌పార్టీపైనా ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నా మాట్లాడటం లేదు. మౌనంగానే ఉండిపోయారు. మియాపూర్ భూకుంభకోణం కేసు తర్వాత కేశవరావు అంటీముట్టనట్లుగానే ఉంటున్నారని తెలిసింది.

పెట్టుబడి గ్రంథం ప్రాధాన్యత




బి.వి. రాఘవులు

-4-

(సోమవారం సంచిక తరువాయి భాగం)

మార్క్స్ చెప్పేదేంటంటే ఏ సమాజానికి సంబంధించి..ఆ సమాజానికి ప్రత్యేకతలున్నాయి. రెండు చేతులు, రెండు కాళ్లూ, రెండు కండ్లు ఒక ముక్కు, ఒక నోరున్నోళ్లను రమ్మన్నాననుకోండి మీరందరూ వచ్చేస్తారు. మీలో ఎవరినీ నేను అర్థం చేసుకోలేను. మీలోని ఇతరులలో లేని ఓ లక్షణాన్ని నేను అర్థం చేసుకోగలిగితేనే నేను ఆ వ్యక్తిని గుర్తించగలుగుతాను. కాబట్టి తెగల వ్యవస్థ నుండి బానిస వ్యవస్థ, భూస్వామ్య వ్యవస్థ, పెట్టుబడిదారీ వ్యవస్థలోని అన్ని సామాజిక లక్షణాలను అధ్యయనం చేస్తే ఏ వ్యవస్థా మీకు అర్థం కాదు. వీటన్నింటిలో లేనివి, పెట్టుబడిదారీ విధానంలో ఉన్నవి అధ్యయనం చేస్తేనే ఆ పెట్టుబడిదారీ వ్యవస్థ గురించి మీకు అర్థమవుద్ది. అందుకని పెట్టుబడి దారీ విధానం గురించే ఈ అధ్యయనం, అందులోని ప్రత్యేకతలేమైనా ఉంటే ఆ ప్రత్యేకతల గురించే అధ్యయనం..ఆ ప్రత్యేకతలను గురించి తెల్సుకుంటేనే ఈ పెట్టుబడిదారీ విధానాన్ని మార్చడానికి ఏ ప్రత్యేక పద్ధతుల్లో ప్రయత్నం చేయాలో మనకు అర్థమవుతుంది. రెండో ముఖ్యమైన విషయం పెట్టుబడి గ్రంధానికి సంబంధించి మార్క్స్ కొన్ని ఊహలు చేస్తాడు. ఏ సైన్స్‌లోనైనా కొన్ని ఊహలు తప్పవు. దీన్ని సైంటిఫిక్ అసమ్షన్స్ అంటాము. అంటే కొన్ని శాస్త్రీయమైన అసమ్షన్స్ చేయాలి. అటువంటి అసమ్షన్స్ దీంట్లో చేస్తాడు. ఆ వివరాలన్నీ మీరు అధ్యయనం చేస్తే మీకు తెలుస్తుంది. నేను ఒక్క ఉదాహరణ చెబితే మీకు అర్థమవుతుంది. మార్క్స్ ఈ గ్రంథంలో అన్ని సరుకులూ ఎక్కువ ధరలకు, తక్కువ ధరలకు అమ్ముడు పోవూ..వాటి అసలైన సిసిలైన విలువలకే అమ్ముడుపోతాయి అని ఒక ఊహ చేశాడు. వాస్తవంగా నువు సమాజంలో చూస్తే పది రూపాయల వస్తువును 15 రూపాయలకు అమ్మేవాడు. గిరాకీ లేనపుడు అదే వస్తువును ఐదు రూపాయలకు అమ్మేవాడు..అంతెందుకు ఈ మామిడి కాయలు చూడండి డజను 120 రూపాయలు అమ్మారు..అదే డజన్ను 20 రూపాయలకూ అమ్మారు. ఈ రెండు నెలల్లోనే..మామిడికాయలవే. కాబట్టి ఎక్కువ తక్కువ ధరలుండవనీ వాటి అసలైన సిసలైన ధరలకే అమ్ముడు పోతాయని ఒక ఊహ చేశాడు. ఆ ఊహ ఆధారంగా ఈ పుస్తకం రాశాడు. దీన్ని మీరు చదువుతూ ఉంటే ఇంత తెలివి తక్కువగా చెబుతాడే. మార్క్స్‌కేమీ తెలిసినట్టే లేదు. ధర ఒక రోజు ఎక్కువ ఉంటుంది. ఒక రోజు తక్కువ ఉంటుంది. ఈయనేం ఆర్థిక శాస్త్ర వేత్త అని మనకు అనిపిస్తుంటది. ఎందుకంటే మిగతా వారంతా ఈ ఎక్కువ తక్కువ మీద ఆధారపడే సప్లయి అండ్ డిమాండ్ .. గిరాకీ ఎక్కువ ఉంటే ధర పెరిగిపోద్ది, గిరాకీ తక్కువ ఉంటే ధర పడిపోద్ది, గిరాకీ ఎక్కువ, తక్కువలను బట్టి ధర నిర్ణయమై పోతుంది అని చెప్తరు. మార్క్స్ ఏం చెప్పాడంటే సరఫరా ఎక్కువ ఉండదు. గిరాకీ ఎక్కువ ఉండదు. సరఫరా, గిరాకీ సమానంగా ఉంటాయి. కాబట్టి ధర మారదు అని ఒక ఊహతోటి ప్రారంభించాడు. ఈ ఊహ ఎందుకు చేశాడు అంటే..మీరు ఉన్న ధరకన్నా ఎక్కువకు అమ్ముకుంటే మీకు లాభం వస్తది. ఉన్న ధరకన్నా తక్కువకు అమ్ముకుంటే మీకు నష్టమస్తది. కాబట్టి మీకు ఎందుకు లాభమచ్చిందో..ఎందుకు నష్టమొచ్చిందో చెప్పడమనేది పెద్ద శాస్త్రమేమీ కాదు. ఏ చిన్న పిల్లవానికైనా అర్థమవుద్ది. మార్క్స్ చెప్పదల్చుకున్నదేంటంటే ఉన్న వస్తువుకి ఎంత ధర ఉందో ఆ ధరకే అమ్మినా పెట్టుబడిదారునికి లాభం వస్తుంది అని చెప్పి రుజువు చేయాలనుకున్నాడు. అసలైన సిసలైన ధరకే అమ్మినపుడూ వానికి లాభం వస్తుంటే ఇక ఎక్కువ ధర వేస్తే లాభం రావడం పెద్ద విచిత్రమేమీ కాదు కదా..అదనంగా లాభం వస్తది. దానికి తక్కువకు అమ్మితే నష్టం రావడం పెద్ద విచిత్రమేమీ కాదు. అందుకని ఈ ధరలు ఎక్కువా తక్కువలు ఉండవు. సమానంగా ఉంటయి అని ఊహచేసి ఐనప్పటికీ పెట్టుబడిదారుడు లాభం పొందుతున్నాడని రుజువు చేయడానికి ప్రయత్నం చేశాడు. కాబట్టి ఇదొక ఊహ. ఇటువంటి ఊహలు చాలా మీకు దీంట్లో కనబడుతయి. ఈ ఊహలకి, బూర్జువా తత్వశాస్త్ర వేత్తల ఊహలకీ చాలా వ్యత్యాసముంది. వాళ్లంతా అశాస్త్రీయమైన ఊహల మీద ఆధారపడి అర్థశాస్త్రాన్ని రాస్తారు. శాస్త్రీమైన ఊహలనుపయోగించి మార్క్స్ చేస్తారు. అశాస్త్రీయమైన ఊహలకు ఒక ఉదాహరణ చెబుతాను. మానవుడు పుట్టుకతో మంచివాడు అని చెబుతాడు. పుట్టుకతో మంచివాడో కాదో నీకో..నాకో కూడా తెలియదు. పుట్టుకతోటే మంచివాడో చెడ్డవాడో తెలియదు. ఐనా పుట్టుకతో మంచివాడు అని రాస్తాడు. ఇంకో ఆర్థిక శాస్త్రవేత్త ఏం రాస్తాడంటే అసలు మానవుడు పుట్టుకతోనే స్వార్థపరుడు. అంటే మానవుని యొక్క నైజమే స్వార్థపరుడు. సొంతానికి చూసుకుంటడు. అది ఊహ. నువు అంగీకరించొచ్చు, నేను తిరస్కరించొచ్చు. పుట్టుకతోటే స్వార్థపరుడు అని అన్నతర్వాత పుట్టిన్నుండి సచ్చిందాక నువు ఏపని చేసినా చలామణి అవుతుంది. అంటే దోచుకోవడం లాభం చేసుకోవడం, ఎగ్గొట్టడం ఇవన్నీ స్వార్థంతో చేసేవే. ఒక సారి ఊహ చేసేశాక, ఆ ఊహమీదే ఆధారపడి ఆర్థిక శాస్త్రం నిర్మాణం చేస్తే ఇంకేముంటది. ఇటువంటి ఊహలు మిగతా బూర్జువా తత్వవేత్తలు చేస్తరు. అటువంటి ఊహల జోలికి మార్క్స్ పోలేదు.

ఇక మరో ముఖ్యమైన విషయం మార్క్స్ పెట్టుబడి గ్రంథాన్ని అధ్యయనం చేయాలంటే ఏ ఆర్థిక శాస్త్రాన్ని ఐనా అర్థం చేసుకోవాలంటే కొన్ని పద్ధతులు అనుసరించాలి. మార్క్స్ ఆ పద్ధతుల్ని అనుసరించాడు. ఆ పద్దతులను మనం గతితార్కిక పద్ధతులు అని అంటాము. కానీ మీరు గతితార్కిక భౌతిక



వాదాన్ని అర్థం చేసుకోవాలంటే పెట్టుబడి చదవాలి. పెట్టుబడి అర్థం కావాలంటే మీకు గతితార్కిక భౌతిక వాదం తెలియాలి. ఇదేంటయ్యా అదిలేకుంటే ఇది ఇది లేకుంటే అది.. అంటే గతితార్కిక భౌతికవాదం అంటేనే అది. రెండూ పరస్పరం కలిసే ఉంటాయి. అందుకని మీరు పెట్టుబడి గ్రంథం చదువుతుంటే మీకు గతితార్కిక పద్ధతులు అర్థమవుతాయి. గతితార్కిక పద్ధతులను అర్థంచేసుకున్న కొద్దీ మీకు పెట్టుబడిదారీ గ్రంథం బాగా అర్థమవుతుంది. ఏమిటీ గతితార్కిక పద్ధతులు. అంటే రెండు సింపుల్ విషయాలు చెబితే మీరు ఇంకా వాటిని సులభంగా అర్థంచేసుకోవచ్చు. కొన్ని విషయాలు విడివిడిగా వ్యక్తిగతంగా చూస్తే మనకు అర్థం కావు. అలా పరిశీలన చేస్తే అది అశాస్త్రీయమైన పద్ధతి అవుతుంది. ఒక వ్యక్తిగా నేను గుండు సూదిని తయారు చేశానంటే..నా శ్రమ వల్ల గుండుసూది తయారైందంటే అది నిజమా .? కాదా.? గతితార్కిక పద్ధతుల్లో చూస్తే అది సగం నిజం. సగం కాదు. ఎందుకంటే గుండుసూదిని తయారు చేసింది సామాజిక శ్రమ తప్ప వ్యక్తిగత శ్రమ కాదు. నేను నా శ్రమ చివరిది కావచ్చు. కానీ అంతకుముందు అనేక శ్రమలు జోడిస్తేనే ఆ గుండుసూది వచ్చింది. అందుకనే కొన్ని విషయాలను మీరు అర్థంచేసుకోవాలంటే సామూహికంగా పరిశీలన చేస్తేనే అర్థం అవుతాయి. వ్యక్తిగతంగా పరిశీలన చేస్తే అర్థం కావు. అటువంటి వాటిల్లో ఉత్పత్తి ఒకటి. ఓ చొక్కా తీసుకోండి, ఓ పెన్ను తీసుకోండి మీరు ఉత్పత్తి చేసినవిగానీ, కొన్నవిగానీ తీసుకుంటే .. ప్రాపంచిక శ్రమ దాన్ని తయారు చేసింది అని అనాలి తప్ప. వ్యక్తిగత శ్రమ దాన్ని తయారు చేసిందని అనడం సాధ్యం కాదు. కలెక్టివ్ లేబర్‌ని మనం పరిశీలన చేస్తే..అంటే సమూహాల్ని పరిశీలన చేస్తే అర్థమవుతాయి తప్ప వ్యక్తులను పరిశీలన చేస్తే కొన్ని విషయాలను మీరు అర్థం చేసుకోలేరు. పెట్టుబడి గ్రంథంలో చెప్పిన ఏ అంశాన్నయినా పరిశీలన చేయండి. అది సమూహంగా పరిశీలన చేయాల్సి ఉంటుంది. ఆ సమూహాన్ని పరిశీలనం చేయడం..వాటిల్లోని కొన్ని పద్ధతులను తీసుకురావడాన్నే మార్క్స్ అబ్‌స్ట్రాక్షన్ అని అన్నాడు. అంటే సారాన్ని తీయడం. ఉదహారణకు సారాన్ని తీయడం అంటే..జంతువు అన్నామనుకోండి. జంతువు అనేది ఒక భౌతిక అంశం కాదు. ఒక భావం. భావమంటే నిజం కాదా.? నిజమైన భావమది. ఇప్పుడు మనమందరమూ జంతువులమే. మనతో పాటు ఇంకా చాలా కలపొచ్చు జంతువుల కిందికి. కానీ జంతువుని భౌతికంగా మీరు ఎక్కడో ఒక చోట పట్టుకోలేరు. కానీ మనలోని అన్ని సామాన్యమైన లక్షణాలను తీసుకొచ్చి దానికో జంతువు అని పేరు పెట్టారు. చెట్టు అన్నారనుకోండి చెట్టుని పట్టుకు రాలేరు. మీరు మామిడి చెట్టు , ఆ చెట్టు, ఈ చెట్టు పట్టుకురాగలరు తప్ప ఒక చెట్టు అంటే పట్టుకురాలేరు. అందుకని చెట్టు అనేది ఒక భావం..కానీ అది నిజమైన భావం.

(తరువాయి భాగం గురువారం సంచికలో..)



డా॥సోమేశ్వర్ బోనకుర్తి

తెలంగాణ పౌరుషాన్ని ప్రపంచానికి చాటి, బ్రిటీష్ పాలనపై తిరగబడ్డ మొనగాడు తుర్రెబాజ్‌ఖాన్. హైదరాబాద్ అగ్ని కెరటం. బ్రిటీషోడి గుండెల్లో జంగ్ సైరన్ జమాయించిన అగ్గిపిడుగులు తురుంఖాన్ - తుర్రెబాజ్‌ఖాన్. గాయపడిన గుండెలకు ధైర్యంగా నిలిచిన యోధుడు తుర్రెబాజ్‌ఖాన్. మరణం తప్పదని తెలిసిన కత్తి పట్టేవాడే వీరుడు. శత్రువు బలవంతుడని తెలిసినా పిడికిలి బిగించిన వాడే యోధుడు. బానిసగా బ్రతికేకంటే వీరునిగా చనిపోయి మరణాన్ని ముద్దాడే వాడే అమరుడు. ఆ వీరుడు, వీరులకు మొగసాలయిన తెలంగాణలో, ధీరులకు కాణాచీగా నిలిచిన హైదరాబాద్ గడ్డపై ఎగిసిపడ్డ ధిక్కార కెరటం తుర్రేబాజ్‌ఖాన్. 1857 సిపాయిల తిరుగుబాటులో హైదరాబాద్ గడ్డపై సమర శంఖం పూరించిన వీరుడు. ఔరంగాబాద్ బ్రిటీష్ కంటోన్‌మెంట్‌లో జమిందారుగా పని చేసిన రుస్తుంఖాన్ కొడుకే తుర్రెబాజ్‌ఖాన్. పుట్టింది, పెరిగింది, హైదరాబాద్‌లోని బేగంబజార్‌లోనే, 1857 సిపాయిల తిరుగుబాటు ప్రకంపనలు హైదరాబాద్‌లో కూడా తిరుగుబాటుకు తోడయ్యాయి. మీరట్, ఢిల్లీ, లక్నో, గ్వాలియర్, ఝాన్సీతో పాటు, భారత ప్రథమ స్వాతంత్ర్య సమరంగా చెప్పుకునే సిపాయిల తిరుగుబాటు హైదరాబాద్ గడ్డపై కూడా జరిగింది. 1857 మే 10న మీరట్‌లో ప్రారంభమైన సైనికులు తిరుగుబాటు దావానలంలా స్వల్పకాలంలో దేశమంతా వ్యాపించింది. పంజాబ్‌లో రంజిత్‌సింగ్, ఝాన్సీలో లక్ష్మిబాయి రణరంగంలోకి దూకారు. తాంతియాతోపే, నానాసాహెబ్ విజృంభించారు. అడవి బిడ్డలైన గోండులు, బిల్లులు కూడా తెల్లవారిపై తిరగబడ్డారు. అలాటి సమయంలో హైదరాబాద్ నిజాం, బ్రిటీష్ వారికి సహకరించడం, సామాన్య ప్రజానీకానికే కాదు నిజాం రాజును అభిమానించే ముస్లింలకు కూడా నచ్చలేదు. అనుబంధ రాజ్య ఒప్పందం కింద బ్రిటీష్ అవసరాల కోసం ఏర్పాటు చేసిన కంటింజెంట్‌దళం హైదరాబాద్ నిజాంకు గుదిబండగా మారింది. ఆ దళం ఖర్చుల కింద బోలెడు అప్పయింది. దీనికింద బేరార్, ఉస్మానాబాద్, రాయచూరులను బ్రిటీష్ వారికి అప్పగిస్తూ 1953లో నిజాం రాజు ఒప్పందం చేసుకున్నాడు. టిప్పు సుల్తాన్‌ను చంపేసిన బ్రిటీష్ వారితో సంధి చేసుకోవడం హైదరాబాదీలు జీర్ణించుకోలేక పోయారు. సరేయిన సమయం కోసం ఎదురు చేశారు. కోఠి, బొల్లారం, సికింద్రాబాద్‌లను నిజాం బ్రిటీషర్లకు ఇచ్చారు. కోఠి

హైదరాబాద్ అగ్గిరవ్వ - తుర్రెబాజ్‌ఖాన్

ఉమెన్స్ కాలేజీలో అనాడు బ్రిటీష్ రెసిడెన్సీ ఉండేది. మరోవైపు రోహిల్లా, సిక్కు, అరబ్బు, ఆఫ్రికన్ వలసలు పెరిగాయి. ఈ విధంగా హైదరాబాద్ చేరుకుంటున్న వారిలో ఎక్కువ మందికి బ్రిటీష్ వ్యతిరేకత జీర్ణించుకుపోయింది. నిజాం నాసిరుద్దౌలా 1857 మే 16న మరణించాడు. అతని స్థానంలో అఫ్జలుద్దౌలా నిజాం అయ్యాడు. నాసిరుద్జౌలా మరణానికి వారం రోజుల ముందే మీరట్‌లో 1957లో మే 10న సైనికులు తిరుగుబాటు చేశారు. దాని ప్రభావంతో ఔరంగాబాద్‌లో అల్లర్లు జరిగాయి. వాటిని అణచి వేయడానికి హైదరాబాద్ నుండి ఓ పటాలం వెళ్ళింది. అందులో ఉన్న ముస్లిం, హిందూ సైనికులతో బ్రిటీష్ అధికారులకు గొడవ జరిగింది. దీంతో అందరిని ఢిల్లీ పంపిస్తారన్న అనుమానంతో సైనికులు తిరుగుబాటు చేశారు. ఈ ధిక్కరాన్ని బ్రిటీష్ అధికారులు క్రూరంగా అణచి వేశారు. అయితే తిరుగుబాటుకు నాయకత్వం వహించిన జమీందారు చీడాఖాన్ శిబిరాన్ని వదిలిపెట్టిన కొందరు సైనికులతో కలిసి హైదరాబాద్‌కు బయలుదేరాడు. నిజాం రాజు సహాయం కోరారు. కానీ నిజాం వాళ్ళకు సహాయం చేయకుండా బ్రిటీష్ రెసిడెన్సీలో బంధించి చిత్ర హింసలు పెట్టారు. ఈ ఘటన హైదరాబాదు నగరంలో పెద్ద ఎత్తున అసమ్మతికి దారితీసింది. నిజాం, బ్రిటీషర్లకు వ్యతిరేకంగా మౌల్వీలు జిహాద్ చెయ్యాలని పిలుపునిచ్చారు. వారిలో అల్లావుద్దీన్ ముఖ్యమైన వ్యక్తి. 07.06.1857న మౌల్వీ అల్లావుద్దీన్ పిలుపునందుకున్న సాధారణ ప్రజలు బ్రిటీష్, నిజాం సైన్యంలోని కొంత మంది తిరుగుబాటు దారులు బ్రిటీష్ రెసిడెన్సీపై దాడికి సిద్ధమైనారు. బేగం బజార్ చౌరస్తాలో 500 మంది రోమిల్లాలతో ఉన్న తుర్రెబాజ్‌ఖాన్ నేతృత్వంలో రెసిడెన్సీపైకి దాడికి బయలుదేరారు. వారు రెసిడెన్సీకి ప్రక్కనే ఉన్న అబ్బన్ సాహెబ్, జైగోపాల్ దాస్ అనే ఇద్దరు షావుకార్ల బంగళాలను ఆక్రమించుకుని వాటిపై అంతస్తుల నుంచి కాల్పులు ప్రారంభించారు. అధునిక ఆయుధాలు మర ఫిరంగులు, ఉన్న బ్రిటీష్ సైన్యం ముందు తుర్రెబాజ్‌ఖాన్ సైన్యం నిలువ లేక పోయింది. తుర్రెబాజ్‌ఖాన్ తప్పించుకున్నాడు. మౌల్వీ కనిపింపించకుండా పోయాడు. రెసిడెన్సిపై తుర్రెబాజ్‌ఖాన్ చేసిన దాడి విఫలమైనా, తెల్లోడికి మాత్రం చుక్కలు కన్పించాయి. మౌల్వీ మరియు తుర్రెబాజ్‌ఖాన్‌లను పట్టించిన వారికి రూ. 5వేలు బహుమతి ప్రకటించారు. మారువేషంలో బెంగుళూరుకు పోతున్న తుర్రెబాజ్‌ఖాన్ మహబూబ్‌నగర్ జిల్లా మొగిలిగిద్దలో పట్టుబడ్డాడు. ద్వీపాంతర శిక్ష విధించారు. అది అమలయ్యేలోపే ప్రవాస శిక్షకు తరలిస్తుండగా తప్పించుకున్నాడు. అతనికి కాపలాగా ఉన్న ఇద్దరు గార్డులు కూడా అతనితో పాటే పారిపోయారు. అప్పటికే సిపాయిల తిరుగుబాటును బ్రిటీష్ ప్రభుత్వం అణచివేసింది. అయినా తుర్రెబాజ్‌ఖాన్ వెనకంజ వేయలేదు. బ్రిటీష్ వాడికి మళ్లీ దిమ్మతిరిగే జవాబు ఇవ్వడానికి ప్లాన్ వేశాడు. 24,1,1859 అజ్ఞాతంలో ఉన్న తుర్రెబాజ్‌ఖాన్ అచూకి బ్రిటీషర్లకు తెలిసింది. కుర్బాన్ అలీ అనే నమ్మక ద్రోహి ఇచ్చిన సమాచారంతో బ్రిటీషర్లు దాడి చేశారు. కండ్ల ముందు శత్రువులు భారీ సంఖ్యలో ఉన్నారు. అయినా తుర్రెబాజ్‌ఖాన్ బెదర లేదు. కానీ ఎక్కువ సేపు నిలువలేక పోయాడు. గాయాలతో ఉన్నప్పటికీ వీరునిలా కత్తి దూసి వారిపైకి వెళ్లాడు. కాల్పుల్లో తుర్రెబాజ్‌ఖాన్ ప్రాణాలు కోల్పోయాడు.శవాన్ని తెచ్చి కోఠిలో స్థంబానికి నగ్నంగా వేలాడదీశారు. తుర్రెబాజ్‌ఖాన్ చూపిన ధైర్యం, తెగువ, అనేక హైదరాబాద్ తుర్రెబాజ్‌ఖాన్‌లను తయారు చేసింది. తుర్రెబాజ్‌ఖాన్ చేసిన పోరాటానికి గుర్తింపుగా ప్రభుత్వం 1957లో కోఠిలో స్మారక స్థూపాన్ని నిర్మించింది. కోఠి నుండి ఆబిడ్స్‌కు పోయే రోడ్డుకు హైదరాబాద్ తుర్రెబాజ్‌ఖాన్ రోడ్డుగా పేరు పెట్టి చేతులు దులుపుకుంది. అతని చరిత్రను పాఠ్యాంశంగా విద్యార్థులకు చెప్పలేదు. అందుకే సిపాయిల తిరుగుబాటు గురించి చెప్పే ప్రాంతాల్లో హైదరాబాద్ ఉండదు. తెలంగాణ వచ్చి మూడు సం॥రాలు దాటినా ఇంకా మన తురుంఖాన్, మా తెలంగాణ ప్రజలకు తెలియకుండా ఉన్నాడు. ఇకనైనా ఆ వీరుడి స్మరణను ప్రభుత్వం బాధ్యతగా చేపట్టాలి. అందుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలి.

మా బతుకులు నాశనం చేసింది ఎవరు?



సార్ల శ్రీనివాస్

2010లో డిగ్రీ అయిపోయింది డిగ్రీ అయ్యాక ప్రయివేట్ ఉద్యోగం చేద్దామనే ఆలోచన ఉండె. అప్పటికే అప్పుల ఊబిలో కూరుకుపోయిన కుటుంబాన్ని గట్టెక్కించాలంటే అదొక్కటే మార్గం అనిపించింది

డిగ్రీ అయిపోయాక ఎంబీఏలో జాయిన్ అయి చిన్నా చితక పనులు చేసాను ఎంబీఏ అయిపోయాక హైదరాబాద్ పోయి మంచి ప్రయివేట్ ఉద్యోగం చూసుకుందామని ఆలోచనలో ఉన్నాను

2011లో కేసీఆర్‌తో పాటు తెలంగాణ ఉద్యోగం సంఘాలు ఇతర మేధావులు తెలంగాణ వస్తే లక్షల ఉద్యోగాలని అనేక బహిరంగ సభల్లో వందల సార్లు స్పీచ్ లు ఇచ్చారు

వాళ్ల మాటలు నిజమే అనిపించాయి. తెలంగాణా వస్తే ఆంద్రోళ్లు ఉండరు. మన ఉద్యోగాలు మనకే వస్తాయి అని రాష్ట్ర రాజకీయ నాయకులు చెప్పినట్టే ప్రయివేట్ ఉద్యోగం వెతుక్కోవడం మానేసిన.

నాకు అందుబాటులో ఉన్న సోషల్ మీడియా ద్వారా తెలంగాణ ఉద్యమాన్ని ప్రచారం చేస్తు స్థానికంగా ఎన్నో బందులూ రాస్తారోఖోలు చేస్తూ ఉద్యమంలో పాలుపంచుకున్నాను.

ఒకవైపు ఉద్యమం చేస్తూనే కాంపిటేటివ్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యాను. 2013 జూన్‌లో గ్రూప్2 గ్రూప్1 డీఎస్సీ నోటిఫికేషన్ అని అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ప్రకటిస్తే అప్పటి తెలంగాణ నాయకులు తెలంగాణ వస్తే మా పిల్లలకు ఇంతకన్న ఎక్కువ ఉద్యోగాలస్తాయని వచ్చే నోటిఫికేషన్లను అడ్డుకుని మా నోట్లో మట్టి కొట్టారు

మేము కూడా అప్పటి మా నాయకుల మాటలు నమ్మి అప్పుడు ఇచ్చే నోటిఫికేషన్లను వ్యతిరేకించాము

2013 సెప్టెంబర్ లో తెలంగాణ ప్రకటన వచ్చాక మరింత ఉత్సాహంగా చదువుతూ ఉద్యమాన్ని కొనసాగించాము. 2014 జూన్ 2 న తెలంగాణ ఏర్పాటు అయింది. ఇక నోటిఫికేషన్ లు వస్తాయి అని చదువును అలాగే కొనసాగించాను. అమ్మా నాన్నకు ముసలితనం మీద పడుతున్న వాళ్లను కష్టపెట్టడం ఇష్టం లేకున్నా వాళ్లు కూలి పనులకు పోయి తెచ్చిన పైసలలో కొన్ని తీసుకుని, అవి చాలకపోతే వాని కాళ్లు వీని కాళ్లు మొక్కి అప్పులు తెచ్చుకుని రూం కిరాయిలూ కోచింగ్ ఫీజులూ కట్టుకుంటూ చదుకున్నాం. అమ్మా నాన్నను డబ్బులు అడిగేటప్పుడు నీకు ఇస్తే ఇంట్లో తమ్ముండ్లకు అన్నం కూడా పెట్టలేమురా అని వాళ్లు నాకు డబ్బులిస్తూ దీనంగా చూసిన చూపులు గుర్తొస్తే సిగ్గుతో చావాలనిపిస్తున్నది.

ఇప్పటి నాయకులు చేసిన మోసానికి నా రక్తం మరిగిపోతున్నా ఏం చేయలేని నిస్సహాయ స్థితి

2014 ఆగష్ట్ నుండి ప్రభుత్వం త్వరలో గ్రూప్స్ త్వరలో డిఎస్సి అని సిలబస్ మారుతది దానికి అనుగూణంగా చదవంటె అప్పటికె 3 ఏండ్ల ప్రిపరేషన్ గంగల కలిసింది. మళ్లీ అప్పుడు తెచ్చి కొత్త సిలబస్‌కు అనుగుణంగా బుక్స్ తెచ్చుకుని ప్రిపరేషన్ కొనసాగిస్తే మధ్యలో మీరు ఇట్ల చదివితే చాలదనీ సివిల్స్ రేంజ్ లో చదవాలి. పేపర్ అట్లనే ఉంటదనీ మీడియాలో ప్రకటనలు గుప్పించారు

వాళ్ల మాటలు నమ్మి సివిల్స్ తరహాలో స్టేట్మెంట్ అనలిటికల్ వైస్ గా ప్రిపేర్ అవుతూ వచ్చాం

నోటిఫికేషన్ లు మాత్రం రాలె. 2015 దసరా నాటికి ఇక అప్పులు ఇచ్చెటోళ్లు లేరు పైసలు లేవు. నోటిఫికేషన్ రాదనీ ఏదైనా ప్రయివేట్ ఉద్యోగం చేసుకుందామనీ జాబ్ వెతుక్కునే లోపే పేపర్లలో త్వరలో గ్రూప్2 అటవీ శాఖ ఉద్యోగాలు త్వరలో డీఎస్సీ అని ప్రభుత్వం ప్రకటనలు ఇవ్వడం వల్ల ప్రయివేట్ ఉద్యోగాలు పక్కన పెట్టి ఆకలి కాకుండా ఉండడానికి రోజూ వాన్నీ విన్నీ బ్రతిమాలి రోజూ 4, నుండి 5 చాయలు తాగుకుంటూ ఆకలి చంపుకుంటు చదివాము.

2015 డిసెంబర్లో నోటిఫికేషన్ వచ్చి పరీక్ష రద్దు అయి మళ్లీ 2016 నవంబర్లో పరీక్ష జరిగింది

ఏండ్ల తరబడి చదివినోడి నోట్లో మట్టి కొట్టి పేపర్ ని బేసిక్ లెవెల్ లో అడిగి ఆరేండ్లు చదివినోడిని ఆరు నెలలు చదివినోడిని ఒకే దగ్గరకు తెచ్చాడు.

దాన్ని మేము తప్పు పట్టలే. కానీ బేసిక్ లెవల్లో ఇచ్చిన ప్రశ్నలను కూడ సరిగ్గా ఇవ్వడం చేతకాక 35 ప్రశ్నలు తొలగించడం లేదా రెండు సమాధానాలు ఇవ్వడం వల్ల నష్టపోయామని బాధను వ్యక్త పరిస్తే కొంత మంది దుర్మార్గంగా చదువులను అవహేళన చేస్తూ ప్రభుత్వం తప్పిదాన్ని కప్పి పుచ్చే ప్రయత్నం చేసారు.

సమస్య కోర్టు వరకు కోర్ట్ పరీక్షా విధానంలో తప్పు ఉందనీ రిక్రూట్ మెంట్ ఆపేసాక కూడా కొంత మంది పిచ్చి మాటలు మాట్లాడుతున్నారు. ఒక పేపర్ నిరుద్యోగులదే తప్పు అని పిచ్చి రాతలు రాస్తుంది. మాకు ఉద్యోగాల మీద ఆశలు కలిపించి మా జీవితాలు నాశనం చేసింది ఎవరు?

srinivas.sarla@gmail.com

మై బిగ్ బడ్డీ సి.నారాయణ రెడ్డి



సయ్యద్ రఫీ

డా. సి. నారాయణ రెడ్డి తన జీవితంలో చిట్టచివరిగా రచించిన పాట "ఇంకెన్నాళ్లు" సినిమాలో 'ఏమి వెలుతురూ ఇది ఏమి వెలుతురూ.. పొద్దు పొడవక ముందే పూత వెలుతురూ, కొత్త పెళ్లి పడచు తలఎత్తగానే.. పల్లెనిండా పరుచుకుంది పసిడి వెలుతురూ ! జిమ్మరే జిమ్మరేజిమ్మా .. ముద్దుగుమ్మారే గుమ్మరే గుమ్మా !! ... ఇది సినారె చివరి పాటగా మిగిలి పోవడం బాధాకరం. అది తెలంగాణాలో ఒక వ్యవసాయ కుటుంబంలో జరిగే పెళ్లి (లగ్గం) ఘట్టాలు...

ఆయనను తొలిసారి కలిసింది నా రెండో సినిమా "అవును నిజమే" ఆడియో ఫంక్షన్లోనే, అతనే చీఫ్ గెస్ట్, ఆ సినిమా పాటలను శ్రద్ధగా విని ఒక పత్రం రాసుకొని వచ్చి వినిపించి ప్రోత్సహించారు అయన. మధ్యలో సారస్వత పరిష్యత్లో ఇంకెన్నాళ్లు డీవీడీ ని కూడా ఆవిష్కరించారు. చివరి సారి కలిసింది మిరాకిల్స్ వరల్డ్ రికార్డ్స్ అవార్డు వచ్చినపుడు తానే స్వయంగా నాకు ఫోన్ చేసి తన ఇంటికి ఆహ్వానించి తన లెటర్ హెడ్డుపై తన హస్తాక్షరాలతో నన్ను బహుముఖ ప్రజ్ఞాశాలిగా కితాబు ఇస్తూ అభినందన పత్రం రాసిచ్చారు. ఎంతో కల్మషంతో నిండిన ఈ వ్యవస్థలో ఇలాటి గొప్ప మనస్సుగల లెజెండరీ పెర్సొనాలిటీ, విశిష్ట కవితో నేను పనిచేయడం, ప్రశంశించబడడం నాలాంటివాడికి ఒక వరమే ! ఆయన ఇక భౌతికంగా జరిగి పోవడం ముమ్మాటికీ బాధ కారమే. ఇచ్చిన ప్రోత్సాహం, ప్రశంశాపత్రం నాకో పెద్ద బహుమానంగా చిరకాలం ఉండిపోతాయి. ఇదంతా మా ఇద్దరి మధ్య ఎన్నడూ చెదరని అనుబంధ ముద్ర.

"తెలుగు జాతి మనది నిండుగా వెలుగు జాతి మనది.." అంటూ సమైక్య వాదాన్ని బలపరిచిన సినారే చివరి దశలో "జై తెలంగాణ సై తెలంగాణ!" అని కూడా అన్నాడు. అమ్మోరు సినిమాలో పాతరేయడానికి సుమారు లక్ష రూపాయలు పారితోషకంగా తీసుకుంటే ఇంకెన్నాళ్లు సినిమాలో పాటకు పదకొండు వేల నూటపదహారు రూపాయలే తీసుకున్నారు. వృత్తి ధర్మాన్ని తప్పక పాటించేవారు. చూడడానికి గంభీరంగా కనపడ్డా మనసు సున్నితమే. రాజకీయాలకు దూరంగా ఉండేవారు. అయన రాతల్లో విమర్శలు ప్రశ్నలు తక్కువే కానీ జీవిత సత్యాలు, ప్రకృతి ప్రస్తావనలు ఎక్కువ. పదాల అల్లికలు, వాటిలోంచి ఉట్టిపడే భావాలు వర్ణనాతీతం. తెలంగాణ సంస్కృతిని మాండలికాలను అవసరమున్నచోట తప్పనిసరిగా వాడేవారు. క్రమశిక్షణకు, నిబద్ధతకు ప్రతిరూపం సి నారే.

సినారే గొప్ప హాస్య ప్రియుడు కూడా ! ముఖ్యమంత్రి కే సీఆర్ గురించి సినారే చర్చించిన కొన్ని విషయాలు గుర్తుకొచ్చాయి. అప్పుడు ఇంకెన్నాళ్లు సినిమా తయారవుతుంది, తెలంగాణ ఉద్యమం జోరు మీదున్నది, "ఏంటయ్యా రఫీ, కేసీఆర్ స్టేట్మెంట్ చూసావా "ఆంధ్ర వాళ్ళ బిర్యానీ పేడలాగుంటది ".. ఆలా అనవచ్చునా ? అని నన్నడిగారు. " అలాగంటేనేకదా ఇప్పుడుమనం చర్చిస్తున్నాము, చర్చ కోసమే అని ఉంటారు" అని నేను జవాబిచ్చాను. కళ్ళు పూర్తిగా తెరిచి అదోలా .. నిజామా అన్నట్టు నావంక చూసారు. అయినా కే సీఆర్ ఆంధ్ర బిర్యానీ తిన్నారో లేదో , ఐన పేడలాగుంటది అన్నాడంటే పేడ రుచి చూసిఅయితే ఉండదు కదా? కాబట్టి ఇవన్నీ ఒక సెన్సేషన్ క్రియేట్ చేయడానికేనేమో అనగానే, ఆయన కూర్చున్న కట్టే ఆరాం కుర్చీ కూడా కదిలేలా నవ్వసాగారు.

ఆయనలో ఆయన రచనల్లో నవరసాలుండేవి. అందుకే పరిపూర్ణమైన సాహిత్యదిగ్గజంలా మిగిలిపోయాడు సినారే ! పదమూడేండ్ల కిందట సీనియర్ జర్నలిస్ట్ వాసిరాజు ప్రకాశం 'అవును నిజమే' సినిమా కేసెట్ ఒకటి నారాయణ రెడ్డి కిచ్చి పాటలు వినమన్నాడు. మర్నాడు నారాయణ రెడ్డి వాసిరాజుకు ఫోన్ చేసి ఆడియో ఫంక్షన్లో పా టలపై తన అభిప్రాయాన్ని వెళ్లబుచ్చుతానని చెప్పి మరి ఒక శాలువాతో హాజరయ్యారు. తన జేబులోంచి ఒక కాగితం తీసి ఒక్కొక్క పాటగురించి పదాల అల్లిక గురించి చెప్పడం మొదలు పెట్టారు. నాకు చెమటలు పట్టాయి ఎందుకంటె ఒక పాట యూత్ఫుల్ రొమాంటిక్కుగా ఉంటుంది, "మల్లి కాలెజీ షురూ షురూ , కొత్త కొత్త మొగ్గలు గురు గురు, అబ్బబ్బ ఎన్నెన్ని మొగ్గలో చూడు చూడు, అందులో ఏమొగ్గ నాదో గురు గురు " ఏమైనా ఘాటుగా విమర్శిస్తారేమో నేనే భయం. కానీ సీన్ రివర్స్ అయ్యింది. ఆ పాట ఒక నవ యువ రచయిత రాయవలసిన పాటనే బాగా కుదిరిందన్నారు. అన్ని పాటల్లో ఆయనకు నచ్చిన లిరిక్ " ప్రేమంటేనే మాయ, అందని ఛాయా!" ఇది ఆయనకు ఎందుకు తట్టలేదు అని ఆలోచింప చేసిందని తానే పాత్రికేయుల ముందు చెప్పారు. అప్పటి నుండి మొదలయ్యింది సి నారే గారితో నా సోభతి, ఆయన అనుభవం కంటే కూడా ఎంతో చిన్నది నా వయసు కానీ నాతో మాత్రం చాల చాల చనువుగా ఉండే వారు . ఆ జమానాలో మహమ్మద్ రఫీతో పనిచేసాను ఇప్పుడు సయ్యద్ రఫీతో అనేవారు. ఆ కాలం నుండి ఈ కాలం వరకు ఒక లెజెండ్‌గా ఉండిపోయారు.

ఆయన ఇంటికి పిలిపించి తన లెటర్ హెడ్ పై తన దస్తూరితో రాసి చ్చిన అభినందన పత్రం, పాత్రికేయుల ముందు నన్ను ప్రోత్సహించే ఆ వీడియోలు, నా సినిమాకోసం రచించిన ఏమి వెలుతురూ పాట నాలో మనోధైర్యాన్ని నింపుకొని ముందుకు సాగడానికి తప్పకుండ పనికొచ్చే అవుషదాలుగా, టానిక్కులుగా భావిస్తా ను. అప్పట్లో నన్ను ఒకసారి పిలిపించుకొని ఒక హితబోధకూడా చేశారు.

" నీవు మౌలిక ప్రతిభావంతుడివి, ఒక మంచి నిర్మాత దొరకాలి నీకు. ఆర్థిక ఒత్తిడి నీకుండకూడదు, ద ష్టిమొత్తం స జనపై పెట్టు , నేను నిన్ను ఎక్కడో చూస్తానని నమ్ము తున్నాను, కష్టపడు" ఒక దిగ్గజం యొక్క ఆశీర్వాదం నాకు దక్కడం ఒక వరం లాంటిదే. మా ఇద్దరి సోభతి సృజనాత్మతకు సంబంధించి నదే, వ్యక్తిగత జీవితాలపై ఏనాడు చర్చ రాలేదు, ఆయనకెందరు పిల్లలో నాకెందరు పిల్లలో అనే వివరాలు తప్ప. ఏ తార తమ్యం లేకుండా టాలెంట్ ఉన్న ప్రతి కవిని కళాకారుడిని ప్రోత్సహించే గుణం సినారే కుందని చెప్పడానికి పై ఉదాహరణే చాలు.

అప్పట్లో కరీంనగర్ జిల్లా రామగుండం బొగ్గు ఘనికి మాత్రమే ప్రసిద్ధి కాదు ఒక జ్ఞాన ఘని ఐన సి నారే కోసం కూడా ఉన్నదనన్ను నేను సి నారే గురించి ఒక ప్రెస్ మీట్లో. ఆయన విడిచి వెళ్లిన సాహిత్యం ముమ్మాటికీ గ్యాన ఘనిలాంటిదే. ఆయనకంటే పెద్ద దోస్తు నాకెవ్వలు లేరు ఉండరు కాబట్టి "మై బిగ్ బడ్డీ సి నారాయణ రెడ్డి" అంటాను.

ఈ పేజీ మీ అందరిది

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. నవతెలంగాణ అభిప్రాయాలు కానవసరం లేదు. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోను 6000 క్యారెక్టర్లకు మించకుండా పంపించండి. లేనట్లయితే ఎడిటింగ్‌లో మీరు చెప్పదలచిన అభిప్రాయాలు స్పష్టత కోల్పోవచ్చు. వివిధ ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి.

- ఎడిటర్

మీరచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020.
Ph:27665420,27673787,9490099077/78.
Fax:040-27652228



శ్రీనివాస్ చిరిపోతుల

కల్తీలకు కళ్ళెం వేయలేమా..!

సమాజంలో ప్రతి మనిషికి ఆరోగ్యంగా జీవించే హక్కు ఉంది. నాణ్యమైన ఆహారాన్ని తీసుకొనే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. కానీ, ఈ హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ప్రభుత్వాలపైనే ఉంది.ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకూ మనం తీసుకునే ఆహారం కల్తీల మయం. ఉదాహరణకు మనం ఉదయాన్నే తీసుకునే పాలు, కాఫీ, టీ లాంటి వాటిలో కూడా కల్తీ జరుగుతుందనడంలో సందేహం లేదు. ఎందుకంటే వాటిలో పురుగుల మందులకు సంబంధించిన బోరిక్ యాసిడ్,యూరియా లాంటి ప్రాణాంతక రసాయనాలు కలిపి ఉండవచ్చు. హొటళ్ళలో ఐతే ఈ పరిస్తితి మరీ దారుణం..ఇటీవలి కాలంలో అధికారుల దాడులతో బయటపడిన దారుణాలు మనందరికి తెలిసిందే. జంతు కళేబరాల అవశేషాలతో, జంతు కొవ్వుతో తయారు చేయడం చాలానే చూశాం. చివరకు ప్రక తి ప్రసాదం అయిన పండ్లను కూడా వదలడం లేదు కల్తీగాళ్ళు. అత్యంత ప్రమాదకరమైన కార్బైడ్ రసాయనాలతో పండ్లను మాగబెట్టి పక్వానికి తీసుకురావడం జరుగుతున్నది. ప్రమాణాల విషయంలో ఒక్కో రాష్ట్రానికి ఒక్కో విధానం ఉండడం వల్ల సమస్యలు..సమస్యలు గానే మిగిలిపోతున్నాయి. ఉదాహరణకు మ్యాగీ ఉదంతం తరువాత ఆహార కల్తీ అంశం ప్రధాన చర్చల్లో నిలిచింది. మ్యాగీపై నిషేధం ఎందుకు విధించారో, ఆ వస్తువుల్లో ఏ మార్పు రాకుండా ఎందుకు తొలగించారో ఎవ్వరికీ అర్థం కాలేదు. కల్తీ జరిగినప్పుడు అక్కడకు వెళ్ళిన అధికారులు ఆయా పదార్థాల నుండి శాంపిల్స్ తీసుకుంటున్నారా, లేదా? లేదంటే సంబధిత ఏజెన్సీలతో కుమ్మక్కై పనిచేస్తున్నారా! అని అనుక్షణం గమనించే సమర్థవంతమైన ప్రజా వేగు వ్యవస్థను ఏర్పాటు చేయాలి. కల్తీ చేయడం వలన జరిగే పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. కల్తీ చేసిన వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వాలు పనిచేయాలి. తద్వార పాలనా యంత్రాంగం సామర్థ్యం పెరుగుతుంది. అప్పుడు ఈ కల్తీల మహమ్మారికి కళ్ళెం వేసినవారమవుతాము.!!!

సెల్ : 96034 71199

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూసేకరణ) శాఖ
కలెక్టరు, రంగారెడ్డి జిల్లా

ఫైల్ నెం.ఙ1/3273/2017, తేది:28-07-2017
గెజిట్ నెం.20 తేది:28-07-2017

ఫారము-సి
(సెక్షన్ 11 క్రింద 10ఎ మినహాయింపు ఇచ్చినప్పుడు)

ప్రాథమిక ప్రకటన

హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ కొరకు మేడిపల్లి గ్రామము, యాచారం మండలము, రంగారెడ్డి జిల్లాలో 2088.03½ ఎకరముల భూమి అవసరమైనదిగా కలెక్టరు, రంగారెడ్డి జిల్లా వారు భావించుచున్నారు.

కావున రంగారెడ్డి జిల్లా, యాచారం మండలము, మేడిపల్లి గ్రామములోని పైన పేర్కొన్న సదరు ప్రాజెక్టు కొరకు దిగువ వివరించబడిన విధంగా గుర్తించిన ప్రామాణిక కొలతలు ఎ.115.18 గుంటలు ఎక్కువ లేదా తక్కువ విస్తీర్ణపు భూమి యొక్క భాగము భూసేకరణ క్రింద కలదని ప్రకటించడమైనది.

షెడ్యూలు

జిల్లా: రంగారెడ్డి మండలము: యాచారం గ్రామము: మేడిపల్లి

క్రమసంఖ్య	సర్వే నెంబర్	భూమి స్వభావం టైటిల్	రకం	సేకరణ విస్తీర్ణం ఎ.గు	ఆసక్తి గల వ్యక్తుల పేర్లు, చిరునామా	సరిహద్దులు సర్వే నెంబర్ ప్రకారం ఉ	ద	తూ	ప	చెట్లు రకం/సంఖ్య	నిర్మాణాలు రకం	విస్తీర్ణం
1	2	3		4	5	6				7	8	
1	70/అ	పట్టా	మెట్ట	1.26	గులాం రబ్బాని తండ్రి ఇస్తాని	[illegible]	[illegible]	[illegible]	[illegible]	జామ 10 కొబ్బరి 20	బోర్	2
	70/ఆ	పట్టా	మెట్ట	1.25	గులాం సంధాని తండ్రి ఇస్తాని							
	70/ఇ	పట్టా	మెట్ట	1.25	గులాం జిలాని తండ్రి ఇస్తాని							
	70/ఈ	పట్టా	మెట్ట	1.25	గులాం అహ్మద్ తండ్రి ఇస్తాని							
	70/ఉ	పట్టా	మెట్ట	1.25	గులాం సుభాని తండ్రి ఇస్తాని							
	70/ఊ	పట్టా	మెట్ట	1.25	గులాం అమీనబీ తండ్రి ఇస్తాని							
	మొత్తం			9.31								
2	77/అ	పట్టా	మెట్ట	8.08	గౌర సత్తమ్మ [illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	వేప 10		
	77/ఆ	పట్టా	మెట్ట	8.09	గౌర పార్వతమ్మ [illegible]					వేప 10		
	మొత్తం			16.17								
3	82/అ	పట్టా	మెట్ట	2.09	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]			
	82/ఆ	పట్టా	మెట్ట	2.09	[illegible]							
	82/ఇ	[illegible]	మెట్ట	4.17	[illegible]							
	మొత్తం			8.35								
4	83	పట్టా	మెట్ట	5.25	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	వేప 5		
	మొత్తం			5.25								
5	91	[illegible]	మెట్ట	13.12	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]			
	మొత్తం			13.12								
6	97/అ	పట్టా	మెట్ట	5.01	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	వేప 7		
	97/ఆ	పట్టా	మెట్ట	4.20	[illegible]							
	మొత్తం			9.21								
7	103/అ ...	పట్టా	మెట్ట	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible] 150	బోర్	4
	మొత్తం			18.21								
8	111/అ	పట్టా	మెట్ట	0.09	మంద నర్సింహ [illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]		బోర్	1
	111/ఆ	పట్టా	మెట్ట	0.09	[illegible]							
	111/ఇ	పట్టా	మెట్ట	0.08	[illegible]							
	111/ఈ	పట్టా	మెట్ట	0.08	[illegible]							
	మొత్తం			0.34								
9	121/అ	పట్టా	మెట్ట	9.37	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]		బోర్	1
	121/ఆ	పట్టా	మెట్ట	1.00	[illegible]							
	మొత్తం			10.37								
10	122	పట్టా	మెట్ట	2.14	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible] 2	బోర్	1
	మొత్తం			2.14								
11	123	పట్టా	మెట్ట	0.38	మోతె లక్ష్మమ్మ భర్త లక్ష్మయ్య	[illegible]	[illegible]	[illegible]	[illegible]		బోర్	1
	123	పట్టా	మెట్ట	0.38	మోతె శ్రీశైలం తండ్రి రాములు							
	123	పట్టా	మెట్ట	0.38	మోతె బాషయ్య తండ్రి రాజయ్య							
	123	పట్టా	మెట్ట	0.07	ఆదెపల్లి లక్ష్మమ్మ భర్త యాదయ్య							
	123/అ	పట్టా	మెట్ట	0.29	మంద నర్సింహ తండ్రి పెంటయ్య							
	123/ఆ	పట్టా	మెట్ట	0.28	మంద శంకరయ్య తండ్రి పెంటయ్య							
	123/ఇ	పట్టా	మెట్ట	0.28	మంద అలయ్య తండ్రి పెంటయ్య							
	123/ఈ	పట్టా	మెట్ట	0.28	మంద యాదయ్య తండ్రి పెంటయ్య							
	123/ఉ	పట్టా	మెట్ట	0.38	మోతె మల్లయ్య తండ్రి రాజయ్య							
	123	పట్టా	మెట్ట	2.08								
	మొత్తం			6.32								
12	144	పట్టా	మెట్ట	12.19	గవర్నర్ ఆఫ్ ఎ.పి. రెప్రజెంటెడ్ బై ఎంఆర్ఓ, యాచారం	[illegible]	[illegible]	[illegible]	[illegible]			
	మొత్తం			12.19								
	మొత్తం			115.18								

భూసేకరణలో పారదర్శకం న్యాయబద్ధమైన నష్టపరిహారం రిహాబిలిటేషన్ మరియు రీసెటిల్‌మెంట్ చట్టం 2013 (కేంద్రప్రభుత్వ చట్టం 30/2013లోని సెక్షన్ 11(1) క్రింద మరియు సవరించిన న్యాయబద్ధమైన నష్టపరిహారం మరియు భూసేకరణలో పారదర్శకం, రిహాబిలిటేషన్ మరియు రీసెటిల్‌మెంటు (తెలంగాణ సవరణ) చట్టం2016 (చట్టం నెం.21/2017) ప్రకారం ఆసక్తి గల వ్యక్తులందరికీ తెలియ చేయుడమైనది.

క్రమబద్ధీకరణపై 'స్టే'

(మొదటిపేజీ తరువాయి)

జెన్‌కో తదితర విద్యుత్ సంస్థల్లో ఏండ్ల తరబడి పనిచేస్తున్న 20,903 మంది కాంట్రాక్టు ఉద్యోగులను జూలై నెలాఖరులో తెలంగాణ ప్రభుత్వం క్రమబద్ధీకరించిన సంగతి తెలిసిందే. 23,667 మంది విద్యుత్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకోగా, అందులో 20,903 మంది అర్హులని దరఖాస్తుల పరిశీలన అనంతరం స్క్రీనింగ్ కమిటీలు తేల్చాయి. తెలంగాణ స్థానికత లేకపోవడం, వయోపరిమితి మీరిపోవడం, ఉద్యోగాన్ని మధ్యలో వదిలేయడం వంటి కారణాలతో మిగతా దరఖాస్తులను కమిటీలు తిరస్కరించాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న సుమారు 24 వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసులను రెగ్యులరైజ్ చేయరాదని కోరుతూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని (పిల్) హైదరాబాద్‌కు చెందిన శ్రావణ్‌కుమార్ అనే నిరుద్యోగి దాఖలు చేశారు. జూన్ 29న జరిగిన విచారణలో విద్యుత్ సంస్థల తరఫు న్యాయవాది తన వాదనలను వినిపిస్తూ ఔట్‌సోర్స్ ఉద్యోగుల విలీన ప్రక్రియ ఇప్పటికిప్పుడు పూర్తయ్యేది కాదని, ప్రస్తుతం సంబంధిత ఉద్యోగుల బయోడేటాల పరిశీలన నిమిత్తమే కమిటీని ఏర్పాటు చేశామని తెలియజేశారు. అంతేకాక కార్మిక సంఘాల సమాఖ్యతో జరుగుతున్న రాజీ ప్రక్రియ కొలిక్కి వచ్చాకే విలీన నిర్ణయం ఫైల్‌ను బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల ముందు ఉంచుతామని, బోర్డు ఆ నిర్ణయానికి ఆమోదం తెలిపిన తరువాతనే విలీన ప్రక్రియకు సంబంధించి తగిన చర్యలు ఉంటాయన్నారు.

అయితే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసులను రెగ్యులరైజ్ చేస్తూ విద్యుత్ సంస్థలు నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయని అప్పుడు పిటిషనర్ల సీనియర్ న్యాయవాది సరసాని సత్యంరెడ్డి చెప్పగా, అలాంటి పరిణామాలు చోటు చేసుకుంటే తమ దష్టికి తీసుకురావాలని వెసులుబాటును హైకోర్టు సూచించింది. గత సోమవారం హైకోర్టుకు చెప్పిన దానికి భిన్నంగా ఏకంగా క్రమబద్ధీకరణ ఉత్తర్వులే జారీ అయ్యాయని అంటూ, తాజా పరిణామాలను ఆయన హైకోర్టు దష్టికి తీసుకురాగా, విచారణ అనంతరం డివిజన్ బెంచ్ స్టే ఇచ్చింది. ఇలాంటిది ఏమైనా జరిగితే తమ దష్టికి తేవాలని అప్పట్లో హైకోర్టు పిటిషనర్‌కు వెసులుబాటు కల్పించిందని గుర్తు చేశారు.

ఎంతో మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం వేయి కండ్లతో ఎదురుచూస్తున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో విద్యుత్ సంస్థలు సుమారు 21 వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం అన్యాయమని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ దేశాయ్ ప్రకాష్‌రెడ్డి వాదిస్తూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సర్వీసుల్ని రెగ్యులరైజ్ చేసే అధికారం విద్యుత్ సంస్థలకు ఉందని, అంతా చట్టంలోని నిబంధనలకు లోబడే జరిగిందన్నారు. వాదన ప్రతివాదనల అనంతరం హైకోర్టు ఔట్ సోర్సింగ్ సిబ్బంది క్రమబద్ధీకరణ ఉత్తర్వుల అమలుపై స్టే విధించింది. విచారణను నాలుగు వారాలు వాయిదా వేసింది. అయితే ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కన్సాలిడేట్ ఎమౌంట్ మొత్తాలను యథాతథంగా చెల్లించాలని, వారి సర్వీసులను సైతం కొనసాగించాలని సూచించింది. వాళ్లందరిని బయటకు పంపి ఉపాధి లేకుండా చేయలేమని హైకోర్టు మధ్యంతర ఆదేశాల్లో పేర్కొంది. ఈ ఉత్తర్వులు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు హక్కు మాత్రం కాబోదని స్పష్టం చేసింది.

కర్నాటకలో సోదాలు... పార్లమెంట్‌లో ప్రకంపనలు

(మొదటిపేజీ తరువాయి)

ఈ చర్యకు ఉపక్రమించిందని దుయ్యబట్టింది. సోదాలకు వ్యతిరేకంగా ఉభయసభల్లో ఆందోళనకు దిగింది. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయొద్దని నినదించింది. ఫలితంగా రాజ్యసభా కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోగా.. లోక్‌సభలో ఆ పార్టీ వాకౌట్ చేసింది. అయితే రాజ్యసభ ఎన్నికలకు, కర్నాటక మంత్రి ఇంటిపై కేంద్ర దర్యాప్తు సంస్థల సోదాలకు సంబంధం లేదని కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. మంత్రికి చెందిన 39 ప్రాంతాల్లో సోదాలు చేపట్టారని, రిసార్టులో దాడులు చేయలేదని తెలిపారు.

బుధవారం రాజ్యసభ ప్రారంభమైన తరువాత మొదట ఈ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ రాజ్యసభా ఉపనేత ఆనంద్‌శర్మ లేవనెత్తారు. 'గుజరాత్ ఎమ్మెల్యేలు ఆశ్రయం పొందుతున్న బెంగళూరులో.. పార్టీకి చెందిన ఎమ్మెల్యేలపై, మంత్రిపై ఉదయం నుంచి ఆదాయపు పన్ను శాఖ, ఈడీ సోదాలు నిర్వహిస్తున్నాయి' అని ఆరోపించారు. కేంద్ర సర్కారు ఐటీ విభాగాన్ని, సీబీఐని, ఈడీని దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. గుజరాత్ ఎమ్మెల్యేలను సురక్షితంగా సంరక్షిస్తున్న మంత్రిపై ఈ సమయంలోనే సోదాలు నిర్వహించడంలో మతలబు ఏంటని ప్రశ్నించారు. ఇదే అంశంపై రాజ్యసభా ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్ మాట్లాడుతూ.. దేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా, భయం లేకుండా జరగాలని, కానీ గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో ఇవేవీ జరగడం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం భయోత్పాతానికి గురి చేస్తోందని విమర్శించారు. ఎమ్మెల్యేలను కిడ్నాప్ చేస్తున్నారని, భయపెడుతున్నారని అన్నారు. ఈ ట్రెండ్ గుజరాత్ నుంచి ప్రస్తుతం దక్షిణానికి పాకిందని విమర్శించారు. కేవలం ఒక్క మంత్రి ఇంటిపై మాత్రమే సోదాలు జరుగుతున్నాయన్న జైట్లీ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. 'ఈ సమయంలోనే సోదాలు ఎందుకు జరుగుతున్నాయి?' అని ప్రశ్నించారు. ఒక నెల ముందుగా, ఒక నెల తరువాత ఎందుకు జరగడం లేదని నిలదీశారు. 'బెంగళూరులో ఎమ్మెల్యేలకు డబ్బులు పంచుతున్నాడని అనుమానం వచ్చి సోదాలకు ఆదేశించారు. కానీ మా పార్టీపై ఇప్పటి వరకు అలాంటి ఆరోపణ రాలేదు. మీ(బీజేపీ) వ్యక్తులు ఒక్కో ఎమ్మెల్యేకు రూ.15 కోట్లు పంచుతున్నారు. వాళ్ల ఇంటిపై సోదాలు ఎందుకు చేయడం లేదు' అని ప్రశ్నించారు. ప్రతిపక్షాలపై మొదట రాష్ట్ర ప్రభుత్వ సంస్థలను వినియోగించారని ఇప్పుడు ఏకంగా కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఆజాద్ విమర్శించారు. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు.

అంతకముందు కేంద్ర ఆర్థికమంత్రి జైట్లీ మాట్లాడుతూ.. గుజరాత్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉంటున్న రిసార్టుపై ఎలాంటి సోదాలూ జరగలేదని చెప్పారు. 'కేవలం ఆ రిసార్టు వద్ద ఉన్న మంత్రిని మాత్రమే అధికారులు తనిఖీ చేశారు. ఆయన వద్ద ఉన్న పత్రాలను తీసుకుని పంచనామాకు పంపారు. ఈ సోదాలు 39 ప్రాంతాల్లో జరుగుతున్నాయి' అని చెప్పారు. ఈ సమయంలో కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఫలితంగా సభ మొదట పది నిమిషాలు, ఆ తరువాత 12 గంటలకు, ఆపై మధ్యాహ్నానికి వాయిదా పడింది. మధ్యాహ్నం కూడా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో సభను గురువారానికి వాయిదా వేశారు.

లోక్‌సభలో కాంగ్రెస్ వాకౌట్

కాంగ్రెస్ మంత్రిపై ఐటీ సోదాలు చేపట్టడాన్ని ఇటు లోక్‌సభలోనూ ఆ పార్టీ ఎంపీలు లేవనెత్తారు. ఈ అంశంపై లోక్‌సభా ప్రతిపక్ష నేత మల్లిఖార్జునఖర్గే మాట్లాడుతూ.. రాజకీయ లబ్ధి కోసం విపక్ష నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థలను సర్కారు వినియోగిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రాజకీయ కక్షతో ఇదంతా చేస్తోందని అన్నారు. గుజరాత్‌కు చెందిన 42 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్న ఈగల్ రిసార్టులో భయోత్పాతం సృష్టించేందుకు ఈడీ అధికారులను కేంద్రం పంపిందని అన్నారు. ఇలాంటి అనైతిక చర్యలు కొనసాగితే ప్రజాస్వామ్యంలో ఏ పార్టీ మనుగడ సాధించదని ఆందోళన వ్యక్తంచేశారు. గుజరాత్ రాజ్యసభ కాంగ్రెస్ అభ్యర్థిని(అహ్మద్ పటేల్) ఓడించేందుకు బీజేపీ చేస్తున్న ఈ యత్నాలు సఫలీకృతం కాబోదని స్పష్టం చేశారు. రాజ్యసభ ఎన్నికలకు, మంత్రి ఇంటిపై సోదాలకు సంబంధం లేదని జైట్లీ అన్నారు. మంత్రి సమాధానంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ సభ్యులు సభను వాకౌట్ చేశారు.

పాయింట్లు సరే... వీటి సంగతేంటి?

(మొదటిపేజీ తరువాయి)

ఉండదు. కానీ...మన ట్రాఫిక్ పోలీసులు ఆ జంక్షన్లను మూసేసి అరకిలోమీటర్ తర్వాత 'యు' టర్న్ ఇస్తున్నారు. అదేమంటే ట్రాఫిక్ నియంత్రణ అనే సమాధానం వస్తుంది. జంక్షన్ల వద్ద ట్రాఫిక్ పోలీసుల్ని పెట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే చర్యల్ని ఆ శాఖ ఎప్పుడో గాలికొదిలేసింది. సిబ్బంది కొరత పేరుతో పనిభారాలు తగ్గించుకోవడానికి 'షార్ట్‌కట్' దారుల్ని వెతుక్కొంటోంది. సర్కారు పెద్దలు చెప్తున్న విదేశీ పాయింట్ల విధానంలో నాలుగులైన్ల రోడ్లు హైదరాబాద్‌లో ఎన్ని ఉన్నాయి. సైక్లిస్టులు, పాదచారులు, ద్విచక్ర వాహనాలు, బస్సులు, లారీలు వంటి భారీ వాహనాలు వెళ్ళేందుకు రోడ్లను విభజించారా? అసలు డ్రైవింగ్ లైసెన్స్ 'లేనివారు' ఎంతమంది ఉన్నారనే లెక్కలు రవాణాశాఖ లేదా ట్రాఫిక్ పోలీసుల వద్ద ఉన్నాయా? ఉంటే లైసెన్సుల జారీకి అడ్డుగా ఉన్న నిబంధనలు ఏంటనే పరిశీలన చేశారా? గ్రేటర్ హైదరాబాద్‌లో కనీసం 40 కి.మీ., స్పీడ్‌తో వాహనాలు వెళ్లేలా రోడ్లు ఉన్నాయా? ఒకే రోడ్డులో 'ఫ్రీ లెఫ్ట్' అంటూ బారికేడ్లు పెట్టి వదిలేస్తే.. ఆయా జంక్షన్ల వద్ద రద్దీ ఎంత పెరుగుతుంది...'లెఫ్ట్' వెళ్లే వాహనదారుడు సిగ్నల్ వద్ద నిలబడిన వాహనదారుడి వెనుక నుంచి హారన్ కొడుతుంటే...వెళ్తారులే అని కొంచెం ముందుకు జరిగితే 'జీబ్రాలైన్' క్రాస్ చేశావంటూ చలానా ఇంటికి పంపడం ఎంతవరకు సమంజసం.

ఇక హెల్మెట్లు పెట్టుకుంటే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని చెప్తున్నారు. మంచిదే. అసలా హెల్మెట్లు అంతర్జాతీయ ప్రమాణాలతో ఉన్నాయా లేదా అని పరిశీలన చేయాల్సింది ఎవరు. ఇప్పుడు మార్కెట్లో దొరుకుతున్న హెల్మెట్లు పెట్టుకుంటే వాహనదారుడికి పక్కనుంచి వచ్చే వాహనాలు ఏమాత్రం కనపడవు. వీటి డిజైన్‌ను ఏ ప్రాతిపదికన చేశారు. అదే సందర్భంలో ప్లాస్టిక్‌తో పాటు నాశిరకం హెల్మెట్లు మార్కెట్లను ముంచెత్తుతుంటే రవాణాశాఖ, ట్రాఫిక్ పోలీసులు ఏం చేస్తున్నారు. ఆ సంగతి సరే...రాంకోఠి సహా ఆటోమొబైల్ మార్కెట్లలో వాహనాల నకిలీ విడిభాగాల్ని బహిరంగంగా ఎలాంటి బిల్లులు లేకుండా అమ్ముతుంటే సర్కారీ వ్యవస్థలు ఏం చేస్తున్నాయి. ప్రభుత్వం తాను చేయాల్సిన పనులు చేయకుండా కేవలం వాహనదారుల్ని మాత్రమే బాధ్యులుగా చేస్తూ 'శ్రీరంగ నీతులు' చెప్పడం ఎంత వరకు సమంజసం. చెప్పేవాడికి...వినేవాడు లోకువ అంటే ఇదే కదా! ఔటర్ రింగ్‌రోడ్‌పై అతివేగం కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న మాట వాస్తవం...వాటిని నియంత్రించాల్సిన బాధ్యత ఎవరిది? ప్రమాదాలు జరిగాక పంచనామాలు చేయడానికే పోలీస్‌శాఖ పరిమితమౌతుందన్న సంగతిని విస్మరిస్తే ఎలా? నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాన్ని నిలిపితే 2 పాయింట్లు వేస్తామని ట్రాఫిక్ బాస్‌లు సెలవిచ్చారు. షాపింగ్ కాంప్లెక్సులు, మార్కెట్ల వద్ద వాహనదారులకు అనుకూలంగా పార్కింగ్ ప్లేస్‌లను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఎవరిది? అడ్డగోలుగా భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చి, నిబంధనలు ఉల్లంఘించినా చూసీచూడనట్టు నటిస్తూ...మూడు అంతస్తుల క్రింద సెల్లార్ పార్కింగ్‌లు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సర్కారుపై లేదా? ఇక ఆటోలు, ట్రాలీలు, లారీల వంటి వాహనాలకు పార్కింగ్ ప్లేస్‌లు ఎన్ని ఉన్నాయి. వాటి సంఖ్య అయితే సర్కారు వద్ద ఉంది. మరి సౌకర్యాల మాటేంటి? ట్రాఫిక్ జామ్‌లను గాలికి వదిలేసి, జంక్షన్లను మూసేసి, పార్కింగ్ ప్లేస్‌లు ఎత్తేసి, గుంతల రోడ్లపై నడుములు విరిగేలా వాహనాల్ని నడుపుతుంటే... జనం సహనాన్ని మరింత పరీక్షించేలా...పాయింట్ల విధానం అంటూ మరో భయాన్ని క్రియేట్ చేయడం వెనుక ఆంతర్యం ఏంటి? ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన కానిస్టేబుళ్ల చేతికి కెమెరాలు ఇచ్చి, వారికి టార్గెట్లు నిర్దేశించి చలాన్ల రూపంలో జనం సొమ్మును దోచుకోవడమే లక్ష్యంగా సర్కారు వ్యవహరిస్తుందనడంలో సందేహం లేదు. సర్కారు తన తప్పిదాలు, అసమర్థతను కప్పిపుచ్చుకుంటూ...అన్నింటికీ జనమే బాధ్యులన్నట్టు వ్యవహరిస్తోంది.

రోడ్డు భద్రతా కౌన్సిల్ ఏమైంది?

2015లో ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేకంగా రోడ్డు భద్రతా కౌన్సిల్‌ను ఏర్పాటు చేశారు. ఈ రెండేండ్లలో ఆ కౌన్సిల్ ఏం చేసింది. ఏ మేరకు రోడ్డు ప్రమాదాల్ని నివారించగలిగింది. 2016లో 22,815 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. 7,227 మంది మరణించారు. 23వేల మంది క్షతగాత్రులయ్యారు. దీన్ని బట్టే సర్కారు చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమౌతోంది. ఇక్కడే మరో కోణం కూడా ఉంది. 2016లో ట్రాఫిక్ ఉల్లంఘనులపై 20 లక్షల 71వేల కేసులు పెట్టి రూ.30 కోట్లు జరిమానాలుగా వసూలు చేశారు. 2017లో ఇప్పటివరకు 12 లక్షల కేసులు పెట్టి రూ.15.58 కోట్ల జరిమానాలు వసూలు చేశారు. మరి ప్రమాదాల నివారణకు ప్రభుత్వపరంగా ఏం చేశారు? 'చాలా చేస్తాం' అని మూడేండ్లుగా చెప్తున్నారు. ఆ 'చేయడం'లో భాగమే జనంపై 'పాయింట్ల' భారం. పైసా ఖర్చులేని పని...పైగా కావల్సినంత ఆదాయం!!

మహిళపై ఎస్సై కర్కశత్వం

(మొదటిపేజీ తరువాయి)

మహిళపై పాశవికంగా దాడిచేసి అసభ్య పదజాలంతో దూషించిన ఎస్‌ఐని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మహిళా కానిస్టేబుళ్లు లేకుండా ఓ మహిళపై దాడి చేయడం, అరెస్టు పేరుతో ఆమెను జీపులో తీసుకెళ్లడం చట్టవిరుద్ధమన్నారు. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మోతిరాం నాయక్, ఎమ్మార్పీఎస్ తనాయకులు భాగయ్య, కుర్మగొల్ల సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు మర్కంటి భూమన్న, అడ్వకేట్ గంగాధర్ పాల్గొన్నారు.

బజాజ్ కమిటీతో కేఆర్ఎంబీ చైర్మెన్ భేటీ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల వివాదంపై కేంద్రం నియమించిన ఏకే బజాజ్ కమిటీతో కృష్ణా బోర్డు చైర్మెన్ ఎస్కే శ్రీవాత్సవ బుధవారం ఢిల్లీలో సమావేశమయ్యారు. కృష్ణా జలాల వినియోగం, ప్రాజెక్టుల నిర్వహణ, ఆపరేషన్ ప్రోటోకాల్‌తో పాటూ కృష్ణాబోర్డు పరిధి, విధివిధానాలపై వారు చర్చించినట్టు తెలిసింది. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో పర్యటించిన బజాజ్ కమిటీ కృష్ణా జలాల పంపకాలు, వివాదాలపై రెండు రాష్ట్రాల అధికారులతో చర్చించింది.

సేకరణ భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు భూసేకరణ అధికారి/రెవెన్యూ డివిజనల్ అధికారి, ఇబ్రహీంపట్నం డివిజన్ కార్యాలయములో అందుబాటులో ఉండును. ఆసక్తి గల వ్యక్తులెవరైనను ప్రభుత్వ పనిదినములలో మరియు పనివేళలలో తనిఖీ చేసుకోవచ్చును. తెలంగాణ ప్రభుత్వము/కలెక్టర్, రంగారెడ్డి జిల్లాగారు చట్టంలోని సెక్షన్ 12 ప్రకారము కల్పించిన మరియు పేర్కొన్నట్లుగా వారి పనిని నిర్వహించుటకు అవసరమైన అన్ని ఇతర పనులు అనగా భూమి సర్వే, భూమి పరిశీలన కొరకు, భూమి పొరలను త్రవ్వుటకు మరియు సంబంధిత పనులు చేయుటకు కావలసిన అన్ని చర్యలు నిర్వహించుటకు భూసేకరణ అధికారి/రెవెన్యూ డివిజనల్ అధికారి, ఇబ్రహీంపట్నం డివిజన్, రంగారెడ్డి జిల్లా గారిని నియమించినారు.

చట్టం యొక్క సెక్షన్ 11(4) క్రింద కలెక్టరు గారి ముందస్తు అనుమతి లేకుండా ఈ ప్రకటన ప్రచురణ తేది నుండి సదరు స్థలములో ఏ వ్యక్తి కూడా భూమి యొక్క ఏవేని లావాదేవీలు అనగా అమ్మకం/కొనుగోలు/లేదా ఏవేని బాకీట్లు రుణభారాలను చేయరాదు.

భూసేకరణకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే భూసేకరణ అధికారి/రెవెన్యూ డివిజనల్ అధికారి, ఇబ్రహీంపట్నం డివిజన్, రంగారెడ్డి జిల్లా ముందు చట్టం యొక్క సెక్షన్ 15 క్రింద పేర్కొన్నట్లుగా ఈ ప్రకటన ప్రచురణ తేది నుండి 60(అరవై రోజులు) లోపు ఆసక్తి గల వ్యక్తులు దాఖలు చేసుకోవచ్చును.

తహసీల్దారు యాచారం మండలము రంగారెడ్డి జిల్లా	భూసేకరణ అధికారి/ రెవెన్యూ డివిజనల్ అధికారి ఇబ్రహీంపట్నం డివిజన్ రంగారెడ్డి జిల్లా	జాయింట్ కలెక్టర్ రంగారెడ్డి జిల్లా	జిల్లా కలెక్టర్ రంగారెడ్డి

ఎన్ని కేసులేసినా..భయపడం

(మొదటిపేజీ తరువాయి)

నేతలకు బుద్ధిరావడం లేదన్నారు. అసెంబ్లీ అరుపుల వేదిక కాదు.. చర్చల వేదిక అని అన్నారు. గతంలో ఓ సీఎం అసెంబ్లీ సాక్షిగా లేచి తెలంగాణ ప్రాంతానికి ఒక్క పైసా కూడా ఇవ్వను పో అంటే ఒక్క ఎమ్మెల్యే కూడా లేచి మాట్లాడలేదని, ఇదేం అన్యాయమని ప్రశ్నించలేదన్నారు. కానీ ఇప్పుడు రాష్ట్రాన్ని అభివద్ధి చేసేందుకు ప్రయత్ని స్తుంటే అడుగడుగునా పిల్‌లు వేసి అడ్డంకులు సష్టిస్తున్నారని సీఎం మండిపడ్డారు. ఇలాంటి అసహన వైఖరిని దేశంలో ఎక్కడా చూడలేదన్నారు.

ప్రాజెక్టులపై 164 కేసులా?

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులపై 164 కేసులు వేశారని, ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుపైనే 20 రోజుల్లో ఆరు కేసులు పెడితే అవి వీగిపోయాయన్నారు. కాళేశ్వరంపై గ్రీన్ ట్రిబ్యునల్‌కు కూడా వెళ్లారన్నారు. తెలంగాణ ప్రజలకు సాగు, తాగునీరు అందించే లక్ష్యంగా చేపట్టే ప్రాజెక్టులపై 164 కేసులా? అని ఆశ్చర్యం వ్యక్తంచేశారు. మిషన్ కాకతీయ ప్రాజెక్టు మొదలుకాకముందే కుంభకోణం జరిగిందంటూ ఆరోపణలు చేస్తున్నారన్నారు. హుందాగా వ్యవహరించాల్సిన ప్రతిపక్ష పార్టీ విఫల పాత్ర పోషిస్తోందన్నారు. అలాంటి వైఖరితో ఆ పార్టీకే నష్టమని అన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి మాటల్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజలు తప్పకుండా బుద్ధి చెబుతారన్నాం ప్రజలకు మేలు చేస్తామనే ఆరాటంతో ప్రభుత్వం పనిచేస్తున్నప్పుడు ప్రతిపక్షం బాధ్యతతో పనిచేయాలన్నారు. కానీ, రాష్ట్రంలో కాంగ్రెస్ అనుసరిస్తున్న వైఖరి చూస్తుంటే జాలేస్తోందన్నారు.

వారి వైఖరితో నష్టం

కాంగ్రెస్ అవలంబిస్తోన్న వైఖరితో లక్ష మందికి పైగా ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అయినా కాంగ్రెస్ నేతల బుద్ధి మారడంలేదన్నారు. రాజకీయంగా నష్టపోతామనే భయం వారిలో నెలకొందని, అందుకే ప్రతిదాన్ని రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ దుష్ట పన్నాగాలను క్షేత్రస్థాయిలో ఎండగడతామని, ప్రజలే వారి వ్యూహాలను తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశారు. తమ ప్రభుత్వ హయాంలో దందాలు, పైరవీలు లేవన్నారు. నేరెళ్ల ఘటనను దళితుల సమస్యగా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు.

పట్టాదారు ఒకరు...రుణదాత వేరొకరు

నవతెలంగాణ-వికారాబాద్ రూరల్

కొందరు ప్రబుద్ధులు సులువుగా డబ్బు సంపాదించాలనుకున్నారు. వంద మంది రైతుల పేరిట నకిలీ పాసు పుస్తకాలను సృష్టించారు. బ్యాంకు అధికారులను బురిడీ కొట్టించారు. రూ.6 కోట్ల రూపాయలను స్వాహా చేశారు. తహసీల్దార్‌కు, బ్యాంకు అధికారులకు, ఏసీబీకి...ఇలా కనిపించన చోటల్లా బాధిత రైతులు ఫిర్యాదు చేశారు. బోగస్ పాసుపుస్తకాలు సృష్టించిన వారిపై ఎంతకీ చర్యలు తీసుకోకపోవటంతో బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఏసీబీ అధికారులను హైకోర్టు ఆదేశించింది. దీంతో అవినీతి నిరోధక శాఖ విచారణ ప్రారంభించింది. సంగారెడ్డి జిల్లా బుదేరా కార్పొరేషన్ బ్యాంకుల్లో కొంశట్‌పల్లి, మొగిలిగుండ్ల గ్రామాలకు చెందిన రైతులకు పట్టాభూములపై కొందరు బడాబాబులు ఒక ముఠాతో చేతులు కలిపి దాదాపు 6 కోట్ల రూపాయల రుణం పొందారు. మర్పల్లి తహసీల్దార్‌గా పనిచేసిన షాహేదాబేగం సంతకంతో దాదాపు 100 పాసుపుస్తకాలు జారీ అయ్యాయి. వీటితో బుదేరా కార్పొరేషన్ బ్యాంకు నుంచి ఎకరానికి లక్ష నుంచి దాదాపు 3 లక్షల వరకు పంట రుణాలుగా పొందారు. మర్పల్లి మండల కార్యాలయంలో ఒరిజినల్ పట్టదారుల పేర్లు మార్చి నకిలీ పట్టదారుల పేర్లు రాసుకున్నారు. పట్టదారు పేరు మార్పు పహణిపై సంతకం చేయించడంలో రెవెన్యూ సిబ్బంది హస్తం ఉన్నట్టు తెలుస్తున్నది. పహణి పొందే వరకు కంప్యూటర్‌లో నకిలీ పట్టదారుల పేర్లు నమోదు చేసి వాటిని తరువాత తొలగించి మళ్లీ ఒరిజినల్ పట్టదారుల పేర్లు నమోదు చేశారు.

ఈ విషయంపై కొంశట్‌పల్లి, మొగిలిగుండ్ల గ్రామాల రైతులు అప్పటి తహసీల్దార్ షాహేదాబేగంకు ఫిర్యాదు చేశారు. ఆమె ఈ విషయంపై వికారాబాద్ సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో అప్పటి సబ్ కలెక్టర్ అలుగు వర్షిణి సమగ్ర విచారణ జరిపి నకిలీ పాసు పుస్తకాలు పొంది కోట్లాది రూపాయలు స్వాహా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బుదేరా బ్యాంకు అధికారులకు లేఖ రాశారు. దీంతో బుదేరా బ్యాంకు అధికారులు తూతూ మంత్రంగా విచారణ జరిపి మునుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొందరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. కానీ, సమగ్ర విచారణ జరగలేదు. బ్యాంకు నుంచి పొందిన సొమ్ము పూర్తిస్థాయిల్లో రికవరీ కాలేదు. తమ సర్వే నెంబర్లపై కొందరు అక్రమంగా పంట రుణాలు పొందారని దీనిపై చర్య తీసుకోవాలని మర్పల్లి సివిల్ పోలీసు ఏసీబీ అధికారులను బాధితులు ఆశ్రయించారు. కానీ వారు స్పందించక పోవడంతో రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై చర్య తీసుకొని నివేదిక సమర్పించాలని ఏసీబీ అధికారులను హైకోర్టు ఆదేశించింది. దీంతో బుదేరా కార్పొరేట్ బ్యాంకుల నకిలీ పాసుపుస్తకాలపై పంటరుణాలు పొందిన కేసు వేగవంతమైంది. మొగిలిగుండ్ల, కొంశట్‌పల్లి గ్రామాలకు ఏసీబీ అధికారులు వచ్చి సమగ్ర విచారణ చేశారు. అసలు రైతుల పాసు పుస్తకాలను, నకిలీ పాసుపుస్తకాల కాపీలను స్వాధీనం చేసుకొని మర్పల్లి తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. మోమిన్‌పేట్, సంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపూర్, కోహీర్, ప్రాంతానికి చెందిన కొందరు బడాబాబులు నకిలీ పాసుపుస్తకాలు తయారు చేసే ముఠాతో చేతులు కలిపి పంటరుణాలు స్వాహా చేసినట్టు ఏసీబీ అధికారుల విచారణలో తేలింది. 7 గుంటల భూమి రైతు పేరు ఉంటే 7 ఎకరాలుగా మార్చి డబ్బు స్వాహా చేశారు. నకిలీ పాసు పుస్తకాలపై మర్పల్లి తహసీల్దార్ కావాలనే సంతకం చేసిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ సంతకం ఒరిజినల్‌లా? కాదా?అని ఏసీబీ అధికారులు తేల్చుకోవడానికి సాంకేతిక నిపుణుల సలహాలు తీసుకుంటున్నట్టు తెలుస్తుంది.

నకిలీ పాసుపుస్తకాలతో నాకు సంబంధం లేదు: షాహేదాబేగం, మోమిన్‌పేట్ తహసీల్దార్

నకిలీ పట్టా పాసుపుస్తకాలపై తాను సంతకం చేసినట్టు వస్తున్న ఆరోపణల్లో నిజం లేదు. అవన్నీ ఫోర్జరీలే. ఈ విషయంపై అప్పట్లో వికారాబాద్ సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా. నేను ఏ పట్టాదారు పేరు మార్పులు చేర్పులు చేయలేదు.

గ్యాస్ రాయితీ ఎత్తివేత వెనుక..

- ప్రయివేట్ చమురు కంపెనీలకు ఏటా వేలకోట్లు దోచి పెట్టే ప్రణాళిక
- గృహ వినియోగ మార్కెట్‌లోకి రిలయన్స్‌వంటి సంస్థలకు ప్రవేశం .?

న్యూఢిల్లీ: సబ్సిడీని స్వచ్ఛందంగా విరమించుకోవాలంటూ (2015,మార్చి 27న) ధనికులకు ప్రధాని మోడీ పిలుపు ఇచ్చే వరకూ వంటగ్యాస్ సిలిండర్ ధర స్థిరంగా పెరుగుతూ వచ్చింది. 2015,మార్చిలో ఢిల్లీలో 14.2 కిలోల వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.727. ఆ తర్వాతి నెల ఏప్రిల్ నుంచి అంతర్జాతీయంగా ధరలు పడిపోవటంతో..సిలిండర్ ధర తగ్గుతూ వచ్చింది. 2016 సెప్టెంబర్‌నాటికి రూ.466.50కి పడిపోయింది. ఆ తర్వాత తిరిగి ధర పెరుగుతూ ఉన్నది. ఈ ఏడాది ఫిబ్రవరిలో గరిష్టంగా రూ.66.50 పెంచారు. అంతకన్నా గరిష్టంగా మార్చిలో రూ.86 ఒకేసారి పెంచారు. ఇదే సమయంలో జరిగిన కొన్ని పరిణామాలను గుర్తు చేసుకుంటే తాజాగా మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనుక ఉన్న అంతరార్థం ఏమిటన్న ప్రశ్న ముందుకొస్తున్నది. 2015, సెప్టెంబర్ 3న ప్రభుత్వరంగ చమురు సంస్థలన్నిటికీ పెట్రోలియం,సహజవాయువు నియంత్రణ బోర్డు(పీఎన్‌జీఆర్‌బీ) ఓ నోటీస్ జారీ చేసింది. ఆ సంస్థలు ఏర్పాటు చేసుకున్న పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను ఉమ్మడి క్యారియర్‌గా మార్చి ప్రయివేట్ కంపెనీలు వినియోగించుకునేందుకు వీలు కల్పించాలన్నది నోటీస్ సారాంశం. ప్రభుత్వరంగ సంస్థలు ఏర్పాటు చేసిన ఆ మౌలిక వసతుల ద్వారా రిలయన్స్, ఎస్సార్‌వంటి బడా కంపెనీలకు ప్రయోజనం చేకూర్చటమే. దీని ద్వారా ఆ కంపెనీల రిఫైనరీల్లో ఉత్పత్తి అయ్యే గ్యాస్‌ను దేశవ్యాప్తంగా అమ్ముకునేందుకు పైసా పెట్టుబడి లేకుండా వీలు కల్పించడమేనన్నది గమనార్హం. దీంతో, ప్రతిఏటా కొన్ని వందల కోట్ల రూపాయలమేర ప్రభుత్వం నుంచి ఆ కంపెనీలు పరోక్షంగా ప్రయోజనం పొందడమే అవుతుంది. ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ) ప్రభుత్వం ముందు తమ వాదన వినిపించింది. దేశంలోనే అతిపెద్ద పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను ఐఓసీ కలిగి ఉన్నది. ప్రభుత్వ ప్రతిపాదనకు ఆమోదం తెలిపితే..50 శాతం నెట్‌వర్క్ ఐఓసీ ఆధీనంలో లేకుండా పోతుంది. దాంతో, ఐఓసీ వినియోగదారులకు గ్యాస్ సరఫరాలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయి. 2016, మే 1న ఉజ్వల యోజన(పీఎంయూవై) పథకాన్ని ప్రధాని మోడీ ప్రారంభించారు. పొగతో కూడిన వంటగదుల వల్ల మహిళలు,చిన్నారుల ఆరోగ్యం దెబ్బతింటున్నదనీ, వారి ఆరోగ్య భద్రత కోసం వంట గదుల్లో శుద్ధ ఇంధనం వాడేలా ఎల్పీజీ సౌకర్యం కల్పించాలన్నది ఈ పథకం లక్ష్యంగా పీఎంయూవై వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. తాజా నిర్ణయంతో మోడీ ప్రభుత్వం ఈ పథకాన్ని అటకెక్కించనున్నదా..?

2016,నవంబర్ 27న ఐఓసీ పైప్‌లైన్‌ను వినియోగించుకునేందుకు అనుమతి కోరుతూ పీఎన్‌జీఆర్‌బీకి రిలయన్స్ ఇండస్ట్రీస్ లేఖ రాసింది. యూపీ,మధ్యప్రదేశ్‌సహా దేశంలోని ఉత్తర రాష్ట్రాల్లోని మారుమూల ప్రాంతాల వరకూ ఐఓసీ పైప్‌లైన్ ద్వారా తమ గ్యాస్ సరఫరాకు అనుమతివ్వాలని రిలయన్స్ కోరింది. ఐఓసీకి చెందిన పైప్‌లైన్‌తోపాటు స్టోరేజీ,లోడింగ్ సౌకర్యాలను కూడా వాడుకునేందుకు రిలయన్స్ అనుమతి కోరింది. 2015 వరకూ గృహ వినియోగ ఎల్పీజీ పంపిణీకి ప్రయివేట్ కంపెనీలకు అనుమతి లేదు. ప్రయివేట్ కంపెనీల్లో ఉత్పత్తయ్యే ఎల్పీజీని ప్రభుత్వరంగ చమురు సంస్థల ద్వారానే సరఫరా చేయాలన్న నిబంధన ఉండేది. అయితే, 2014 సెప్టెంబర్‌లో గృహేతర అవసరాలకు నెలకు 10,000 టన్నులమేర తమ నెట్‌వర్క్ ద్వారా సరఫరా చేసుకునేందుకు రిలయన్స్‌కు కేంద్రం అనుమతిచ్చింది. 2016 అక్టోబర్‌లో గృహ వినియోగ ఎల్పీజీ రిటైల్ అమ్మకాలను నాలుగు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా రిలయన్స్ ప్రారంభించింది. అయితే, రిలయన్స్ అమ్మే 5 కిలోల సిలిండర్లపై ఎటువంటి రాయితీ గృహ వినియోగదారులకు లభించదు. 2016, జూన్‌లోనే మోడీ ప్రభుత్వం కూడా నెలకు రూ.2 చొప్పున సిలిండర్ ధరను పెంచుతూ చివరికి పేదలకిచ్చే రాయితీని పూర్తిగా తొలగించాలని నిర్ణయించింది. తాజాగా తీసుకున్న నిర్ణయంతో నెలకు రూ.4 చొప్పున ధర పెరగనున్నది. వచ్చే ఏడాది మార్చి వరకల్లా రాయితీని జీరో స్థాయికి తెచ్చి ఏప్రిల్ వరకల్లా పూర్తిగా ఎత్తివేయాలన్నది మోడీ ప్రభుత్వ ప్రణాళిక. తాజా ఉత్తర్వులను ఈ ఏడాది మే 30న ఇచ్చినట్టు, జూన్ 1 నుంచి అమలు చేయాలని అందులో పేర్కొన్నట్టు చమురుశాఖ మంత్రి తెలిపారు. మరోవైపు జులైలో ఎల్పీజీ సిలిండర్ ధర ఒకేసారి రూ.32 పెరిగింది. అంటే..జీఎస్టీ కూడా తోడు కావడంతో గ్యాస్ ధర మునుపెన్నడూ లేనివిధంగా పెరిగిందన్నది గమనార్హం. సబ్సిడీ ఎత్తివేస్తే ప్రభుత్వరంగ సంస్థలు సరఫరా చేసే గ్యాస్ సిలిండర్ల ధరలు కూడా పెరిగి రిలయన్స్ సప్లై చేసే గ్యాస్ ధరతో సమానమవుతుంది.అప్పుడు రిలయన్స్ గ్యాస్ వ్యాపార విస్తరణ సులభమవుతుందని విశ్లేషకుల అంచనా.

నవచిత్రం

రెగ్యులర్ షూటింగ్ షురూ..



అల్లు అర్జున్

అల్లు అర్జున్, అను ఇమ్మాన్యుయెల్ జంటగా వక్కంతం వంశీ దర్శకత్వంలో రూపొందుతున్న నూతన చిత్రం 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' ఇటీవల ప్రారంభోత్సవం జరుపుకుంది. కె.నాగబాబు సమర్పణలో, రామలక్ష్మి సినీ క్రియేషన్స్ పతాకంపై శిరీష శ్రీధర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బన్నీ వాసు సహ నిర్మాత. ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ బుధవారం నుంచి హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్మాత లగడపాటి శ్రీధర్ మాట్లాడుతూ, 'వరుస బ్లాక్ బస్టర్స్ అందుకుని టాప్ ఫామ్‌లో ఉన్న స్టయిలీష్ స్టార్ అల్లు అర్జున్ మా బ్యానర్‌లో నటిస్తున్నందుకు ఆనందంగా ఉంది. బుధవారం నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించాం. బన్నీ ఎనర్జికి తగ్గట్టుగా చేసిన ఈ కథలో అన్ని రకాల కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్నాయి. 'టెంపర్', 'కిక్', 'రేసుగుర్రం' వంటి సూపర్ హిట్ చిత్రాలకు కథ అందించి, వరుస సక్సెస్‌ల తర్వాత తొలిసారిగా దర్శకత్వం వహిస్తున్న వక్కంతం వంశీ చాలా ఎనర్జిటిక్‌గా వర్క్ చేస్తున్నారు. నాగబాబు, బన్నీవాసులతో కలిసి ఈ ప్రాజెక్ట్ చేయడం హ్యాపీగా ఉంది. భారతదేశం గర్వించదగ్గ నటీనటులు, టెక్నీషియన్లతో గ్రాండియర్‌గా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. విశాల్-శేఖర్ మ్యూజిక్ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుంది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్ 27న విడుదల చేయనున్నాం' అని అన్నారు. అర్జున్, శరత్‌కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రాజీవ్ రవి, ఎడిటర్: కోటగిరి వెంకటేశ్వరరావు (చంటి).



'దర్శకుడు' చిత్ర యూనిట్‌తో చిరంజీవి

తొలి ప్రేక్షకుడు మెగాస్టార్..

ప్రేక్షకులందరూ చిరంజీవి సినిమా కోసం ఎదురుచూస్తుంటారు, కానీ ఆయన మాత్రం 'దర్శకుడు' సినిమాకు తొలి ప్రేక్షకుడయ్యారు. అశోక్, ఈషా జంటగా హరిప్రసాద్ దర్శకత్వంలో సుకుమార్ రైటింగ్స్ పతాకంపై సుకుమార్ నిర్మించిన 'దర్శకుడు' చిత్రం ఈ నెల 4న విడుదల కానుంది. ఈ చిత్ర తొలి టికెట్‌ను చిరంజీవి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, "ఈ చిత్ర తొలి టికెట్‌ను నాకు అందించి, సినిమాకు నన్ను తొలి ప్రేక్షకుడిని చేయడం చాలా కొత్తగా, ఆశ్చర్యంగా ఉంది. ఈ సినిమాకి సుకుమార్ వెన్నెముకలా నిలిచారు. ఒక దర్శకుడిగా సుకుమార్ ఉన్నత స్థానంలో ఉండటం నాకు ఆయనలో నచ్చిన విషయం. తను ఓ వైపు కమర్షియల్ సినిమాలు చేస్తూనే మంచి కథాన్వేషణలో మంచి కథలను క్రియేట్ చేసుకుంటూ అటు కమర్షియల్‌గా డబ్బుని, పేరును సంపాదించుకోవచ్చు. కేవలం నేనేమిటి అనకుండా.. ఈ సినిమా ఇండస్ట్రీకి నేనేమిటి అనే కోణం నుంచి ఆలోచిస్తూ రాబోతున్న స్టోరీ రైటర్స్‌ని, దర్శకులను, ఆర్టిస్టులను ప్రోత్సహించడం కోసం సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌ని స్థాపించడం గొప్ప విషయం. ఒక దర్శకుడు ఏంటనేది అతను తెరకెక్కించిన సినిమా టైటిల్స్‌లో మాత్రమే చూస్తాం. కానీ తెరవెనుక దర్శకుడు ఏంటి? అతనిలో ఎన్ని షేడ్స్ ఉంటాయి. ఎన్ని వేరియేషన్స్ ఉంటాయి?, ఎలాంటి ఎగ్జైట్‌మెంట్స్ ఉంటాయనే కోణాలనుంచి కొత్తగా ఈ సినిమాను ఆవిష్కరించారు. దర్శకుడు అంటే లవ్‌స్టోరీతో సినిమాలు చేయడమే కాదు అతని జీవితంలో కూడా ఎలాంటి లవ్‌స్టోరీ ఉంటుందనేది ఈ చిత్రంలో చాలా చక్కగా ఆవిష్కరించారు. నాకు తెలిసి ఇందులో సుకుమార్ లైఫ్‌కి సంబంధించిన విషయమేదో ఉంటుంది. అందుకే ఈ సినిమాను తెరకెక్కించాలని భావించి ఉంటాడనుకుంటున్నా. ఈ సినిమాలో హీరోగా నటించిన అశోక్‌లో మంచి హీరో మెటీరియల్ ఉంది. ఈ చిత్రం 'కుమారి 21 ఎఫ్' కంటే పెద్ద విజయం సాధించాలి' అని అన్నారు.

క్రేజీ కాంబినేషన్..!



అమితాబ్ బచ్చన్, చిరంజీవి

చిరంజీవి నటించబోతున్న తాజా చిత్రం 'ఉయ్యాలవాడ నరసింహారెడ్డి'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. దీంతోపాటు ఈ చిత్రానికి సంబంధించి వినిపిస్తున్న ప్రతి విషయమూ రోజురోజుకు ఆ క్రేజ్‌ను రెట్టింపు చేస్తున్నాయి.
ఈ కోవలోనే ఈ చిత్రానికి ఓ క్రేజీ కాంబినేషన్ సెట్ అయిందనే విషయం ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఈ చిత్రంలోని ఓ కీలక పాత్ర కోసం బాలీవుడ్ బిగ్‌బి అమితాబ్ బచ్చన్‌ని తీసుకునే ఆలోచనలో చిత్ర బృందం ఉందని సమాచారం. ఈ సినిమా విషయమై బిగ్‌బి కూడా నటించేందుకు సుముఖంగా ఉన్నారని తెలుస్తోంది. దీంతో ఈ సినిమాపై అందరిలోనూ మరింత క్యూరియాసిటీ పెరిగింది. అంతేకాకుండా మార్కెట్ పరంగా కూడా ఈ కాంబినేషన్ బాగా వర్కౌట్ అవుతుందని చిత్ర బృందం భావిస్తోందట. సురేందర్‌రెడ్డి దర్శకత్వం వహించబోతున్న ఈ చిత్రంలో మెగాస్టార్ సరసన నయనతార హీరోయిన్‌గా నటించనుండగా, కొణిదెల ప్రొడక్షన్స్ కంపెనీ పతాకంపై రామ్‌చరణ్ నిర్మిస్తున్నారు. ఈ నెలలోనే చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్రం ప్రారంభం కానుందిరీ చిత్రానికి సంబంధించి తాజాగా 'మహావీర' అనే కొత్త టైటిల్ కూడా వినిపించడం ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్ అయ్యింది.

నెంబర్ గేమ్‌ని నమ్మను..

రకుల్ ప్రీత్ సింగ్



'కథానాయికల విషయంలో నెంబర్ గేమ్ అనేదాన్ని నేనస్సలు నమ్మను. బాగా నటించే హీరోయిన్స్ ఉంటే వారిని దృష్టిలో పెట్టుకుని రైటర్స్ పాత్రలు రాయడానికి అవకాశం ఉంటుంది' అని అంటోంది రకుల్ ప్రీత్ సింగ్. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, రకుల్ ప్రీత్ సింగ్, ప్రగ్యా జైశ్వాల్ హీరో,హీరోయిన్లుగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో ద్వారకా క్రియేషన్స్ పతాకంపై మిర్యాల రవీందర్‌రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'జయ జానకి నాయక'. ఈ నెల 11న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో బుధవారం కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్‌తో మీడియా జరిపిన ఇంటర్వ్యూ విశేషాలు..

ఈ సినిమా నేపథ్యం?

- పాత తరం ప్రేమ కథల్లో చాలా కోల్పోవడాలు (శాక్రిపైసెస్) ఉండేవి. ఇప్పుడలాంటివి చాలా తక్కువ. ఈ నేపథ్యంలో రియల్ లవ్ ఎలా ఉంటుందన్నది ఈ చిత్రంలో చూపించారు. ఆ నిజమైన ప్రేమ కోసం కథ ఎలాంటి మలుపులు తిరిగిందనేది తెరపైనే చూడాలి. సినిమా అంతా ఎమోషన్స్‌తో సాగే మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనరే అయినప్పటికీ దర్శకుడు బోయపాటి మార్క్ సినిమా. ఆయన స్టయిల్‌లోనే డిఫరెంట్ ట్రీట్‌మెంట్‌తో, ఆయన సిగ్నేచర్ యాక్షన్‌తో సినిమా ఉంటుంది. అన్ని వర్గాల ప్రేక్షకులను మెస్మరైజ్ చేసేలా ఉంటుంది.

గత చిత్రాలతో పోలిస్తే మీ పాత్రకు ఉన్న ప్రత్యేకత ఏమిటి?

- ఇందులో నా పాత్ర పేరు జానకి. చాలా బబ్లీ, నార్మల్, కాలేజ్ గోయింగ్ గర్ల్, ఫన్నీగా ఉంటుంది. ఓవర్ ఇనీషియేటివ్ తీసుకునే అమ్మాయి. అనుకోకుండా జరిగిన సంఘటనలతో నా లైఫే మారిపోతుంది. ఆ సంఘటనలేంటి?, ఆ సంఘటనలతో కథానాయకుడికి ఉన్న సంబంధం ఏంటనేది సినిమా. నా పాత్రలో రెండు వేరియేషన్స్ ఉంటాయి. నేను ఇప్పటి వరకు నటించిన పాత్రలతో పోల్చితే మోస్ట్ ఎమోషనల్ పాత్ర ఇదే. భావోద్వేగంతో అత్యధికంగా ఫీలయ్యే సన్నివేశాలకు సంబంధించిన షెడ్యూల్ పది రోజులు జరిగితే, ఆ పది రోజులూ నేను డిప్రెషన్‌లోనే ఉన్నాను. ఈ సన్నివేశాలు చేసేటప్పుడు దర్శకుడు బోయపాటి చెప్పినదాన్నే ఫాలో అయ్యాను.

ఈ సినిమా చేయడానికి రీజన్ ఏంటి?

- ఈ సినిమా చేయడానికి ప్రధాన కారణం బోయపాటిగారు. ఆయన చెప్పిన కథకు నేను బాగా ఎగ్జైట్ అయ్యాను. హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ చాలా ఎనర్జిటిక్. సినిమా ప్రారంభంతో పోల్చితే పూర్తయ్యేంత వరకు చాలా పరిణతి చెందారు. డైలాగ్ డెలివరీ, బాడీలాంగ్వేజ్, యాక్టింగ్ ఇలా అన్ని విషయాల్లో ఎవాల్వ్ అయ్యాడు. నేను ఆయనకి ఎలాంటి టిప్స్ ఇవ్వలేదు. ఎందుకంటే నేనేమి యాక్టింగ్ స్కూల్ ఓపెన్ చేయలేదు (నవ్వుతూ).బోయపాటి సార్ సినిమాలు చూస్తే అందులో యాక్టర్స్ ఎవ్వరూ బాగా చేయలేదనే కామెంట్ వినిపించదు. అంత బాగా నటించేలా చేస్తారు.

దర్శకుడు బోయపాటి శ్రీనుతో మీ వర్క్ ఎక్స్‌పీరియన్స్?

- సినిమా ఎలా ఉండాలి?, దానికి ఏం కావాలో దర్శకుడు బోయపాటికి బాగా తెలుసు. ఆయన చాలా కన్విక్షన్ ఉన్న దర్శకుడు. సెట్‌లో ఉన్న ప్రతి ఒక్కరి ప్లస్, మైనస్‌లూ ఆయనకు బాగా తెలుసు. అలాగే నాకు సంబంధించిన బలాలు, బలహీనతలూ ఆయనకు తెలుసు. వాటి గురించి షూటింగ్ టైమ్‌లో చెప్తే నేను కరెక్ట్ చేసుకున్నాను. ఈ సినిమా కంప్లీట్‌గా జానకి పాత్ర చుట్టూ తిరుగుతుంది. ఫ్యామిలీ ఎమోషన్స్‌తో కూడిన సబ్జెక్ట్. అందుకే 'జయ జానకి నాయక' అని టైటిల్ పెట్టారు.

వ్యక్తిగతంగా మీలో ఉన్న ప్లస్‌లు, మైనస్‌లు ఏంటి? ఈ సినిమాలో మిమ్మల్ని హంట్ చేసిన సన్నివేశాలున్నాయా?

- మనం ప్రతిదీ పర్‌ఫెక్ట్‌గా చేస్తామనే అనుకుంటాం. కానీ అందులో బలమేంటో, బలహీనతలేంటో చూసిన ప్రేక్షకులు చెప్పాలి. ఈ చిత్రంలో నన్ను హంట్ చేసిన సన్నివేశాలు చాలా ఉన్నాయి. వాటిని మీలాగే నేనూ ఆడియెన్‌గా సినిమా చూసినప్పుడు ఫీలవుతాను. సన్నివేశాలు చేసేటప్పుడు పాత్రలో లీనమై చేస్తాం కాబట్టి మనకు ఏ సన్నివేశం హత్తుకుంటుందో తెలియదు.

చాలా మంది లైఫ్‌లో జరిగిన ఏదో ప్రమాదాన్నిగాని, చెడునుగాని ఊహించుకుని సాడ్‌గా ఉండేదాన్ని. ఏడ్చే సన్నివేశాల్లో మాత్రం గ్లిజరిన్ వాడాను. గ్లిజరిన్ వాడకుండా ఏడ్చే సందర్భం నా లైఫ్‌లో ఎప్పుడూ రాలేదు. కానీ సినిమాలో 'వదులుకోవాల్సిన ప్రతిసారి ప్రేమనే వదులుకోవాలా..' అనే డైలాగ్ ఉంటుంది. అది నా ఫేవరేట్ డైలాగ్.

ఈమధ్య కాలంలో మీరు బాగా ఎమోషనలైన సందర్భం?

- ప్రత్యేకంగా అలాంటి సందర్భమైతే ఏమీ లేదు. కానీ 'నిన్నుకోరి' సినిమా చూసేటప్పుడు ఏడ్చేశా. పక్కన కూర్చున తమ్ముడు నాకు టిష్యూ పేపర్స్ ఇస్తూనే ఉన్నాడు. సినిమా చూశాక నానికి ఫోన్ చేసి 'ఏడిపించేశావు.. అలా ఎందుకు ఏడిపించావ్.. మీ ఇద్దరు కలవాలి కదా' అని అన్నాను. బేసిక్‌గా నేను హార్డ్ కోర్ రొమాంటిక్. ట్రాజిక్ లవ్‌స్టోరీస్ నచ్చవు. హ్యాపీ ఎండింగ్ లవ్‌స్టోరీలంటే ఇష్టం.

మీరు నెంబర్ వన్ పొజిషన్‌లో ఉన్నారంటున్నారు. దీనిపై మీ కామెంట్?

- నెంబర్ గేమ్‌ను నేనస్సలు నమ్మను. నాకంటే చాలా అనుభవం ఉన్న కథానాయికలు ఎంతో మంది ఉన్నారు. అగ్రస్థానంలో ఉన్నాననే సంగతి గురించి నాకు తెలియదు. తెలుసుకోవాల్సిన అవసరం లేదు. రెండు సినిమాలు విజయం సాధిస్తే 'రకుల్ టాప్‌లో ఉందని, కొత్త వాళ్ళు వస్తే రకుల్‌కి చాలా టఫ్ కాంపిటీషన్ ఉంది, రకుల్‌కి కొత్తవాళ్ళతో భయం' అని రాస్తారు. కాబట్టి వీటిని నేను పట్టించుకోను.

కొత్త కథానాయికలు రావడాన్ని పోటీగా ఫీలవుతుంటారా?

- నేనెప్పుడూ అలా భావించను. బాగా నటించే కథానాయికలు వస్తే మంచి సినిమాలు వస్తాయి. రచయితలు, దర్శకులు కూడా హీరోయిన్స్ కోసం ప్రత్యేకంగా పాత్రలు రాస్తారు. పొటెన్షియల్ స్క్రిప్ట్స్ వస్తాయి. కొత్తవాళ్లు వస్తున్నారని నేను ఇన్‌సెక్యూర్‌గా ఫీలవ్వను. వారిని స్వాగతిస్తా.

తెలుగు సినిమాల గురించి ఎనాలిసిస్ చేస్తే మీకేమనిపిస్తోంది?

- 'బాహుబలి' తర్వాత దేశవ్యాప్తంగా మన తెలుగు పరిశ్రమపై గౌరవం పెరిగింది. ఇక్కడ్నుంచి మంచి సినిమాలు వస్తున్నాయని అందరూ మాట్లాడుకోవడం శుభ పరిణామం. కొత్తరకమైన సినిమాలూ వస్తున్నాయి. అలాగే రాబోయే 'స్పైడర్', 'జయ జానకి నాయక', 'నేనే రాజు నేనే మంత్రి' వంటివన్నీ దేనికదే భిన్నమైన సినిమాలు. 'పెళ్ళిచూపులు' ఎంతటి విజయం సాధించిందో తెలిసిందే. ప్రేక్షకులు కూడా కంటెంట్ పరంగా నవ్యమైన, భిన్నమైన సినిమాలను కోరుకుంటున్నారు.

ప్రస్తుతం మూడు భాషల్లో బిజీగా ఉన్నట్టున్నారు?

- నేను ఏ భాషలో చేసినా నా దృష్టి అంతా సినిమాలపైనే ఉంది. ఎక్కడ మంచి సినిమాలు వస్తే అక్కడ చేస్తున్నాను. నచ్చిన స్క్రిప్ట్స్ చేసుకుంటూ వెళ్తున్నాను. ఎప్పుడూ బిజీగా ఉండటాన్ని నేనిష్టపడతాను. అన్నింటిలోనూ తెలుగు చిత్ర పరిశ్రమ అంటే నాకిష్టం. నేను ముంబయిలో షూటింగ్ చేసినా హైదరాబాద్‌లో జరిగిన షూటింగ్ విశేషాల గురించి అందరితో షేర్ చేసుకుంటాను. నేనెక్కడా ఉన్నా నా మనసు మాత్రం ఇక్కడే ఉంటుంది.

హిందీలో చేస్తున్న 'అయ్యారి' సినిమా గురించి?

నీరజ్ పాండే దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'అయ్యారి' ఇటీవలే లండన్ షూటింగ్ పూర్తి చేసుకుంది. నీరజ్ పాండే దర్శకత్వంలో పనిచేయడం చాలా హ్యాపీగా ఉంది. నిజానికి 2011లోనే ఆయన సినిమాలో నటించాల్సి ఉంది. నా కెరీర్‌లో ఫస్ట్ ఆడిషన్ ఇచ్చింది కూడా ఆయనకే. కానీ ఆ ప్రాజెక్టు వర్కౌట్ కాలేదు. విధి మళ్ళీ ఈ చిత్రంతో పనిచేసే అవకాశం కల్పించింది. నైస్ టీమ్‌తో పనిచేస్తున్నాను.

పవన్‌కళ్యాణ్ సినిమాలో నటించబోతున్నారా?

- ఇంకా సైన్ చేయలేదు. బాలీవుడ్‌లో కూడా కొత్తగా ఏ ప్రాజెక్ట్‌కూ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు. ప్రస్తుతం తమిళంలో కార్తీ సినిమాలో నటిస్తున్నాను. సూర్య హీరోగా సెల్వరాఘవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రంలోనూ నటిస్తున్నాను. కొత్త ప్రాజెక్టుల విషయంలో ప్లానింగ్ అంటూ ఏం లేదు. స్క్రిప్ట్స్ విన్నప్పుడు కలిగిన గట్స్ ఫీలింగ్‌తో ముందుకు వెళ్తున్నా.



తెలంగాణ రాష్ట్ర ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) ఛైర్మెన్ పుస్కూర్ రామ్మోహనరావు, రేణుకరావుల కుమార్తె దేదీప్య వివాహం విష్ణుచరణ్‌తో బుధవారం గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్ సెంటర్‌లో అత్యంత వైభవంగా జరిగింది. తెలంగాణ సీఎం కేసీఆర్, సి.హెచ్.విద్యాసాగర్, తలసాని తదితరులతోపాటు సినీ పరిశ్రమకు చెందిన అతిరథ మహారథులందరూ వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

అలరించే కథతో..



సాయిపల్లవి, దుల్కర్ సల్మాన్

తెలుగు ప్రేక్షకులను 'ఫిదా' చిత్రంతో మెస్మరైజ్ చేసిన సాయిపల్లవి అతి త్వరలోనే 'కలి' చిత్రంతో మరోమారు తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. 'ఓకే బంగారం' ఫేమ్ దుల్కర్ సల్మాన్, 'ఫిదా' ఫేమ్ సాయి పల్లవి జంటగా సమీర్ తాహిర్ దర్శకత్వంలో నటించిన మలయాళ చిత్రం 'కలి'. ఈ సినిమాను అదే పేరుతో డిస్ట్రిబ్యూటర్ డి.వి.కృష్ణస్వామి తెలుగులో విడుదల చేస్తున్నారు.
ఈ చిత్రం గురించి నిర్మాత డి.వి.కృష్ణస్వామి మాట్లాడుతూ, 'అందరినీ అలరించే కథతో రూపొందిన చిత్రమిది. ప్రస్తుతం డబ్బింగ్, మిక్సింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నెల రెండవ వారంలో సినిమా టైటిల్, లోగో విడుదల చేస్తాం. సెప్టెంబర్‌లో సినిమాను విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. పలు ఉత్తమ చిత్రాలకు సంగీతం అందించి జాతీయ స్థాయి ఉత్తమ సంగీత దర్శకుడిగా అవార్డు అందుకున్న గోపీసుందర్ ఈ చిత్రానికి సంగీతం సమకూర్చడం విశేషం. దర్శకుడు సమీర్ తాహిర్ అత్యద్భుతంగా తెరకెక్కించారు. ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరుకుంటున్నా' అని అన్నారు. ఈ చిత్రానికి మాటలు: భాషా శ్రీ, సాహిత్యం: సురేంద్ర కృష్ణ, సంగీతం: గోపీసుందర్, సినిమాటోగ్రఫీ: గిరీష్ గంగాధరన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: దక్షిత్ శ్రీనివాస్, కో ప్రొడ్యూసర్: వి.చంద్రశేఖర్, నిర్మాత: డి.వి.కృష్ణస్వామి.

తరాలు మారినా..



నాగ అన్వేష్, సాగర్‌లతో 'బంగారి బాలరాజు' చిత్రయూనిట్ సభ్యులు

కోటేంద్ర దుద్యాల దర్శకత్వంలో నంది క్రియేషన్స్ పతాకంపై కె.ఎం.డి. రఫీ నిర్మిస్తున్న చిత్రం 'బంగారి బాలరాజు'. 'లవర్ ఈజ్ బ్యాక్' అనేది ట్యాగ్‌లైన్. నూతన నటీనటులతో తెరకెక్కుతున్న ఈ చిత్ర ప్రారంభోత్సవం బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి సాగర్ క్లాప్‌నివ్వగా, హీరో నాగ అన్వేష్ కెమెరా స్విచాన్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు కోటేంద్ర దుద్యాల మాట్లాడుతూ, 'గత 14ఏండ్లుగా ఇండ్రస్టీలో ఆర్టిస్టుగా, ఫొటోగ్రాఫర్‌గా, అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిస్తున్నాను. దర్శకుడిని కావాలనే నా కల, కసి, కష్టం ఈ చిత్రంతో తీరడంతో చాలా ఆనందంగా ఉంది. ఈ అవకాశం ఇచ్చిన వెంకీ చౌదరి, మహ్మద్ రఫీలకు థ్యాంక్స్. టీజర్ ద్వారా ఇందులో నటించే హీరో, హీరోయిన్లను పరిచయం చేస్తాం. దశాబ్దాలు మారినా, శతాబ్దాలు మారినా ప్రేమ మారదని, ప్రేమికులు మాత్రమే మారుతుంటారని తెలిపే చిత్రమిది. చరిత్రలో రోమియో-జూలియట్, సలీం-అనార్కలి, దేవదాసు-పార్వతి, లైలా-మజ్ను ప్రేమను త్యాగం చేసి చరిత్రలో నిలిచారు. 'బంగారి-బాలరాజు' కూడా తమ ప్రేమను త్యాగం చేసి చరిత్రలో నిలిచిపోతారా? లేక ప్రేమను గెలుచుకుని చరిత్ర సృష్టిస్తారా అనేదే ఈ చిత్ర ఇతివృత్తం. సినిమాను అందరూ విజయవంతం చేయాలి' అని అన్నారు. 'ఇదొక మంచి లవ్‌స్టోరీ. స్క్రిప్ట్, దర్శకుడిపై నమ్మకంతో సినిమాను నిర్మిస్తున్నాను. అందరిని ఆకట్టుకునేలా మా సినిమా ఉంటుంది' అని నిర్మాత మహ్మద్ రఫీ తెలిపారు.

ఫిల్మ్ జర్నలిస్ట్‌ల ఔదార్యం..



నారాయణరాజు, రమేష్ ప్రసాద్, మాధురి తదితరులు

'తోటివారి కష్టాలకు స్పందించే మంచి గుణం కలిగిన ఫిల్మ్ జర్నలిస్ట్‌లకు నా అభినందనలు' అని నిర్మాత అక్కినేని రమేష్ ప్రసాద్ అన్నారు. ప్రసాద్ ల్యాబ్స్‌లో పనిచేస్తున్న దేవులపల్లి వెంకటేశ్వర ప్రసాద్ (41) ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. లంగ్ ఇన్‌ఫెక్షన్‌తో మృతి చెందిన ఆయనకు భార్య మాధురి, ఇద్దరు పిల్లలున్నారు. వెంకటేశ్వరప్రసాద్ ఆకస్మిక మృతికి కలత చెందిన ఫిల్మ్ జర్నలిస్ట్‌లు తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ (టిఎఫ్‌జెఎ) ఆధ్వర్యంలో ఆయన కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించాలని భావించి, బుధవారం రమేష్ ప్రసాద్ చేతుల మీదుగా ఆయన భార్య మాధురికి 71వేల రూపాయల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్‌ప్రసాద్ మాట్లాడుతూ,'ఫిల్మ్ జర్నలిస్‌ల ఔదార్యం స్ఫూర్తిదాయకం. ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు ముందుకొచ్చి మరికొంత మందికి మార్గదర్శకంగా నిలవడం అభినందనీయం' అని చెప్పారు.
ఈ కార్యక్రమంలో టిఎఫ్‌జెఎ అధ్యక్షులు నారాయణరాజు, కార్యదర్శి గోరంట్ల సత్యం, పసుపులేటి రామారావు, సినీ వినోదం రాంబాబు, ఇన్‌కేబుల్ శ్రీను, సాంబశివరావు, రాధాకృష్ణ, శ్రీకాంత్, టి.ఎస్.ఎన్.మూర్తి, భారత్ టుడే రెడ్డి, మారన్న, టెన్‌టివి సతీష్, దెయ్యాల అశోక్, సుజన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సెన్సెక్స్ ▼ 98	నిఫ్టీ ▼ 34	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10గ్రా)	వెండి (కేజీ)	కోడిగుడ్లు
32,476	10,081	63.69	రూ. 29, 251	రూ. 41,700	హైదరాబాద్ 320, ఒక్కగుడ్డుకు 3.80, వరంగల్ 322, విజయవాడ 320, చెన్నై 355, ముంబయి 365






ఎస్ఎంఈ రంగంపై గోడాడీ దృష్టి

నవతెలంగాణ, వాణిజ్య విభాగం: ఇంటర్నెట్ డొమైన్లను విక్రయించే గోడాడీ ప్రధానంగా చిన్న, మధ్య తరహా వ్యాపారాల వృద్ధిపై దృష్టి కేంద్రీకరిస్తున్న ట్టు పేర్కొంది. భారత్‌లో ఈరంగంలోని వ్యాపారులకు ఆన్‌లైన్ వేదికలను అందించే ఉద్దేశ్యంతో పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని గోడాడీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అంద్ర్యూ లోహ్ హా కీ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం భారత్‌లో 5 కోట్ల పైగా చిన్న పరిశ్రమలున్నాయన్నారు. ఇవి ఇప్పటికీ ఆన్‌లైన్‌కు దూరంగా ఉన్నాయన్నారు.

ప్రస్తుత ఇంటర్నెట్ యుగంలో ఇవి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి డొమైన్ల పై అవగాహన కల్పిస్తున్నామన్నారు. భారత్‌లో తాము వ్యాపారం ప్రారంభించి అయిదేండ్లు అవుతుందున్నారు. ఈ రంగంలో 35 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉన్నామన్నారు. గోడాడీ ఇండియా వైస్ ప్రెసిడెంట్ నిఖిల్ అరోరా మాట్లాడుతూ 12 మిలియన్ల ఎస్ఎంఈలు మాత్రమే టెక్నాలజీని ఉపయోగించుకుంటున్నాయన్నారు. తాము 7,50,000 చిన్న వ్యాపారాలకు సేవలందిస్తున్నామన్నారు.

వడ్డీ రేట్ల కోత.. మార్కెట్లకు వాత

- 98 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్



చెన్నై : ఆర్‌బీఐ ద్వైమాసిక ద్రవ్య విధానం సమీక్ష ప్రకటన మార్కెట్లకు భరోసా ఇవ్వలేకపోయింది. కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గిస్తూ ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయాన్ని మదుపర్లు లైట్ తీసుకున్నట్టుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. వీటికితోడు నిన్నటి వరకు సరికొత్త రికార్డులను నమోదు చేసిన స్టాక్‌మార్కెట్లు.. బుధవారం నాడు ప్రధాన సూచీలు దిగువకు జారాయి. ఆయిల్ ధరలు తగ్గడంతో యూరోపియన్ మార్కెట్లు పడిపోగా, ఏషియన్ మార్కెట్లు మిశ్రమ లాభాలను నమోదు చేశాయి. ఈ నేపథ్యంలో బీఎస్ఈలో సెన్సెక్స్ 98.43పాయింట్లు తగ్గి 32,476.74 వద్ద ముగిసింది.

ఎన్ఎస్ఈ నిఫ్టీ 33.15 పాయింట్లు నష్టపోయి 10,081.50 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ రంగాల వారిగా ఐటీ సూచీ 088శాతం, క్యాపిటల్ గూడ్స్ 0.83శాతం, ఎఫ్ఎంసీజీ 0.76శాతం, టెక్ 0.75శాతం చొప్పున పడిపోయాయి. మరోవైపు కన్స్యూమర్ డురేబుల్స్ సూచీ 1.12శాతం, విద్యుత్ 0.11శాతం చొప్పున పెరిగాయి. ఎన్‌టీపీసీ 4.06శాతం, హీరో మోటో కార్ప్ 2.12శాతం, అదానీ ఫోర్ట్స్ 2.08శాతం, లూపిన్ 1.6శాతం, రిలయన్స్ 1.59శాతం చొప్పున అత్యధిక లాభాలు పొందిన వాటిలో ముందు వరుసలో నిలిచాయి. మరోవైపు సన్‌ఫార్మా 1.95శాతం, డాక్టర్ రెడ్డీస్ 1.93శాతం, టాటామోటార్స్ 1.66శాతం, కోటక్ బ్యాంకు 1.39శాతం, టీసీఎస్ 1.3శాతం చొప్పున భారీగా నష్టపోయిన వాటిలో ముందున్నాయి.

రుణాలు మరింత తగ్గే అవకాశం..

- కీలక వడ్డీ రేట్లపై పావుశాతం తగ్గింపు
- ఏడేండ్ల కనిష్టానికి రెపో రేటు
- ఆర్‌బీఐ పరపతి సమీక్ష నిర్ణయం

ముంబయి : రుణ గ్రహీతలకు శుభవార్త. అప్పులపై వడ్డీ రేట్లు మరింత దిగిరానున్నాయి. అంచనాలకు అనుగుణంగానే రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక వడ్డీ రేట్లను పావు శాతం తగ్గించింది. రెపోరేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 6 శాతంగా నిర్ణయించింది. దీంతో ఆరున్నరేండ్ల కనిష్టానికి వడ్డీ రేట్లు తగ్గాయి. 2010 నవంబర్‌లో ఈ స్థాయి వడ్డీరేట్లు అమల్లో ఉన్నాయి. రిజర్వు బ్యాంకు గవర్నర్ ఉర్జిత్ పటేల్ అధ్యక్షతన రెండు రోజుల పాటు జరిగిన ఆర్‌బీఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశంలో మెజారిటీ సభ్యులు పావు శాతం వడ్డీ రేట్ల తగ్గింపునకు అనుకూలంగా వ్యవహరించారు. ఎంపీసీ సభ్యులు చేతన్ ఘటె, పమి దువా, విరాల్ వి ఆచార్య, ఉర్జిత్ పటేల్ 25 బేసిస్ పాయింట్ల వడ్డీ రేట్ల తగ్గింపునకు ఓటు వేశారు. కాగా రవీంద్రా హెచ్ రెపోరేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించాలని కోరారు. మరో సభ్యుడు మైఖెల్ డెబ్రత పత్రా వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచాలని పేర్కొన్నారు. వడ్డీ రేట్లను తగ్గించడం ద్వారా గృహ, వాహన, రిటైల్ రుణాలకు డిమాండ్ పెరగనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆర్‌బీఐ సానుకూల నిర్ణయం తీసుకున్నప్పటికీ దేశీయ స్టాక్ మార్కెట్లలో విశ్వాసం నింపలేకపోవడం గమనార్హం.

సానుకూల అంశాలు..

వడ్డీ రేట్ల తగ్గింపునకు వివిధ కారణాలు దోహదం చేశాయి. ముఖ్యంగా గత కొంత కాలంగా రుణాల మంజూరు వృద్ధి రేటులో స్తబ్దత చోటు చేసుకుంది. వృద్ధి రేటులో తగ్గుదల, ద్రవ్యోల్బణం దిగిరావడం ప్రధాన కారకంగా ఉన్నాయి. ఈ ఏడాది జూన్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ ఐదేళ్ల కనిష్టానికి పడిపోయింది. ఏడాదికి ఏడాదితో పోల్చితే రుణాల మంజూరులో కేవలం 6 శాతం పెరుగుదల నమోదయ్యింది. వడ్డీ రేట్లను తగ్గించడం ద్వారా రుణపరపతి పెంచడం, వృద్ధి రేటుకు మద్దతునివ్వాలని ఆర్‌బీఐ ప్రధాన యోచనగా ఉంది. పెద్ద నోట్ల రద్దు, కొనుగోలు శక్తి పడిపోవడం, పారిశ్రామికోత్పత్తి పతనం తదితర పరిణామాలతో ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు కూడా మందగించింది. ఒకప్పుడు 9.1 శాతంగా నమోదైన వృద్ధి రేటు 2016-17 చివరి త్రైమాసికంలో ఇది ఏకంగా 6.1 శాతానికి పడిపోయింది. పారిశ్రామికోత్పత్తి ఎనిమిది సంవత్సరాల కనిష్టానికి క్షీణించింది. జులైలో ప్రజల కొనుగోలు శక్తి కూడా 47.9 పాయింట్లకు తగ్గింది.



కోతలకు ఇంకా ఛాన్స్ : ఉర్జిత్ పటేల్

తగ్గుతున్న ద్రవ్యోల్బణం, సానుకూలంగా జీఎస్టీ అమలు వల్ల మరింత వడ్డీ రేట్ల తగ్గింపునకు అవకాశాలు ఉన్నాయని ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ పేర్కొన్నారు. ఎంపీసీ సమావేశం అనంతరం బుధవారం గవర్నర్ మీడియాతో మాట్లాడుతూ ద్రవ్యోల్బణాన్ని నాలుగు శాతానికి పరిమితం చేయాలని ఆర్‌బీఐ నిర్దేశించుకుంద న్నారు. దీంతో వృద్ధి రేటుకు మద్ద తునివ్వాలని భావిస్తున్నామన్నారు. గత మూడు మాసాలుగా అహారం, ఇంధనం ఉత్పత్తులు మినహా ద్రవ్యో ల్బణం సూచీ తగ్గుముఖం పట్టింద న్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో ద్రవ్యోల్బణం 2.0-3.5 శాతం, ద్వితీయార్థంలో 3.5-4.5 శాతం మధ్య నమోదయ్యే అవకాశాలున్నాయన్నారు. చరిత్రలోనే అతి కనిష్ట స్థాయిలో ద్రవ్యోల్బణం నమోదవుతుందన్నారు. కొన్ని విభాగాల్లో బ్యాంకులు చౌక రుణాలు అందించడానికి అవకాశాలు ఉన్నాయని ఉర్జిత్ పేర్కొన్నారు. నగదు ప్రవాహం సాధారణ స్థితికి చేరిందని ఆర్‌బిఐ డిప్యూటీ గవర్నర్ విరాల్ ఆచార్యా పేర్కొన్నారు. బ్యాంకులు మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధారిత వడ్డీ రేట్లు (ఎంసీఎల్ఆర్)పై అనుసరిస్తున్న విధానంపై సెప్టెంబర్‌తో ఒక నివేదిక ఇవ్వనున్నామన్నారు.

గృహ రుణాలు చౌక..

ఆర్‌బీఐ కీలక వడ్డీరేటును పావు శాతం తగ్గించడంతో గృహ రుణాలపై వడ్డీ రేటు తగ్గనుంది. ఉదాహరణకు ఆర్‌బీఐ 25 బేసిస్ పాయింట్లు తగ్గించిన వడ్డీ వల్ల పదేళ్ల గడువు కలిగిన రూ.25లక్షల గృహ రుణంపై వాయిదా చెల్లింపులో రూ.333 మేర తగ్గనుందని అంచనా. పదేళ్ల కాలంలో దాదాపుగా వడ్డీపై మొత్తం పొదుపు రూ.39,992గా ఉండనుంది. పదేళ్ల గడువు కలిగిన సగటు లక్ష రూపాయల రుణంపై ఏడాదికి వడ్డీ రూ.1600 మేర తగ్గనుంది. అయితే ఆర్‌బిఐ తగ్గించిన వడ్డీ రేట్లను బ్యాంకులు అమల్లోకి తీసుకొస్తేనే ఈ అవకాశం ఉంటుంది.

రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ద్వైమాసిక పరపతి విధాన సమీక్ష.

ముఖ్యాంశాలు..

- రెపోరేటు 0.25 శాతం తగ్గించి 6 శాతంగా నిర్ణయం.
- రివర్స్ రెపో రేటు 0.25 శాతం తగ్గింపు, 5.75 శాతానికి చేరిక.
- ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉంది. అయినా 4 శాతానికి నియంత్రించేలా చర్యలు.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.3% వృద్ధి రేటు అంచనా.
- క్రితం జులై 28 నాటికి విదేశీ మారకం నిల్వలు 392.9 బిలియన్ డాలర్లు.
- బడా మొండి బాకీల పరిష్కారానికి ప్రభుత్వం, ఆర్‌బీఐ కృషి.
- పెట్టుబడుల్లో పునరుత్తేజం అవసరం.
- మౌలిక వసతుల ప్రాజెక్టుల అవాంతరాలు తొలగించడం ద్వారా పెట్టుబడులకు మద్దతు.
- తదుపరి ఎంపీసీ మీటింగ్ 2017 అక్టోబర్ 3, 4న.

పీఎన్‌బీ ఫలితాలు భేష్

న్యూఢిల్లీ: మొండిబాకీలకు కేటాయింపులు తగ్గడంతో ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంకు ఆకర్షణియమైన ఫలితాలను వెల్లడించింది. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో పీఎన్‌బీ నికర లాభం 12.09శాతం వృద్ధితో రూ.343.40 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే సమయంలో నికర లాభం రూ.306.36 కోట్లుగా ఉంది. ఈ మూడు నెలల కాలంలో బ్యాంకు మొత్తం ఆదాయం 7.36శాతం వృద్ధితో రూ.13,475.41 కోట్ల నుంచి రూ.14,468.14 కోట్లకు పెరిగాయి. స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) 13.75శాతం నుంచి 13.66శాతం తగ్గుదల నమోదైంది. ఇదే సమయంలో నికర ఎన్‌పీఏలు కూడా 9.16శాతం నుంచి 8.67శాతానికి పడిపోయాయి. ఈ ఫలితాల నేపథ్యంలో బుధవారం దేశీయ స్టాక్ మార్కెట్లో పీఎన్‌బీ షేర్లు 3శాతం పెరిగాయి.

50% ఉత్పత్తిలో డాటావిండ్ కోత!

- ఉద్యోగుల తొలగింపు.. ఆందోళన
- లేబర్ కమిషన్‌ను ఆశ్రయించిన కార్మికులు

హైదరాబాద్ : ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీ డాటావిండ్ ఉద్యోగుల తొలగింపు తీవ్ర వివాదస్పదమైంది. డాటావిండ్ అమ్మకాలు పడిపోవడంతో సంస్థ తమ హైదరాబాద్ యూనిట్‌లో 50శాతం ఉత్పత్తిలో కోత విధించిందని ఆరోపిస్తూ ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. దాదాపు 200 మంది ఉద్యోగులు తెలంగాణ జాయింట్ లేబర్ కమిషనర్ ఆర్ చంద్రశేఖరన్ కలిశారు. తమకు న్యాయం చేయాల్సిందిగా కోరుతూ వారు పిటిషన్ దాఖలు చేశారని ఆయన పీటీఐకి చెప్పారు. కార్మికులు తొలగింపుపై పిటిషన్ అందిందని.. త్వరలోనే సంస్థ నుంచి వివరణ తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. ఈ అంశంపై కంపెనీని సంప్రదించినప్పుడు సంస్థ ఇందుకు భిన్నంగా స్పందించినట్టుగా తెలుస్తోంది. హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో పనిచేస్తున్న కొంతమంది కార్మికులు తమ ఆఫీసును ధ్వంసం చేశారని కంపెనీ ఆరోపించింది. అయితే విమానాశ్రయ విస్తరణలో భాగంగా జీఎంఆర్‌కు కొంత స్థలం అవసరమైందని, ఈ తరుణంలో సికింద్రాబాద్‌లో మరో కొత్త ఆఫీసును ప్రారంభించే యోచనలో ఉన్నామని ఉద్యోగులు చెప్పామని సంస్థ చెబుతుంది. ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు శంషాబాద్ చుట్టూ ప్రాంతం వారే కావడంతో వారు ఆందోళన చెందినట్టుగా కంపెనీ తెలిపింది. ఈ తరలింపు ఇష్టంలేని కొందరు తమపై ఫిర్యాదు చేసినట్టుగా వివరించింది. అందుకే వారిని తొలగించినట్టు చెప్పింది. ఉత్పత్తి 50శాతం క్షీణించిందని.. హైదరాబాద్ యూనిట్‌ను మూసివేయటం లేదని స్పష్టం చేసింది. ఈ కేంద్రాన్ని ప్లాంట్ భాగాల ఎగుమతి కోసం ఉండగా, అలాగే అమృత్‌సర్ యూనిట్‌లో ఉత్పత్తిని యథావిధిగా కొనసాగిస్తున్నామని తెలిపింది. 2017 ఆర్థిక సంవత్సరం చివరి రెండు త్రైమాసికాల్లో కంపెనీ అమ్మకాలు భారీగా తగ్గాయని డాటావిండ్ సీఈవో సునీత్ సింగ్ తులి పేర్కొన్నారు.

8 నుంచి ఐసెట్ తుదివిడత కౌన్సెలింగ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఐసెట్ తుదివిడత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను సాంకేతిక విద్యాశాఖ విడుదల చేసింది. ఈనెల 8 నుంచి ఐసెట్ తుదివిడత కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని ప్రవేశాల కన్వీనర్ ఏ వాణీప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న ధ్రువపత్రాల పరిశీలన చేపడతామని పేర్కొన్నారు. ఈనెల 8,9 తేదీల్లో అభ్యర్థులు వెబ్‌ఆప్షన్లు నమోదు చేయాలని తెలిపారు. ఈనెల 11న సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.

గురుకుల విద్యా సంస్థల్లో మహిళా సిబ్బంది నియాకాలపై స్టే ఎత్తివేత

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ గురుకుల విద్యా సంస్థల్లోని బోధన, బోధ నేతర పోస్టులు మొత్తం మహిళలతో భర్తీపై సింగిల్ జడ్జి ఇచ్చిన స్టే ఉత్తర్వులను హైకోర్టు డివిజన్ బెంచ్ రద్దు చేసింది. నియామకాలు కొనసాగించవచ్చునని, అయితే అవన్నీ తమ తీర్పునకు లోబడి ఉండాలని న్యాయమూర్తులు జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్‌బెంచ్ స్పష్టం చేసింది. 2016 జూన్ 4న వచ్చిన జీవో 1274 ప్రకారం ఖాళీ అయిన పోస్టులన్నీ మహిళలతో నియమించాలనే నిర్ణయాన్ని వరంగల్ జిల్లా నగరం గ్రామానికి చెందిన సత్యానా రాయణ హైకోర్టులో ప్రశ్నించారు. జీవో ప్రకారం గురుకుల విద్యా సంస్థలు సిబ్బం ది నియామక నిబంధనల్ని మార్పు చేయలేదన్న ఆయన వాదన తర్వాత సింగిల్ జడ్జి గత నెల 19న టీఎస్‌పీఎస్సీ చర్యలపై స్టే ఆదేశాలు జారీ చేశారు. దీనిపై సర్కార్ అప్పీల్ చేసిన వ్యాజ్యంపై వాదనలకు సమయం కావాలని పిటిషనర్ కోర గా అందుకు బెంచ్ అనుమతి ఇవ్వలేదు. డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్లు, ఇతర పోస్టుల భర్తీపై రెండు రోజుల క్రితం జారీ చేసిన మధ్యంతర ఆదేశాలే ఇక్కడా అమలులో ఉంటాయని బెంచ్ మధ్యంతర ఆదేశాల్లో స్పష్టం చేస్తూ విచారణ 9కి వాయిదా వేసింది.

త్వరలో గురుకులాల రాతపరీక్షల షెడ్యూల్ : టీఎస్‌పీఎస్సీ

త్వరలోనే వివిధ గురుకులాల్లో ప్రకటించిన పోస్టులకు వాయిదా పడిన రాతపరీక్షల షెడ్యూల్ విడుదల చేస్తామని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కార్యదర్శి ఎ వాణీప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాలికల గురుకులాల్లో పోస్టులకు మహిళలకు కేటాయిస్తూ విడుదల చేసిన 1274 జీవోపై సింగిల్ బెంచ్ విధించిన స్టేను హైకోర్టు డివిజన్ బెంచ్ ఎత్తివేసిన విషయం తెలిసిందే. రాతపరీక్షలను తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

విద్యార్థుల నుంచి రూ.కోటిన్నర వసూలు

- విజిటింగ్ వీసాతో మోసపోయిన విద్యార్థులు
- మాల్దీవుల్లోనే 20 మంది
- పిల్లలను దేశానికి రప్పించాలని తల్లిదండ్రుల ధర్నా




నవతెలంగాణ - చాదర్‌ఘాట్

హోటల్ మేనేజ్‌మెంట్ విద్య పూర్తిచేసిన వారికి మాల్దీవుల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని దిల్‌సుఖ్‌నగర్‌లోని ఆర్యన్‌కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ యాజమాన్యం మోసానికి పాల్పడింది. దీంతో బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం కళాశాల వద్ద ఆందోళన చేపట్టి కళాశాల సామాగ్రిని ధ్వంసం చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ఆర్యన్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తిచేసిన విద్యార్థులకు మాల్దీవులలో హోటల్ రంగంలో ఉపాధి అవకాశాలు ఉన్నాయని, నెలకు రూ.70 వేల నుంచి లక్ష వరకు సంపాదించొచ్చని మాయమాటలు చెప్పాడు. మాల్దీవులకు వెళ్లాలంటే ఒక్కొక్కరికి రూ.4.25 లక్షలు ఖర్చవుతుందని చెప్పాడు. రెండేండ్లు పనిచేసుకునేందుకు అనుమతి లభిస్తుందని, మూడు నెలల శిక్షణ కూడా ఉంటుందని నమ్మించాడు. శిక్షణా కాలంలో కూడా జీతం వస్తుందని చెప్పాడు. దీంతో 30 మంది విద్యార్థులు తమ జీవితాలు బాగుపడతాయని తల్లిదండ్రులపై ఒత్తిడి చేసి డబ్బు కట్టారు. దీంతో కళాశాల ప్రిన్సిపాల్ మొదటి విడతలో జూన్ 23న 18 మందిని, జులై 4న 12 మందిని మాల్దీవులకు పంపించాడు. మాల్దీవులకు వెళ్లే ముందు విద్యార్థులు వీసా గురించి అడిగితే చెన్నైలో అందచేస్తామని, టికెట్లు బుక్ చేశామని చెప్పాడు. చెన్నై విమానాశ్రయంలో వీసా చూసుకోగా విజిటింగ్ అని ఉంది. విద్యార్థులు వెంటనే ప్రశ్నిస్తే అక్కడికి వెళ్లిన తర్వాత పనికి సంబంధించిన వీసా లభిస్తుందని నమ్మించాడు. విద్యార్థులు మాల్దీవులకు వెళ్లిన తర్వాత ఓ హోటల్‌లో వసతి కల్పించారు. ఆ తర్వాత మోసపోయామనే విషయం విద్యార్థులకు అర్థమైంది. హోటల్‌లో ఉండేందుకు, భోజనానికి డబ్బులు చెల్లించాలని హోటల్ యాజమాన్యం ఒత్తిడి చేయడంతో ప్రిన్సిపాల్ నారాయణరెడ్డికి ఫోన్‌చేశారు. నారాయణరెడ్డి 'మీకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా హోటల్ యాజమాన్యంతో మాట్లాడతా. వసతికి, భోజనానికి అయ్యే ఖర్చులు పంపిస్తా' అని నమ్మించాడు. దీంతో విద్యార్థులు తమ వద్ద ఉన్న డబ్బులతో భోజనం చేస్తూ అవస్థలు పడ్డారు. కొంతమంది విద్యార్థులు మోసపోయిన సంఘటనను తల్లిదండ్రులకు చెప్పుకొని బోరున విలపించారు. తినేందుకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నామని, మమ్మల్ని ఇంటికి రప్పించాలని వేడుకున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డిని కలిసి 'మా పిల్లలు అక్కడ తిండికోసం డబ్బులులేక ఇబ్బందులు పడుతున్నారు, మా పిల్లలను వెంటనే ఇక్కడికి రప్పించాలి, మా డబ్బులు మాకు చెల్లించాలి అని' కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ప్రిన్సిపాల్ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పి పంపించాడు కానీ పని జరగలేదు. దీంతో తల్లిదండ్రులు బుధవారం కళాశాల వద్ద ఆందోళన నిర్వహించి సామాగ్రిని ధ్వంసం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ పిల్లలను ఇండియాకు తీసుకురావాలని, తమ డబ్బులు ఇప్పించాలని, మోసం చేసిన నారాయణరెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

ఇండ్లకు చేరిన 10 మంది విద్యార్థులు..

30 మంది విద్యార్థుల్లో 10 మంది విద్యార్థులు తమ ఇండ్లకు చేరుకోగా, ఇంకా 20 మంది విద్యార్థులు హోటల్‌లో డబ్బులులేక బందీలుగా ఉన్నారు. అంతేకాకుండా మరో నలుగురిని సింగపూర్‌కు పంపిస్తానని నారాయణరెడ్డి రూ.16 లక్షలు వసూలు చేశాడు.

మంత్రి కేటీఆర్ సానుకూలంగా స్పందించారు : కార్పొరేటర్ సునరితారెడ్డి

విద్యార్థులు మోసపోయి మాల్దీవుల్లో చిక్కుకున్న విషయాన్ని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లాం. మంత్రి విదేశాంగ శాఖ అధికారులతో మాట్లాడి విద్యార్థులను ఇండియాకు తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తల్లిదండ్రులు ఆందోళన చెందొద్దు. కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకునేలా కృషి చేస్తాం.

సింగపూర్‌కు పంపిస్తానని రూ.16 లక్షలు వసూలు : మహేందర్

ఆర్యన్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ పూర్తిచేశాను. అప్రెంటీస్ గోవాలో పూర్తిచేశాను. సింగపూర్‌లో ఉద్యోగావకాశాలు ఉన్నాయని అక్కడికి వెళ్లేందుకు రూ.4 లక్షలు ఖర్చవుతుందని, నలుగురి వద్ద రూ.16 లక్షలు వసూలు చేశారు.

మాల్దీవుల్లో అవస్థలు పడ్డాం : ప్రతాప్‌రెడ్డి

మాల్దీవుల్లో ఉండేందుకు చాలా అవస్థలు పడ్డాం. తినేందుకు డబ్బులు లేవు. ప్రిన్సిపాల్‌కు ఫోన్‌చేసినా పట్టించుకోలేదు. మా స్నేహితులు హోటల్‌లో బందీలుగా ఉన్నారు. మేము వెళ్లి డబ్బులు పంపిస్తామంటే నాతోపాటు అనూన్‌ను వదలిపెట్టారు. అక్కడ 20 మంది ఉన్నారు. వారి పాసుపోర్టులు హోటల్ యాజమాన్యం వద్ద ఉన్నాయి.

కొలిక్కి వచ్చిన కార్పొరేషన్‌ల విభజన?

షీలాభీడే కమిటీ సమావేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర విభజనలో అత్యంత కీలకమైన కార్పొరేషన్ల విభజన ఒక కొలిక్కి వచ్చినట్టు తెలిసింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు 60 శాతం,తెలంగాణకు 40 శాతం కార్పొరేషన్లను విభజించాలని షీలాభీడే కమిటి నిర్ణయించినట్టు సమాచారం.

ఇంటర్ అఫిలియేషన్లకు డెడ్‌లైన్: అశోక్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రయివేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీల అఫిలియేషన్లకు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ అశోక్ డెడ్‌లైన్ విధించారు. ఈనెల 10వ తేదీనాటికి అన్ని కాలేజీలూ అనుబంధ గుర్తింపు పొందాలని ఆదేశించారు. లేని కాలేజీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్‌లోని ఇంటర్‌బోర్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 1,600 ప్రయివేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీలు ఆన్‌లైన్‌లో అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్నాయని చెప్పారు. వాటిలో 1,205 కాలేజీలకు గుర్తింపు వచ్చిందన్నారు. ఇంకా 395 ప్రయివేటు, కార్పొరేట్ కాలేజీలకు గుర్తింపు రావాల్సి ఉందని అన్నారు. రిజిస్టర్ లీజు డీడ్, ఎఫ్‌డీఆర్, సిబ్బంది, ల్యాబ్, ఆటస్థలం, శానిటేషన్, స్ట్రక్చరల్ సౌండ్, ఫైర్‌సేఫ్టీ సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో సమర్పించాలని కోరారు. అఫిలియేషన్ల కోసం ముడుపులు అధికారులు తీసుకుంటున్నారని వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. అవన్నీ నిరాధార ఆరోపణలని అన్నారు. నిబంధనలు పాటించని 29 శ్రీచైతన్య, నారాయణ కాలేజీలపై రూ.1.69 కోట్లు జరిమానా విధించామని చెప్పారు. ఇందులో 13 నారాయణ కాలేజీలపై రూ.62.72 లక్షలు, 16 శ్రీచైతన్య కాలేజీలపై రూ.1.04 కోట్లు జరిమానా వేశామన్నారు. జరిమానా చెల్లిస్తేనే అనుబంధ గుర్తింపు వస్తుందని చెప్పారు. షెడ్లలో ఉన్న కాలేజీలకు ఈ ఏడాది వరకు మినహాయింపు ఇచ్చామన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో పక్కా భవనాలుండాలని అన్నారు.

ఇంత జరుగుతున్నా.. మౌనమేల.?

- 'హిమాన్షు' వ్యవహారంపై సీఎంకు వామపక్షాల ప్రశ్న
- కేటీఆర్‌పై చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలి
- ఎన్నికల కమిషనర్‌కు వినతిపత్రం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్ బ్యూరో

మంత్రి కేటీఆర్ డైరెక్టర్‌గా ఉన్న హిమాన్షు మోటార్ల కంపెనీ వ్యవహారంపై రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నా ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందుకు పట్టించుకోవటం లేదని వామపక్ష పార్టీల నేతలు ప్రశ్నించారు. ఆయన మౌనం వెనుక మర్మమేంటని అన్నారు. చట్టబద్ధంగా ఎన్నికై చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్న కేటీఆర్‌పై తక్షణం చర్యలు తీసుకోవాలని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ భన్వర్‌లాల్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సచివాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... కేటీఆర్‌కు ఏ మాత్రం నైతికత ఉన్నా తక్షణం తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో సీఎం తక్షణం స్పందించాలని కోరారు. కేటీఆర్ అనే ఆయన కేవలం కేసీఆర్ మంత్రివర్గంలో ఒక ప్రధానశాఖకే బాధ్యుడు కాదు.. స్వయానా ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి కొడుకు... అందువల్ల సీఎం జోక్యం చేసుకోవాలి...' అని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలోను, అటు తర్వాత ఎన్నికలప్పుడు స్వచ్ఛ రాజకీయాల గురించి, సచ్ఛీలత గురించి, నీతి, నియమాలు, ప్రజాస్వామ్యం గురించి పదేపదే చెప్పిన ముఖ్యమంత్రి.. ఇప్పుడు కేటీఆర్ వ్యవహారంలో ఎందుకు నోరు మెదపటం లేదని ఎద్దేవా చేశారు.

తాము ఎన్నికల సంఘానికి సమర్పించిన ఆధారాలపై మాట్లాడాలని సవాల్ విసిరారు. హిమాన్షు మోటార్ల వ్యవహారంపై ఎన్నికల కమిషనర్‌కు సవివరమైన ఆధారాలను అందజేశామని తెలిపారు. ఈ అంశంపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీనిచ్చారని చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లేపల్లి ఆదిరెడ్డి మాట్లాడుతూ... టీఆర్ఎస్ ఎన్నికల ప్రణాళికలో ఎలాంటి అవినీతి లేకుండా రాష్ట్రాన్ని పరిపాలిస్తామంటూ ప్రజలకు హామీనిచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు అందుకు విరుద్ధంగా కేటీఆర్ చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నర్సింహారావు, జి.ఝూన్సీ (సీపీఐ ఎంఎల్-న్యూడెమోక్రసీ), జానకిరాములు (ఆరెస్పీ), బి.సురేందర్‌రెడ్డి (ఫార్వర్డ్‌బ్లాక్), తాంద్రకుమార్ (ఎంసీపీఐ-యు), సిహెచ్ మురహరి (ఎస్‌యుసీఐ-సీ), విజయ్‌కుమార్ (సీపీఐ ఎంఎల్), భూతం వీరన్న (సీపీఐ ఎంఎల్) ఉన్నారు.

11
హైదరాబాద్
గురువారం 3-8-2017
www.navatelangana.com
కిసాన్
నవతెలంగాణ



కొన్ని వ్యాధులు, పరాన్నజీవుల కారణంగా గొర్రెలు పుట్టిన కొన్నిరోజులకే మృత్యువాత పడుతుంటాయి. ముఖ్యంగా రెండు నెలల వయసులో ఇవి ఎక్కువ. జలుబు, దగ్గు, జ్వరం వంటి సమస్యలతో జబ్బు చేసిన ఒకట్రెండు రోజుల్లోనే మృతిచెందుతుంటాయి. గొర్రెలు పుట్టినప్పటి నుంచి మాంసం కోసం కోతకు అమ్మేంత వరకు సాధారణంగా ఇలాంటివి సంభవిస్తాయి. ఈ మరణాలు ఐదు శాతం మించకుండా ఉన్నప్పుడే జీవాల పెంపకం వృత్తి లాభదాయకంగా ఉంటుంది.

రోగాలు రాకుంటేనే ఫాయిదా

గొర్రెలు వ్యాధుల బారినపడకుండా జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి. ముఖ్యంగా వాతావరణం చల్లబడినప్పుడు అప్రమత్తంగా ఉండాలి. పుట్టిన వెంటనే వాటిని వెచ్చటి ప్రదేశంలో ఉంచాలి. చల్లటి నేల మీద కాకుండా ఏదైనా పొడిగుడ్డ లేదా గోనె సంచివంటి బస్తాలపై పడుకోబెట్టాలి. నేల ఎప్పుడు పొడిగా ఉండేటట్టు చూడాలి. మూత్రం పోసిన వెంటనే ఆరేలా తగిన సూర్యరశ్మి నేలపై పడేలా పాక నిర్మాణం చేసుకోవాలి. చల్లటి గాలులు తగలకుండా కవర్‌తో కప్పాలి. కిటీలు, తలుపులు ఉన్నట్టయితే మూసేయాలి. వీలైతే ఈనిన మొదటి 15 రోజులు లేదా చల్లనివాతావరణంలో మొదటి నెలరోజులు రాత్రి వేళల్లో తల్లిని, పిల్లని ఇంట్లో ఉంచడం ఉత్తమం. నెలలోపు చిన్న పిల్లలు నేల మట్టిగానీ, గోడ మట్టిగానీ నాకకుండా జాగ్రత్తపడాలి. మట్టి ద్వారా ఇ.కొలై, క్లాస్ట్రీడియం లాంటి సూక్ష్మక్రిములు వ్యాపించి విరేచనాలు అవుతాయి. దీంతో ఒంట్లో నీరు తగ్గిపోయి (డీహైడ్రేషన్) పిల్లలు వెంటనే చనిపోతాయి. ఇవే కాకుండా జీవాల పెంపకంలో పలు జాగ్రత్తలు పాటించాలి. ప్రధానంగా సమతుల్యాహారం-మేత, వ్యాధి నిరోధక చికిత్స తదితర అంశాలపై దృష్టిపెట్టాలి.

- గొర్రె పుట్టిన వెంటనే మొదటి 30నిమిషాల్లోగా తల్లిపాలు తాగించాలి. జున్ను పాలలో మాంసకృత్తులు, రోగనిరోధక శక్తినిచ్చే ఇమ్యునోగ్లోబులిన్స్ అధికంగా ఉంటాయి. పిల్ల శరీర బరువులో పదోవంతు కనీసం జున్నుపాలు తాగించాలి. పిల్ల ఎదిగే కొద్దీ పాల పరిమాణం కూడా పెరగాలి. మొదటి 15 రోజుల వరకు పూర్తిగా తల్లిపాల మీదనే పిల్లల పోషణ జరగాలి. ఒక వేళ ఏదైనా కారణం చేత, తల్లివద్ద పాలు లేకపోయినా లేదా తక్కువ పాలు లభించినా పిల్లకు మాత్రం పాలలోటు లేకుండా చూసుకోవాలి. లేదంటే ఇతర గొర్రె, మేక, ఆవు, బర్రె పాలు సీసా ద్వారా పట్టించొచ్చు.
- 15 రోజుల వయసు వచ్చిన తర్వాత మిశ్రమ దాణా (క్రీపుఫీడ్) తల్లిపాలతోపాటుగా శరీర బరువులో ఒక శాతం అందించాలి. దీంతో పిల్లల్లో ఎదుగుదల రావాల్సినంతగా (జన్యుసామర్థ్యం ప్రకారం) వస్తుంది. వాటిలో రోగనిరోధక శక్తి సమకూరుతుంది. 15 రోజుల వయసులో గొర్రెపిల్ల బరువు 3 కిలోలు ఉంటుందనుకుంటే 30గ్రాముల క్రీపు దాణా తల్లి పాలకు అదనంగా రోజూ ఇవ్వాలి.



- నెల వయసు వచ్చినప్పటి నుంచి వాటికి సులభంగా జీర్ణమయ్యే ఆకులు అందించాలి. సుబాబుల్ ఆకులు, వేప ఆకులు, అరిసె ఆకులు వంటివి తినిపించాలి. ఇలా ఇవ్వడం వల్ల పిల్లలకు 45 రోజుల వయస్సు వచ్చేసరికి వాటిలో జీర్ణకోశ వ్యవస్థ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుంది. పెద్ద జీవాలతోపాటు అన్ని రకాల మేతలు తిని అరిగించుకునే స్థాయిలో పిల్లల్లో రూమెన్ (కసరుపొట్ట) పెరుగుతుంది.
- కులవృత్తి చేసేవారు 30 నుంచి 45 రోజుల వయసు పిల్లలను తల్లితో పాటు మేతకు తీసుకెళ్లడం గమనిస్తుంటాం. శాస్త్రీయ పద్ధతి ప్రకారం పిల్లలను 90 రోజులు వయసు వచ్చే వరకు బయటికి మేత కోసం తీసుకెళ్లొద్దు. తీసుకెళ్లడం ద్వారా పిల్లలు తల్లితో సమానంగా నడవడం వల్ల అలిసిపోతాయి. మూడు నెలల వయసు వచ్చిన తర్వాత పిల్లలను తల్లి నుంచి వేరు చేయాలి. అలా వేరుచేయడాన్ని 'వీనింగ్' లేదా 'ఎడం చేయడం' అంటారు. ఇలా చేయడం దశ దాటేంత వరకు పిల్లల్లో ఐదు శాతానికి మించి మరణాలు ఉండకూడదు. అవి కూడా సహజ మరణాలు అయ్యుండాలి. మొదటి మూడు నెలల వరకు పిల్లల మేపుపై ఎంత శ్రద్ధ వహిస్తామో అంతే జాగ్రత్త వాటి ఆరోగ్య సంరక్షణపై కూడా తీసుకోవాలి.
- గొర్రె పుట్టగానే మొదటి రోజు ఒక డోసు టీటీ ఇంజెక్షన్ ఇప్పించాలి. రెండో రోజు నుంచి ఐదు రోజులపాటు అక్సిటెట్రాసైక్లిన్ పొడి మందును రోజుకు 50 మి.గ్రాముల చొప్పున విటమిన్ ద్రావణంతో (వైమెరాల్ లాటివి)పాటు అందించాలి. రెండో నెల మొదటి వారంలో మళ్లీ ఒకసారి యాంటీబయోటిక్ పొడి, విటమిన్ సిరప్ అందించాలి. రెండో నెల దాటగానే మొట్టమొదటసారిగా బద్దెపురుగు (అంతర పరాన్న జీవుల) నివారణ కోసం నట్టల మందు తాగించాలి. ఆ తర్వాత ప్రతి రెండు నెలలకోసారి 12 నెలల వయసు వచ్చే వరకు ఇస్తుండాలి. దీంతో నట్టల కారణంగా సంభవించే మరణాలను పూర్తిగా అరికట్టొచ్చు.
- గొర్రె పిల్లలను ముఖ్యంగా మూడు వ్యాధుల నుంచి రక్షించుకోవాలి. అందులో మొదటిది చిటుకు రోగం. రెండోది నల్లబాటు, మూడోది పారుడురోగం. రెండు నెలల వయసులో మొదటిసారి నట్టల మందు తాగించిన 3 నుంచి 7 రోజుల్లోపు చిటుకు రోగం టీకాలు వేయించాలి. 15 రోజుల తర్వాత నల్లబాటు టీకాలు, మరో 15 రోజుల తర్వాత పారుడు రోగం టీకాలు వేయించాలి. కొన్ని ప్రాంతాల్లో బొబ్బరోగం, తల్లిరోగం, మశూచివ్యాధి, ప్రబలుతుంది. అలాంటప్పుడు తల్లి టీకాలు ఇప్పించుకోవడం శ్రేయస్కరం.

పాక్షిక సాంద్ర పద్ధతి

జీవాల్లో నట్టల మందు, రోగనిరోధక టీకాలు ఇప్పించడంతోపాటు శాస్త్రీయంగా మేపు యాజమాన్య పద్ధతులు పాటిస్తే పెంపకం మరింత లాభదాయకంగా ఉంటుంది. పాక్షిక సాంద్ర పద్ధతిలో చూడి గొర్రెలకు, ఈనిన గొర్రెలకు, పుట్టిన పిల్లలకు అందించాల్సిన అదనపు ఆహారాన్ని దాణా అంటాం. దీన్ని గొర్రెల పెంపకందారులే స్వయంగా ఇంటి వద్ద తయారు చేసుకోవచ్చు. దాణా తయారీలో మొక్కజొన్న గింజలు, బియ్యం తవుడు, పప్పులపరం, వేరుశనగ (పల్లి) చెక్కను ప్రధానంగా వినియోగించాలి.

దాణా తయారీ (కిలోల్లో)

	చిన్నజీవాలకు	పెద్ద జీవాలకు
నలగొట్టిన మొక్కజొన్నలు	50	50
నూనె తీసిన బియ్యం తవుడు	10	15
పప్పుల పరం	15	20
వేరుశనగ పల్లి చెక్క	25	15
లవణ మిశ్రమం (మినరల్ మిక్చర్	2	1
తినే ఉప్పు	2	1
తినే సోడా	1	1

ఒకసారి కలుపుకున్న దాణాను వారం రోజుల వరకు తేమ తగలకుండా నిల్వ చేసుకోవచ్చు. పెద్ద జీవాలకు వాటి శరీర బరువులో ఒక శాతం దాణాను అందించాలి. ఉదయం మేతకు పంపే ముందు దాణా, పరిశుభ్రమైన నీరు అందించాలి. పిల్లలకు వాటి శరీర బరువులో ఒకటి నుంచి ఒకటిన్నర శాతం వరకు దాణా అందించాలి.

దాణా మోతాదు

గొర్రెలకు అందించాల్సిన దాణా 350 గ్రాముల నుంచి 450 గ్రాముల వరకు ఉండాలి. చిన్నపిల్లలో పుట్టిన మొదటి 15 వ రోజు నుండి 25గ్రాములతో మొదలు పెట్టి ప్రతినెలా 50 గ్రాముల చొప్పున పెంచుకుంటూపోవాలి. పిల్ల కోత బరువు (మాంసం కోసం) 30 కిలోల వచ్చే వరకు దాణా ఇవ్వాలి. ఈ విధంగా దాణా పెడితే ఆరు నెలల వయసు వచ్చేసరికి గొర్రెలు కోత బరువుకొస్తాయి.

డాక్టర్ వలువదాసు అశోక్‌కుమార్
పశువైద్యశాల
సహాయ సంచాలకుడు,
స్టేషన్‌ఘనపూర్-జనగామ జిల్లా



✪✪✪✪ ✪✪✪✪ ✪✪✪✪ ✪✪✪✪ ✪✪✪✪ ✪✪✪✪ ✪✪✪✪ ✪✪✪✪ ✪✪✪✪ ✪✪✪✪ ✪✪✪✪ ✪✪✪✪ ✪✪✪✪ ✪✪✪✪ ✪✪✪✪ ✪✪✪✪



ట్రాక్టర్ వినియోగంలో జాగ్రత్తలు

వ్యవసాయ పనులకు ట్రాక్టర్ల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. వివిధ పథకాల ద్వారా రైతన్నలు ఈ వాహనాలను కొనుగోలు చేసి ఉపయోగిస్తున్నారు. అయితే.. వీటి నిర్వహణ గురించి చాలా మందికి సరైన అవగాహన ఉండదు. ట్రాక్టర్‌ని పనితీరు, సాంకేతిక సమస్యల గురించి క్షుణ్ణంగా తెలుసుకుంటే నష్టాల బారి నుంచి బయటపడొచ్చు.

- ట్రాక్టర్ నిర్వహణ సరిగా లేకపోతే 25 శాతం డీజిల్ వృథా అవుతుంది. డ్రైవింగ్ చేసేటప్పుడు ఏదైనా లోపం కనిపించినా, అలాంటి అనుమానం కలిగినా అధీకృతమైన గ్యారేజీ లేదా డీలర్‌ని సంప్రదించాలి.
- డీజిల్ కారడాన్ని అరికట్టడం ముఖ్యం. ప్రతి సెకనుకు ఒక బొట్టు చొప్పున కారినా సంవత్సరానికి 2 వేల లీటర్ల డీజిల్ నష్టపోతారు. దీన్ని నిర్మూలించేందుకు ముందు జాగ్రత్తగా ప్రతిరోజూ ఫ్యూయల్ ట్యాంక్, పంపు, ఇంజక్టర్, లైన్స్ తనిఖీ చేస్తుండాలి.
- ట్రాక్టర్ నిలిపినప్పుడు ఇంజన్ ఆఫ్ చేయాలి. లేదంటే ప్రతి గంటకు ఒక లీటరుకు పైగా డీజిల్ వృథా అవుతుంది.
- బ్యాటరీ, డైనమో, సెల్ఫ్‌స్టార్టర్‌లను ఎప్పుడూ పని చేసే స్థితిలో ఉంచుకోవాలి.
- ట్రాక్టర్‌ని సరైన గేర్‌లోనే నడిపించాలి. తప్పుడు గేర్‌వేసినట్లయితే 30శాతం డీజిల్ అధికంగా ఖర్చవుతుంది. పొలం పని ఉత్పాదన తగ్గిపోతుంది. బరువు లాగడానికి మూవ్‌మెంట్‌తో గేర్ మార్చుకోవాలి. ట్రాక్టర్ పొగ వదులుతుందంటే ఓవర్‌లోడ్ అయ్యిందని అర్థం.
- ట్రాక్టర్ పొగ అధికంగా వదులుతూ ఉంటే నాజిల్స్ పరిక్షించుకోవాలి.
- మీ ట్రాక్టర్ ఇంజన్‌కి .మురికి ప్రధాన శత్రువు. సాధారణంగా దుమ్మూధూళిలోనే ట్రాక్టర్లు పని చేయాల్సి ఉంటుంది. కాబట్టి మంచి ఎయిర్ ఫిల్టరేషన్ చాలా ముఖ్యం. ఫిల్టర్ కాని ఎయిర్ వల్ల మామూలు కంటే సిలిండర్ బోర్ 45 రెట్లు, పిస్టన్ రింగులు115 రెట్లు త్వరితంగా అరిగిపోతాయి. నాణ్యమైన ఫ్యూయల్ ఫిల్లర్లనే వాడాలి.
- చక్రాలు జారిపోతూ ఉంటే డీజిల్ వృథా అవుతుంది. వాటర్ బ్యాలెస్ట్‌లు లేదా పోత ఇనుము బరువులు చేర్చడం ద్వారా ట్రాక్టర్ చక్రాలు జారిపోకుండా చూడాలి. చక్రం జారడం అతి తక్కువగా ఉండే విధంగా సరైన బరువును జోడించండి. పొలం పనులు పూర్తికాగానే బ్యాలెస్ట్‌లు తొలగించాలి.
- అరిగిపోయిన టైర్లు అలాగే వాడితే ట్రాక్టర్‌లో లాగే శక్తి తగ్గుతుంది. సకాలంలో టైర్లను రీట్రేడింగ్ చేయించాలి.
- టైర్లను తిరిగి అమర్చేటప్పుడు ముందు నుంచి చూసినట్లయితే 'వీ' ట్రేడ్లు కిందివైపు ఉండేటట్టు జాగ్రత్త వహించాలి. సరైన టైర్ ప్రెషర్ ఉండేలా చూసుకోవాలి.
- బరువుతో సమానంగా లాగుడు శక్తి ఉండేలా చూసుకోవాలి.

- మోత్కూరు యాదయ్య

రైతుల సందేహాలు నిపుణుల సమాధానాలు

'కాపర్ ఆక్సిక్లోరైడ్'తో నారుకుళ్లు నివారణ

బీరలో బూజు తెగులు నివారణ ఎలా?

- రామిరెడ్డి కోరుట్ల (జగిత్యాల జిల్లా)

ఒక మాదిరి వర్షంతో కూడుకున్న చల్లటి వాతావరణంలో ఈ తెగులు ఆశిస్తుంది. మొదట్లో లేత ఆకుపచ్చ, ముదురు ఆకుపచ్చ కలిసి మొజాయిక్‌లా కనిపిస్తుంది. తర్వాత ఆకుల పైభాగాన పసుపు రంగు మచ్చలు, అడుగు భాగాన ఊదా రంగు మచ్చలు,.బూజు వంటి పదార్థం ఏర్పడుతుంది. ఆకులు పండిబారి ఎండిపోతాయి. దీని నివారణకు లీటరు నీటిలో 2.5 గ్రాముల మాంకోజెబ్ లేదా 2 గ్రాముల మెటలాక్సిల్ ఎమ్‌జెడ కలిపి పిచికారీ చేయాలి.

బొప్పాయిలో బూడిద తెగులును ఎలా నివారించాలి?

- వాహిద్, గజ్వేల్ (సిద్ధిపేట జిల్లా)

ఆకులపైన, కొమ్మలపైన, కొత్త చిగుర్లపైన తెల్లటి బూడిద లాంటి శిలీంధ్రపు పెరుగుదల కనిపించనప్పుడు లీటరు నీటిలో 3 గ్రాముల నీటిలో కరిగే గంధకం లేదా ఒక మి.లీటరు కెరాథేన్ లేదా 2 మి.లీటర్ల కొనజోల్ కలిపి పిచికారీ చేయాలి.

టమాటను వడలు తెగులు ఆశించింది. ఏం చేయాలి?

- రమ, ఖమ్మం

ఈ తెగులు కారణంగా మొక్క అడుగు భాగంలోని ఆకులు పసుపు రంగులోకి మారుతాయి. తొడిమె సహా రాలి, తర్వాత మొక్క వడలిపోయి చనిపోతుంది. దీని నివారణకు బలమైన మొక్కల నుంచి విత్తనాలు ఎన్నుకోవాలి. తెగులును తట్టుకునే బీటీ 1 వంటి రకాలను వాడుకోవాలి. పంట మార్పిడి పద్ధతిని పాటించాలి.

మిరపలో నారుకుళ్లు తెగులు నివారణ ఎలా?

- కృష్ణ, గుండ్లపల్లి (నల్లగొండ జిల్లా)

ఈ తెగులు కారణంగా లేత మొక్కల కాండం మెత్తబడి గుంపులు, గుంపులుగా నారు చనిపోతుంది. దీని నివారణకు లీటరు నీటిలో 3గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ కలిపి లేదా ఒక శాతం బోర్డోమిశ్రమంతో విత్తనం మెలకెత్తిన వెంటనే ఒకసారి, తిరిగి వారం రోజులకోసారి పిచికారీ చేయాలి. ఎత్తయిన నారుమడులలో నారును పెంచాలి. విత్తనం వత్తుగా విత్తకూడదు. కిలో విత్తనానికి 3 గ్రాముల కాప్టాన్‌తో గానీ మాంకోజెబ్‌తో గానీ విత్తన శుద్ధి చేయాలి.

మేలైన సన్న వరి రకాలు ఏవి?

- రమేష్ యాదవ్, ఉప్పునూతల
గ్రా, మం, నాగర్ కర్నూల్ జిల్లా

తెలంగాణ సోన, సాంబమసూరి, కృష్ణ, ప్రాణహిత, జగిత్యాల మసూరి, పోలాస ప్రభ, వరంగల్ సన్నాలు, వరంగల్ మసూరి, సురేఖ, భద్రకాళి, అంజన, రామప్ప, జగిత్యాల సన్నాలు.

వర్షాధార పంటల్లో అంతరకృషి

వ్యవసాయం.. వాతావరణం

గడిచిన మూడు రోజుల్లో రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిశాయి. పగటి ఉష్ణోగ్రతలు 31-36 డిగ్రీల సెల్సియస, రాత్రి ఉష్ణోగ్రతలు 21-27 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అందించిన సమాచారం ప్రకారం రాబోయే ఐదు రోజుల్లో రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే సూచనలున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 32 నుంచి 37 డిగ్రీల సెల్సియస్ మధ్య , రాత్రి ఉష్ణోగ్రతలు 20 నుంచి 26 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉంది.

రైతన్నలకు సూచనలు

- కంది, ఆముదం, సోయాచిక్కుడు, పత్తి, మొక్కజొన్న తదితర వర్షాధార పంటల్లో అంతరకృషి చేస్తుండాలి. కలుపు నివారించి నేలలోని తేమను సంరక్షించుకోవాలి.
- వరి పంటను తాటాకు తెగులు, కాండం తొలిచే పురుగు ఆశించేందుకు ప్రస్తుత వాతావరణ పరిస్థితులు అనుకూలం. తాటాకు తెగులు నివారణకు లీటరు నీటిలో 2 మి.లీటర్ల ప్రోఫినో ఫాస్ లేదా 2.5 మి.లీటర్ల క్లోరిపైరిఫాస్ మందును కలిపి పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగు నివారణకు ఎకరానికి 10 కిలోల కార్బోపురాన్ 3జీ గుళికలు లేదా 4 కిలోల ఫోరేట్ గుళికలను నాటిన 15 నుంచి 20 రోజుల తర్వాత పొలంలో వేసుకోవాలి.
- మొక్కజొన్నలో కాండం తొలిచే పురుగు ఆశించకుండా 12 నుంచి 15 రోజుల వయసున్న పైరుకు లీటరు నీటిలో 1.6 మి.లీటర్ల మోనోక్రోటోఫాస్ లేదా 0.3 మి.లీటరు క్లోరాంట్రానిలిప్రోల్ మందును కలిపి పిచికారీ చేయాలి. ఆ తర్వాత దశలో ఆశించిన పైరుకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఎకరానికి నాలుగు కిలోల చొప్పున ఆకు సుడుల్లో వేయాలి.
- పత్తిలో రసం పీల్చే పురుగులు గమనించడమైంది. దీని నివారణకు మోనోక్రోటోఫాస్ మందు, నీటిని 1:4 నిష్పత్తిలో కలిపి లేత కాండంపై మొత్తని బ్రష్‌తో విత్తిన 20 నుంచి 40 రోజులకు పూయాలి.
- ఆముదం పంటను దాసరి పురుగు ఆశించింది. దీని నివారణకు కొన్ని సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలి. పొలంలో ఎకరానికి 10 పక్షి స్థావరాలను అమర్చాలి. దాసరి పురుగు మొదటి దశలో పరాన్న జీవులకు హాని చేయకుండా 5 మి.లీటర్ల వేపనూనెను లీటరు నీటిలో కలిపి ఆకుల అడుగు భాగం తడిచేలా పిచికారీ చేయాలి. పొలంలో దాసరి పురుగును ఆశించే మైక్రోప్లైటిస్ పరాన్నజీవి ఉనికిని గమనించాలి. పరాన్నజీవి ఆశించినట్టయితే ఏ విధమైన పురుగు మందులు పిచికారీ చేయెుద్దు. పరాన్నజీవి పొలంలో లేనట్టయితే 1.5 గ్రాముల ఎసిఫేట్ లేదా 1 మి.లీటర్ల నోవాల్యూరాన్ లేదా 2 మి.లీటర్ల ప్రోఫినోఫాస్ లేదా 1.5 గ్రాముల థయోడికార్బ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- కూరగాయల పంటల్లో రసం పీల్చే పురుగులు గమనించడమైంది. నివారణకు లీటరు నీటిలో 0.3 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ మందును కలిపి పిచికారీ చేయాలి.

అడగండి.. చెబుతాం!

రైతన్నలూ.. పంటల సాగు, పశుపోషణ తదితర విషయాల్లో మీకేమైనా సమస్యలున్నాయా.. పరిష్కారం దొరకక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా..? మీ సందేహాలకు సమాధానాలు ఇచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. మీరు చేయాల్సిందల్లా ఈ కింది చిరునామాకు పోస్ట్‌కార్డు రాయడం లేదా ఇ-మెయిల్ చేయడం లేదా నేరుగా ఫోన్ చేసి సమస్య వివరించడమే.

మా చిరునామా

'కిసాన్' పేజీ, నవ తెలంగాణ దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ఫ్లాట్ నెం. 21/1, ఆజమాబాద్, ఆర్.టి.సి

మార్కెట్ ధరలు (క్వింటాకి రూ.లలో)

వేరుశనగ	
గద్వాల్	5,800
వరంగల్	4,300
సూర్యాపేట	3,701

ఎండుమిర్చి (మొదటి రకం)	
హైదరాబాద్	12,800
వరంగల్	5,600
ఖమ్మం	5,300

ఎండుమిర్చి (రెండో రకం)	
హైదరాబాద్	5,400
వరంగల్	2,100
ఖమ్మం	1,500

కందులు	
తాండూరు	3,805
వరంగల్	3,416
సూర్యాపేట	3,716

పసుపు (కొమ్ము)	
వరంగల్	7,200
నిజామాబాద్	7,956

పసుపు (గోళా)	
వరంగల్	6,800
నిజామాబాద్	7,374

మొక్కజొన్నలు	
నిజామాబాద్	1,510
వరంగల్	1,590
హుస్నాబాద్	1,650
చొప్పదండి	1,561
కామారెడ్డి	1,365


జొన్నలు	
భైంసా	1,717

ముడిపత్తి	
వరంగల్	4,980
జమ్మికుంట	5,200
మహబూబాబాద్	5,200
కేసముద్రం	5065

వడ్లు సాంబా మసూరి	
కేసముద్రం	2,302
వైరా	1,550
సూర్యాపేట	2,139
మహబూబాబాద్	2,299

'లోకేశ్ రాహుల్ రెగ్యులర్ ఓపెనర్. ధావన్, ముకుంద్‌లలో ఒకరు అతడికి దారి ఇవ్వాల్సిందే. గత రెండేండ్లలో రాహుల్ జట్టుకు ఎంతో చేశాడు. గాయం నుంచి కోలుకున్న తర్వాత అతడు జట్టులో చోటుకు పూర్తిగా అర్హుడు. ఎవరి స్థానంలో రాహుల్ వస్తాడనేది జట్టు సమావేశంలో నిర్ణయిస్తాం. కానీ కొలంబోలో రాహుల్ ఆడటం మాత్రం ఖాయం. ఓపెనింగ్ స్థానంపై భరోసా ఇవ్వటం మా బాధ్యత. ప్రాక్టీస్ మ్యాచుల్లోనూ రాహుల్ చక్కగా ఆడాడు. అతడిని అభద్రతా భావానికి లోను కానివ్వం. గాయాల కారణంగా పునరాగమనానికి ఇబ్బంది రాకూడదు'

- విరాట్ కోహ్లి



గాలెలో రికార్డు విజయం సాధించిన కోహ్లిసేన సిరీస్‌పై కన్నేసింది. కొలంబోలోనే టెస్టు సిరీస్‌ను సొంతం చేసుకోవాలని తపిస్తోంది. నెం.1 జోరుమీదున్న టీమ్ ఇండియాను నిలువరించటం లంకేయులకు కష్టమే. కెప్టెన్ చండిమాల్ పునరాగమనం ఆతిథ్య జట్టు బలం పెంచేది అయినా, అది కోహ్లిసేనపై ప్రభావం చూపలేదు. రెండో టెస్టుకు స్పిన్ వికెట్ సిద్ధమైన నేపథ్యంలో.. ఇరు వైపులా ముగ్గురు మాయాగాళ్లు మోహరించనున్నారు. కొలంబో స్పిన్ మేళాలో కోహ్లిసేక కొట్టేస్తుందా, సిరీస్‌ను పట్టేస్తుందా!.

కొలంబోలోనే కొడతారా?



• సిరీస్‌పై కోహ్లిసేన గురి • ఒత్తిడిలో శ్రీలంక

- 50వ టెస్టు ఆడనున్న పుజారా
- నేటి నుంచే రెండో టెస్టు సమరం
- ఉదయం 10 నుంచి సోనీసిక్స్‌లో ప్రసారం...

నవతెలంగాణ-కొలంబో

రెండు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం శ్రీలంకలో టెస్టు సిరీస్ విజయం సాధించిన కోహ్లిసేన.. వరుసగా రెండోసారి లంక నుంచి సిరీస్‌తో తిరిగిరావాలని చూస్తోంది. మూడు మ్యాచుల టెస్టు సిరీస్‌లో ఇప్పటికే గాలెలో ఘన విజయం సాధించిన టీమ్ ఇండియా.. రెండో టెస్టులోనే సిరీస్ ఫలితాన్ని సాధించే ప్రయత్నంలో ఉంది. జట్టు మొత్తం భీకర ఫామ్‌లో ఉండటంతో లంకేయులను కొలంబోలోనే ఖతం చేయటం పెద్ద సమస్య కాబోదు!. కానీ కొలంబోలో స్పిన్ ట్రాక్ ఎదురుచూస్తుం డటానికి తోడు ఆతిథ్య శ్రీలంక ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగుతుండటం ఆసక్తి రేకెత్తిస్తోంది. కానీ కోహ్లిసేన సైతం ముగ్గురు స్పిన్నర్లతోనే ఆడనుండటం లంకేయులకు సవాలే. ఈ టెస్టుతో చటేశ్వర్ పుజారా తన కెరీర్‌లో 50వ టెస్టు మ్యాచ్ ఆడనున్నాడు. గత 2015 సిరీస్‌లోనూ పుజారా ఇక్కడ మెరిశాడు. దీంతో మైలురాయి మ్యాచ్‌లో అతడి ప్రదర్శనపై ఆసక్తి నెలకొన్నది.



తిరుగులేని దూకుడు : టీమ్ ఇండియా టెస్టుల్లో తిరుగులేని ఫామ్‌లో కొనసాగుతోంది. గాలెలో మెరుపు సెంచరీ వీరుడు శిఖర్ ధావన్, 50వ టెస్టు హీరో చటేశ్వర్ పుజారాలపైనే అందరి దృష్టి నెలకొన్నది. సుదీర్ఘ విరామం తర్వాత జట్టులోకి వచ్చిన ధావన్.. ఫామ్ కొనసాగిస్తాడా లేదా అనేది చూడాలి. నిలకడగా ఆడే పుజారా స్పెషల్ టెస్టులో ప్రత్యేక ఇన్నింగ్స్ కోసం ఎదురుచూస్తున్నాడు. కెప్టెన్ విరాట్ కోహ్లి, రహానెలు పరుగుల వేటలో ముందంజలోనే ఉన్నారు. లోకేశ్ రాహుల్ ప్రదర్శన సైతం చూడదగినదే. ఇక స్పిన్ విభాగంలో అశ్విన్, జడేజా, కుల్‌దీప్‌లు 20 వికెట్లు కూల్చగల సమర్థులు. స్పిన్ స్వర్గధామైన కొలంబోలో వీరి ప్రదర్శనపైనే ఫలితం ఆధారపడి ఉంటుంది. పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య బెంచ్‌కు పరిమితమయ్యేలా కనిపిస్తున్నాడు.

తుది జట్లు (అంచనా)

భారత్ : లోకేశ్ రాహుల్, శిఖర్ ధావన్, చటేశ్వర్ పుజారా, విరాట్ కోహ్లి, అజింక్య రహానె, వృద్ధిమాన్ సాహా, రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్, ఉమేశ్ యాదవ్, మహ్మద్ షమి.


శ్రీలంక : ఉపుల్ తరంగ, దిముత్ కరుణరత్నె, కుశాల్ మెండిస్, దినేశ్ చండిమాల్, ఎంజెలో మాథ్యూస్, నిరోశన్ డిక్‌వాలా, ధనంజయ డిసిల్వ, దిల్‌రువన్ పెరీరా, రంగన హెరాత్, మలింద పుష్పకుమార, నువాన్ ప్రదీప్.

సారథి వచ్చాడు : గాలెకు దూరమైన శ్రీలంక కెప్టెన్ దినేశ్ చండిమాల్ కొలంబోలో మళ్లీ సారథ్య పగ్గాలు అందుకోనున్నాడు. భారత్ ముందు బ్యాట్‌తో తేలిపోయిన శ్రీలంక రెండో టెస్టులో పోటీనిచ్చేలా కనిపిస్తోంది. కరుణరత్నెకు తోడు కెప్టెన్ చండిమాల్, పెరీరాలు మంచి ఫామ్‌లో ఉన్నారు. తొలుత బ్యాటింగ్ చేస్తే భారీ స్కోరు చేయగలరు. దీంతో కొలంబోలో ఆతిథ్య జట్టు అవకాశాలు ఆశాజనకంగానే కనిపిస్తున్నాయి. ఉపుల్ తరంగ, మెండిస్‌లు సైతం రాణిస్తే లంకు తిరుగుండదు. బౌలింగ్ విభాగంలో రంగన హెరాత్ స్పిన్‌ను భారత్ తుత్తునీయలు చేయటం లంకేయులకు ఆందోళనగా మారింది. ముగ్గురు స్పిన్నర్లతో ఆడినా కోహ్లిసేను అడ్డుకోగలమా అనే అనుమానం లంకేయులలో లేకపోలేదు.

రాహుల్ ఇన్ : వైరల్ ఫీవర్‌తో తొలి టెస్టుకు దూరమైన ఓపెనర్ లోకేశ్ రాహుల్ కొలంబోకు సిద్ధమయ్యాడు. ఫిట్‌నెస్ సాధించిన రాహుల్ గాలెలోనే జట్టుతో చేరాడు. ప్రాక్టీస్ సెషన్‌లోనూ హుషారుగా కనిపించాడు. రాహుల్ రాక ఖాయమని కెప్టెన్ కోహ్లి సైతం స్పష్టీకరించాడు. దీంతో అభినవ్ ముకుంద్ బెంచ్‌కు పరిమితం కాకతప్పదు. గాలెలో దుమ్మురేపిన ధావన్ కొనసాగనున్నాడు. శ్రీలంక శిబిరంలో కెప్టెన్ చండిమాల్ తిరిగి రానున్నాడు. శ్రీలంక సైతం ముగ్గురు స్పిన్నర్లతో ఆడనున్నది. దీంతో మలింద పుష్పకుమార అరంగ్రేటం చేయనున్నాడు.

పిచ్ రిపోర్ట్
ఇక్కడ జరిగిన గత టెస్టులో ఏకంగా ఐదు సెంచరీలు నమోదయ్యాయి. పిచ్ పూర్తిగా పచ్చిక లేకుండా కనిపిస్తోంది. అయినా, మూడో రోజు గానీ బంతి తిరిగే అవకాశం లేదనే చెప్పవచ్చు. దీంతో మళ్లీ టాస్ కీలక పాత్ర పోషించనున్నది. ఐదు రోజుల పాటు వర్షం ముప్పు పొంచి ఉన్నది.

50 టెస్టుల్లో రెండు వేల పరుగుల మైలురాయి చేరుకునేందుకు రవిచంద్రన్ అశ్విన్ చేయాల్సిన పరుగులు 50



50 భారత బ్యాట్స్‌మన్ చటేశ్వర్ పుజారాకు ఇది కెరీర్ 50వ టెస్టు. పుజారా ఇక్కడ ఆడిన ఏకైక టెస్టులో అజేయంగా 145 పరుగులు సాధించాడు.



వీడలే.. ఓటమి బాట

తెలుగు టైటాన్స్‌కు వరుసగా నాల్గో ఓటమి

- బెంగాల్ చేతిలో 24-30తో పరాభవం
- గుజరాత్, హర్యానా 'టై'నందం

నవతెలంగాణ క్రీడాప్రతినిధి-హైదరాబాద్

ప్రో కబడ్డీ సీజన్ టైటిల్ ఫేవరేట్లలో ఒకటిగా బరిలోకి దిగిన తెలుగు టైటాన్స్.. సొంతగడ్డపై మరో ఓటమి మూటగట్టుకున్నది. వరుసగా నాల్గో మ్యాచ్‌లో ఓటమిపాలై పేలవ ప్రదర్శన కొనసాగిస్తోంది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో బుధవారం బెంగాల్ వారియర్స్‌తో జరిగిన పోరులో తెలుగు టైటాన్స్ చిత్తుగా ఓడింది. 24-30తో బెంగాల్ వారియర్స్‌కు మ్యాచ్‌ను అప్పగించేసింది. స్టార్ రైడర్, కెప్టెన్ రాహుల్ చౌదరి వైఫల్యం తెలుగు టైటాన్స్ ప్రదర్శనపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రాహుల్ బెంగాల్‌పైనా విఫలం కావటంతో టైటాన్స్‌కు చుక్కెదురు తప్పలేదు. బెంగాల్ వారియర్స్ తరఫున మహిందర్ సింగ్, జంగ్ కున్ లీ అదరగొట్టడంతో ఆ జట్టు అలవోకగా గెలుపొందింది. ఈ సీజన్‌లో గచ్చిబౌలిలో జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో పట్నా పైరేట్స్‌తో తెలుగు టైటాన్స్ నేడు తలపడనున్నది. తొలి మ్యాచ్‌లో తమిళ తలైవాస్‌పై విజయంతోనే సరిపెట్టిన టైటాన్స్.. విజయంతో సొంతగడ్డ సీజన్‌ను ముగిస్తుందేమో చూడాలి.

టైటాన్స్ చతికిల : బెంగాల్ వారియర్స్‌తో మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ ఏ దశలోనూ మెరుగైన ప్రదర్శన చేయలేదు. రైడ్, డిఫెన్స్‌లలో దారుణంగా విఫలమైంది. కూతకెళ్లి బెంగాల్ 19 పాయింట్లు సాధించగా, టైటాన్స్ మాత్రం 16తోనే సరిపెట్టుకున్నది. డిఫెన్స్‌లో బెంగాల్‌తో సమవుజ్జీగా నిలిచినా.. కీలక తరుణంలో మెరవలేదు. మహిందర్ సింగ్ ఏకంగా 11 పాయింట్లతో విజృంభించగా, జంగ్ కున్ లీ 8 పాయింట్లు తీసుకొచ్చి విజయంలో కీలక పాత్ర పోషించాడు. కానీ తెలుగు టైటాన్స్‌లో వికాశ్ ఒక్కడే 9 పాయింట్లు సాధించగా.. మిగతా రైడర్లు విఫలమయ్యారు. 12సార్లు కూతకెళ్లిన రాహుల్ కేవలం ఐదు పాయింట్లే సాధించాడు. రాకేశ్ కుమార్ ఒక్క టాకిల్‌తోనే సరిపెట్టాడు. ప్రథమార్థం ముగిసే సమయానికి 19-14తో ఐదు పాయింట్ల ఆధిక్యంలో కొనసాగిన బెంగాల్ వారియర్స్ 30-24తో ఆరు పాయింట్ల తేడాతో విజయం సాధించింది.

గుజరాత్, హర్యానా 'టై' : రెండు కొత్త జట్ల మధ్య జరిగిన ఉత్కంఠ పోరులో ఏ జట్టూ ఓటమి పాలుకాలేదు. గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్, హర్యానా స్టీలర్స్ మ్యాచ్ 27-27తో టైగా ముగిసింది. ఇరు జట్లూ విజయం కోసం ఆఖరి రైడ్ వరకూ పోరాడినా.. నరాలు తెగే ఉత్కంఠకు డ్రా ముగింపు దక్కింది. విరామ సమయానికి 11-8తో గుజరాత్ ముందంజలో నిలిచినా.. ద్వితియార్థంలో హర్యానా చెలరేగిపోయింది. వికాష్ ఖండోలా ఏడు రైడు పాయింట్లు, డిఫెన్స్‌లో సురేందర్ నడా మరో ఏడు టాకిల్స్‌తో రెచ్చిపోగా.. హర్యానా స్టీలర్స్ మ్యాచ్ గెలిచేలా కనిపించింది. గుజరాత్ తరఫున మహేంద్ర గణేష్ రాజ్‌పుత్ (5), పర్వేష్ బైన్స్‌వాల్ (3) మెరిశారు. ఆట ఆఖరు నిమిషానికి ముందు 27-26తో హర్యానా ఓ పాయింట్ ఆధిక్యంలో నిలిచింది. ఈ సమయంలో మహేంద్ర రాజ్‌పుత్ సక్సెస్‌ఫుల్ రైడ్‌తో స్కోరు సమం చేశాడు. ఇక ఆఖరి రైడ్‌లో వికాష్ ఖండోలా పాయింట్ తీసుకురావటంలో విఫలం కావటంతో 27-27తో ఉత్కంఠ పోరు టైగా ముగిసింది.


ప్రో కబడ్డీ లీగ్-5



ప్రో కబడ్డీలో నేడు
తెలుగు టైటాన్స్ x పట్నా పైరేట్స్
రాత్రి 8 గంటలకు
వేదిక : గచ్చిబౌలి స్టేడియం
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం...
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం

క్వార్టర్స్‌లో జోష్న, పల్లికల్

- ప్రపంచ డబుల్స్ స్క్వాష్ చాంపియన్‌షిప్స్



మాంచెస్టర్ : భారత స్టార్ స్క్వాష్ జోడీ దీపికా పల్లికల్, జోష్న చిన్నప్పలు ప్రపంచ డబుల్స్ స్క్వాష్ చాంపియన్‌షిప్స్‌లో క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించారు. మహిళల డబుల్స్‌లో వరుస విజయాలు సాధించిన తమిళ జోడీ అలవోకగా క్వార్టర్స్‌కు చేరుకున్నది. గ్రూప్-బిలో మిగతా రెండు జోడీలను ఓడించిన పల్లికల్, చిన్నప్ప క్వార్టర్స్‌లో కెనడా అమ్మాయిలతో తలపడనున్నారు. మూడో సీడ్ పల్లికల్ జోష్నలు ఎవాన్స్, సఫ్రె (వేల్స్)లపై 11-8, 11-7తో సునాయాస విజయం సాధించారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో సౌరవ్ గోశల్, దీపికా పల్లికల్ జోడీ 11-7, 11-4తో గ్రూప్-బి లీగ్ మ్యాచ్‌లో మలేషియా జంటను ఓడించారు. గ్రూప్-సిలో విక్రమ్ మల్హోత్రా, జోష్న చిన్నప్ప జంట 11-9, 11-9తో న్యూజిలాండ్ జోడీపై గెలుపొందింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో తొలి మ్యాచుల్లోనే గెలుపొందటంతో.. గ్రూప్‌లో రెండో స్థానంలో నిలిచిన క్వార్టర్స్‌కు చేరటం ఖాయం.

ప్రీ క్వార్టర్స్‌లో కశ్యప్, ప్రణయ్



న్యూజిలాండ్ ఓపెన్

ఆక్లాండ్ : భారత షట్లర్లు న్యూజిలాండ్ ఓపెన్ గ్రాండ్ ప్రీ గోల్డ్ టోర్నీలో శుభారంభం చేశారు. సీనియర్ ఆటగాడు పారుపల్లి కశ్యప్, హెచ్.ఎస్ ప్రణయ్‌లులు ప్రీ క్వార్టర్స్‌లో కాలుమోపారు. పురుషుల సింగిల్స్ విభాగంలో హెచ్.ఎస్ ప్రణయ్ 23-21, 21-18తో ఇండోనేషియా క్రీడాకారుడు ఫిర్మన్ అబ్దుల్ కోహ్లిక్‌పై వరుస సెట్లలో గెలుపొందాడు. కామన్వెల్త్ గేమ్స్ గోల్డ్ మెడలిస్ట్ కశ్యప్ 21-9, 21-8తో న్యూజిలాండ్ షట్లర్ ఆస్కార్‌పై అలవోక విజయం సాధించాడు. ప్రీ క్వార్టర్స్‌లో వీ నాన్ (హాంగ్‌కాంగ్)తో ప్రణయ్ తలపడనుండగా, సహచర ఆటగాడు సౌరబ్ వర్మతో కశ్యప్ పోరాడనున్నాడు. ఏడో సీడ్ వర్మ 21-16, 21-16తో ఇండోనేషియా ఆటగాడిపై గెలుపొందాడు. 16వ సీడ్ సిరిల్ వర్మ 21-14, 21-16తో ఇండోనేషియాకే చెందిన ఆటగాడిని ఓడించి ప్రీ క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు.

అమిత్ షా..విమానాల్లో ప్రయాణించలేదట

• హోటళ్లలో బస చేయడం నచ్చదట.. • బీజేపీ హయాంలో అవాస్తవాల ప్రచారం



జెట్ విమానంలో అమిత్ షాను ఇంటర్వ్యూ చేస్తున్న జర్నలిస్టు (ఫైల్)

న్యూఢిల్లీ: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి అవాస్తవాల ప్రచారం తారాస్థాయికి చేరింది. ఓవైపు పాలకులు వాస్తవాలను మరుగున పరచడాన్నే పనిగా పెట్టుకుంటుండగా.. మరోవైపు మీడియా కూడా దీనికి తోడ్పాటునందిస్తోంది. ఇలాంటిదే.. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా విషయంలో ఒక ప్రముఖ ఆంగ్ల పత్రిక రాసిన కథనం. అమిత్‌షా చాలా సాదాసీదాగా ఉంటారనీ, పార్టీ ప్రచార కార్యక్రమాలకు తప్ప మిగతా సందర్భాల్లో విమానాల్లో ప్రయాణించలేదనీ ఆ పత్రిక పేర్కొన్నది. అంతేకాక, పర్యటనలకు వెళ్లినప్పుడు పార్టీ కార్యకర్తల నివాసాల్లో బస చేస్తున్నారు తప్ప హోటళ్లలో ఉండటానికి అస్సలు ఇష్టపడరని వెల్లడించింది. అయితే.. ఇది పూర్తిగా తప్పని 'ఆల్ట్ న్యూస్' స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే అమిత్ షాకు సంబంధించి కొన్ని వాస్తవాలను బహిర్గత పరిచింది.

1 ప్రయివేటు జెట్ విమానంలో అమిత్‌షాను ఇంటర్వ్యూ చేస్తున్న చిత్రాలను జర్నలిస్టు రాహుల్ కన్వాల్ ఈ యేడాది ఫిబ్రవరిలో సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

2 మార్చిలో బీరేన్‌సింగ్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యేందుకు వెంకయ్యానాయుడుతో కలిసి అమిత్ షా ప్రత్యేక విమానంలో ఇంఫాల్‌కు బయలుదేరారు. అయితే మార్గమధ్యంలో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో తిరిగి ఢిల్లీకి చేరుకున్నారు.

3 మార్చిలోనే అమిత్‌షా పది సీట్ల కెపాసిటీ గల అద్దె విమానంలో సోమ్‌నాథ్ ఆలయానికి చేరుకున్నట్టు న్యూస్ రిపోర్టుల ద్వారా వెల్లడైంది.

4 ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆయన హరిద్వార్‌కు ప్రయాణించినట్టు వీడియో ఫుటేజీలు కూడా బహిర్గతమయ్యాయి.

5 2016లో.. తీవ్ర కరువుతో దేశంలోని చాలా ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బంది పడుతున్న తరుణంలో అమిత్‌షా రాకకోసం హెలిప్యాడ్‌ను సిద్ధం చెయ్యడానికి వేల లీటర్ల నీటిని వృథా చేశారన్న వార్తలు కూడా వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే.

6 గతనెలలో తిరువన్నమలై గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో తయారు చేసిన హెలిప్యాడ్‌పై షా ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ల్యాండ్ అయ్యింది.

7 ఇటీవల బెంగళూరులోని తాజ్, ముజాఫర్‌నగర్‌లోని స్టార్ హోటళ్లలో అమిత్‌షా బస చేసినట్టు ఆధారాలు లభ్యమయ్యాయి.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.